స్థాపితము ౧౯౩౩.　　　　సాలు చందా రు. 3.

# ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు సచిత్రాంధ్ర మాసపత్రిక

## విషయసూచిక


౧. శచీదేవి ... ౮౪౯
—చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాద్ బి.ఏ.

౨. ఆనాడు ... ౮౫౨
—పెమ్మరాజు రాజగోపాలము బి.ఏ.

౩. కథారచన ... ౮౫౩
—కొడవటిగంటి కుటుంబరావు

౪. విస్మృతనగరము ... ౮౫౬
—శేషాద్రి రమణకవులు

౫. యక్షుడు—ప్రవరాఖ్యుడు ... ౮౫౯
—పురాణం కుమారరాఘవశాస్త్రి బి.ఏ.

౬. ఒక స్నేహితునకు ... ౮౬౨
—గోదావరి సత్యనారాయణ బి.ఏ.

౭. భారతీయ గ్రంథాలయములు ... ౮౬౪
—మారేమండ రామారావు ఎం.ఎ.;బి.ఇడి.

౮. కిశోరక్రీడలు ... ౮౬౭
—పమ్మి రామశాస్త్రి

౯. ఆంధ్రప్రబంధములయుత్పత్తి ... ౮౭౨
—వేటుమళ్ళ అచ్యుతరావు ఎం.ఎ. యల్.టి

౧౦. నిజరాగము ... ౮౭౬
—కవికొండల వెంకటరావు బి.ఏ.;బి.యల్.

౧౧. నభూతో నభవిష్యతి ... ౮౭౭
—మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ బి.ఏ.బి.ఇడి.

౧౨. ప్రేమరత్నము ... ౮౮౫
—రాజ్యలక్ష్మి

౧౩. దగాయెక్కడో - దేవుడూ అక్కడే... ౮౮౬
—తల్లాప్రగడ ప్రకాశరాయుడు యం.ఏ.

౧౪. ఔదార్య ... ౮౯౨
—భూతపురి నారాయణస్వామి

౧౫. ఊహలు—ఉరకలు ... ౮౯౪
—'కాశ్యపి'

౧౬. లవంగి ... ౮౯౯
—బాగు గోపాలరావు

౧౭. బాలబాంధవి ... ౯౦౦
—కొప్పర్తి నారాయణమూర్తి యల్.టి

౧౮. విమానం సరదా ... ౯౦౬
—తాత కృష్ణమూర్తి బి.ఏ.యల్.టి.

౧౯. ఇతర్వాచ్యరెన్నువిషయములు ... ౯౧౩
—శనివారపు సుబ్బారావు

మీ మదరాసు మిత్రుల మనవి!

# రాయన్స్ లిటరరీ యేజెన్సీ

కొప్పర్తి.
నారాయణమూర్తి,
బి.ఏ.యల్.టి.
వ్యవస్థాపకుడు.

AUTHORSHIP
MANUSCRIPT REVISION
BOOK-SUPPLYING
ADVERTISING
CANVASSING
JOURNALISM
PRINTING
DRAWING
DESIGNING
ENGRAVING
BLOCK-MAKING
LITERARY ADVICE
RUBBER STAMP MAKING
TUTORING

RAYAN'S LITERARY AGENCY
G.T. MADRAS

24-25
ఆదియప్పనాయక్ వీధి,
జార్జిటౌన్,
మదరాసు.

సారస్వతప్రపంచమున కృషిసల్పుచున్న మహాశయుల ప్రోత్సాహముపై మేము నూతనముగ నొక సారస్వత ప్రచారనిలయమును విద్యాభిమానుల సౌకర్యార్థము స్థాపించితిమి.

మన దేశమున చక్కగ గ్రంథముల రచింపగలవారనేకులున్నను వారి రచనలను ప్రచురించి తగు ప్రోత్సాహమిచ్చువారరుదుగనుండుటచే వారి జ్ఞానవిశేషముల ఫలితమును ప్రజలు పొందజాలకున్నారు. ప్రచురణకర్తలు పుస్తకముల నచ్చొత్తించినను వానికి వ్యాప్తి కలుగుట కవకాశమును కొలదిగనేయున్నది ఎట్టి పుస్తకములు, ఎట్టి వ్యాసములువ్రాసిన ప్రజల యభిరుచికి తగునో తెలిసికొనుట రచయితలకును ప్రకాశకులకును కర్తవ్యము. గ్రంథముద్రణమునందు కావలసిన చిత్రపటములను దిమ్మలను చక్కగ తయారుచేయువారును, గ్రంథముల నింపుగ ముద్రించువారును మదరాసునందు తప్ప ఇతరచోట్ల సాధారణముగ దొరకకపోవుటచే గ్రంథకర్తలును ప్రకాశకులును పలుపాట్లు పడుచున్నారు. వేర్వేరు విక్రయశాలలనుండి పుస్తకములను తెప్పించుకొనుటలో పుస్తకవ్యాపారస్థులు చాల వ్యయప్రయాసలకు లోనగుచున్నారు.

ఏ వ్యాపారస్థులకైనను వ్యాపారసౌకర్యములు సులభముగ చేకూరు మదరాసునందొక ప్రతినిధియుండుటవసరము. నమ్మకముగ మీ పనుల నిచ్చుట సమకూర్ప సంసిద్ధులమై మేము మీ ప్రోత్సాహము నాశించుచున్నాము.

## అమూల్యమైన మా సహాయము.

గ్రంథకర్తలకు :— మీ గ్రంథముల యొక్కయు, వ్యాసముల యొక్కయు వ్రాతప్రతులను ప్రకాశకులకు చూపి వానిని ప్రచురింప ప్రోత్సహింతుము. కోరిన యెడల వ్రాతప్రతులను సవరించి చక్కగ నకలు తయారుచేయుదుము. గ్రంథములకును వ్యాసములకును ఇతివృత్తము, రచనావిధానము చూపగలము.

ప్రచురణకర్తలకు :— కోరినమాదిరి వ్రాత ప్రతుల నందజేయుదుము. ఒక భాషనుండి మరియొక భాషలోనికి గ్రంథములను తర్జుమాచేయుదుము. ముఖ్యముగ పాఠశాలలకుపయోగించు గ్రంథముల వ్రాతప్రతులు మావద్ద అనేకములు గలవు. పుస్తకములలోని యంశములకును ముఖపత్రమునకును ప్రకటనకును మిక్కిలి తగియుండు పటములను, దిమ్మలను పంపుదుము. పుస్తకము, కేటలాగులు, ప్రకటనపత్రములు మొదలైనవానిని చక్కగ నచ్చొత్తించుదుము మీరు ప్రచురించిన పుస్తకములను ఎల్లగడ ప్రదర్శించి యమ్మజూపుదుము; సర్వవిధముల వాని వ్యాప్తికై పాటుపడుదుము

సంపాదకులకు :— మేము సహాయసంపాదకులుగ నుందుము. కోరినవ్యాసములను వ్రాయుదుము. వారు పంపిన వ్యాసములను ప్రచురణకు తగియుండునట్లు సవ

## రాయన్స్ లిటరరీ ఏజెన్సీ

రింతుము హాస్యపటములును, చిత్రప్రశ్నలను వ్రాసి పంపుదుము. వ్యాసముల కుచితమగు చిత్రపటములును, దిమ్మలను పంపగలము.

వ్యాపారస్థులకు:—ప్రకటనలకు పనికివచ్చు ఆకర్షణీయములగు పటములను పంపగలము. కేటలాగులను ప్రకటన పత్రములను తయారుచేయుదుము. ఇచ్చట నుండి ఏ సరకు పంపమనినను పంపగలము ధరలు మొదలగు వ్యాపారరహస్యముల తెలుపుచుందుము

ఎల్లరకు:—పుస్తకములు, పాఠశాలలో పకరణములు, ఇతరసామానులు అందించగలము.

ఇచ్చట మా యునికివలన మీరే మదరాసులో కాపురముండని లోపముండదు. మదరాసులో మీకు కావలసిన పనులన్నిటిని నమ్మకముగ నెరవేర్చగలము. ఏవిధముగ మీకు తోడ్పడగలమో దయచేసి త్వరలో తెలియజేయ ప్రార్థన.

మీ ప్రాతినిధ్యమును స్నేహమును కోరుచున్న,

రాయన్సు లిటరరీ ఏజెన్సీ,

# తర్కసంగ్రహము

తర్కశాస్త్ర పారంగతుడగు అన్నంభట్టు సులభార్థబోధకముగ తర్కసంగ్రహమను గ్రంథమును సంస్కృతమున రచియించెను. దానికి ఆంధ్రతాత్పర్యమును రచియించి చరకమతదీపికా వ్యాఖ్యాయుర్వేద మత వివరణముతో ఆయుర్వేదాచార్య డాక్టరు ములుగు విశ్వేశ్వరశాస్త్రి యల్.ఐ.యమ్., హెచ్.పి.ఐ.యమ్ గారు వెలువరించియున్నారు. ఆయుర్వేదమునకు అత్యావశ్యకమైన పదార్థ విజ్ఞానపటముకూడ యిందుకలదు. ఆయుర్వేదానుబంధముతో వ్రాయబడిన ఈ గ్రంథము ప్రతి ఆంధ్ర ఆయుర్వేదవైద్యునకు ఎంతయు ఉపకరించుటయేగాక ఆంగ్లలాజిక్ విద్యార్థులుకూడ చదువదగినది. వెల రు. 1—0—0.

వలయువారు:—ఆంధ్రభూమి కార్యాలయం, వేపేరి, మద్రాసుకు వ్రాసిన బడయగలరు.

**Tri-Colour Process Blocks**




**M C Appaswamy Chetty & Co.**

PROCESS ENGRAVERS

64 Savarimuthu St Mannady MADRAS

# రామప్రియ

గ్రంథకర్త—'కోటీశుతనయ'ను వ్రాసిన

**తాత కృష్ణమూర్తి, బి.ఏ;యల్.టి.**

ఇది సులభశైలిని వ్యవహారిక భాషలో వ్రాయబడిన స్వతంత్ర కల్పనాకథల పుస్తకము. డాక్టర్ బుర్రా శేషగిరిరావు(ఎం ఏ;పి. హెచ్. డి.) గారి పీఠిక కలదు. క్రౌన్ సైజు, వెల 12 అణాలు. స్త్రీలకు పోస్టుఖర్చులు ఉచితము.

ఈ మనోహరగ్రంథము భాషాసతి కొక మండనమనుట నిక్కువము. —గృహలక్ష్మి.

హాస్యరసగర్భితము. —వినోదిని.

కథలు మిక్కిలి ముచ్చట గూరుచున్నవి. —భారతి.

కథలలోని హద్దుమీరని స్వేచ్ఛయొక్క ఛాయలు చిత్రింపబడినవి. —ఆనందబోధిని.

చిరునామా:

**తాత కృష్ణమూర్తి, భద్రాచలం.**

# ఐరావతి

లక్షా అరువదివేల బర్మాఆంధ్రుల క్షేమాభివృద్ధులకు ప్రతిశనివారము వెలువడు ప్రజాహితపత్రిక. 7 సంవత్సరములనుండి బర్మాఆంధ్రుల శ్రేయోభివృద్ధికై పాటుపడుచున్నది ఇది ఆంధ్రులకుఅండ. కార్మికులకు పట్టుకొమ్మ. యువజనోద్యమమునకు ఉనికి. నిర్మొగమాటముల నిప్పు. అన్యాయముల నంతరింప జేయుటకు బ్రహ్మాస్త్రము. అంతర్యమెరింగినవారికి హాయి. చదివినవారికి ఖుశాయి.

సంవత్సరపుచందా రు. 3-0-0. తపాలాఖర్చులతో 3-12-0.

చిరునామా :

ఐరావతి పత్రికా కార్యాలయము, 283 బార్ స్ట్రీట్, రంగూను.

## రామనామం

[ఉచితముగా పంపబడును.]

కవితాసమితి సభ్యులును, వ్యాసరచనాధురీణులును అగు శ్రీ ముద్దా విశ్వనాథముగారు రచించినది. భక్తులు తప్పక చదువవలసినగ్రంథము. జేబునందిముడు చిన్నసైజున మంచి కాగితములపై అందముగ అచ్చొత్తింపబడినది. తపాలాఖర్చులకు ఒకఅణా తపాలాబిళ్ళ పంపువారికెల్లరకును ఈ గ్రంథము ఉచితముగా పంపబడును.

**విలాసము : వ్యాసకుటీరము, మేడపాక, వయా ఎలమంచిలి, విశాఖపట్టణముజిల్లా.**

# అమోఘమగు ఔషధము

## శుక్లనష్టమును పోగొట్టుటలో రత్నపురుషలేహ్యం

పలుచబడిన వీర్యమును గట్టిపఱచి అమితముగా వీర్యవృద్ధి కలిగించు మూలికలకు రాజు అనదగిన 'రత్నపురుష' ప్రధానద్రవ్యముగా చేయబడిన ఈ లేహ్యమును క్రమముగా సేవించువారు కాయపుష్టి, కండపుష్టినొంది బలారోగ్యములును పొందుదురు. డబ్బీ రూ. 3-0 0.

చరకనిలయము, ఆయుర్వేదౌషధశాల, రాజమండ్రి.

—: ఆంధ్రుల పనినాణ్యము :—

మీ ప్రింటింగు పలువుర నాకర్షించవలెనంటే—ఈ కాలములో విధిగా బొమ్మలు—బ్లాకులు ఉండితీరవలెను. నష్టపడకముందే మీరు మేలుకొనండి! ఆంధ్రదేశీయులగు అందఱు పత్రికాధిపతులు, గ్రంథప్రకాశకులు కూడ చేతి డ్రాయింగు డిజైనులు, యంగ్రేవుడు, హాఫ్టోను బ్లాక్కు వగైరాలకు మాకు ఆర్డరులుఇచ్చి త్వరగా చౌకగా—చక్కగా—మా పనితనమందుకొనండి—మీ కథలలో బొమ్మలు—మీ అడ్వరుటైజుమెంట్లలో బ్లాకులు—చరిత్రలలో మ్యాపులు—మరి ఫోటోబ్లాకులు—సీనరీబ్లాకులు—ఇట్టి అన్నిటికి మాకే వ్రాయండి—ఇది అనుభవజ్ఞులగు పనివారలున్న ఆంధ్రసంస్థ—ఆంధ్రాభిమానము మఱువకండి! మాదిరిపని ఇచ్చిచూడండి!

**పూర్ణా అండుకో—16 చంద్రభానువీధి, మవుండురోడ్డు పోస్టు, మదరాసు.**




యీ ట్రేడుమార్కును చూచిన మోసపోరు.

# అత్యాశ్చర్య కుష్ఠరోగ నిర్మూలిని

(రిజిస్టర్డు.)

గుణములేదని ఋజువుచేయువారికి రు 1000 లు బహుమానము 18 రకముల కుష్ఠులు, బొల్లి, సుఖరోగములు యేస్థితిలో యెంతకాలము నుండి జీర్ణించియున్నను గ్యారంటీగా బాగుచేయుదుము. మృత్యు ముఖమునుండి అనేకవేల రోగులు రక్షింపబడిరి. యింజక్షనువలన ఫలితముగానని రోగులు మామందువలన పూర్ణారోగ్యమును పొందిరి. పూర్తి వివరములకు అన్నిభాషలలోను దొరకు మా కేట్లాగులకు యీ దిగువ యడ్రసుకు వ్రాయుడు.

లక్ష్మీ అండ్ కంపెనీ (రిజిస్టర్డు.)
కుష్ఠు అండ్ సుఖరోగ చికిత్సా నిపుణులు,
అల్లిపురం మెయిన్‌రోడ్డు, వాల్తేరు ఆర్. యస్ పోస్టు.


# నిజామురాష్ట్రమునకు

ఆంధ్రభూమికి ఈ క్రిందివారిని ఛీఫ్ ఏజెంటులుగ నియమించినాము. బ్రిటీషు పోస్టలు సౌకర్యములులేక ఆంధ్రభూమికి చందాకట్టుటలో ఇబ్బందిపడుచున్న నిజాము రాష్ట్రాంధ్రులు ఇకమీదట తమతమ చందాధనమును వారికి పంపుచు ఆవిషయమును ప్రత్యేకముగ మాకార్యాలయమునకుగూడ తెలుపుచుండగలరు. శికిందరాబాదు, హైదరాబాదు వాస్తవ్యులు మాసము మాసము విడిసంచికలు వీరికడ కొనుక్కొనవచ్చును.

ఛీఫ్ ఏజెంటు నామము, చిరునామా :

శ్రీయుత కాలేపు పెంటయ్యగారు, 4121 మూసాఖాన్ వీధి, శికిందరాబాదు.


# ఆంధ్రభూమి ట్రావెలింగు యేజెంటు

శ్రీయుత నేతి కామేశ్వరశాస్త్రిగారిని ఆంధ్రభూమికి ట్రావెలింగు యేజెంటుగ నియమించినారము. కావున ఆంధ్రభూమి అభిమానులు వారికి చందాలనిచ్చి తగుమైన రసీదు పొందవలెనని తెలియజేయుచున్నాము — యిట్లు ఆంధ్రభూమి మేనేజరు.


**కామశాస్త్రము** ఇది వాత్స్యాయనమహర్షి సంస్కృతభాషలో వ్రాసిన సూత్రములకు చక్కని తేటతెల్లమగు తెలుగు సేత. రైలులో అమ్ము పుస్తకాలవంటిదికాదు. సరియైన శాస్త్రగ్రంథము. మనపూర్వులు 'కామ'మను మూడవ పురుషార్థమునకిచ్చిన ప్రాముఖ్యము, ప్రాభవము ఇది చదివినచో తెల్లమగును. అల్లరి చిల్లరి వ్రాతలు కావు ఆదిలో వ్రాసినవారు పూజ్యులగు మహర్షులు కాబట్టి దీని గొప్పతనము సరసులగు చదువరులు గ్రహింతురుగాక. వెల, ఒక్కరూపాయి.

కొత్త సత్యనారాయణచౌదరి, పండిట్, బోర్డు హైస్కూల్, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.

# గమనింపుడు

మా మ్యానర్ ఇన్సూరెన్సు పద్ధతియొక్క అత్యద్భుతమైన అభివృద్ధిని గమనింపుడు.

ఇంతటి కొద్ది కాలములో జరిగిన **42,00,000** ఇట్టి క్రొత్త పద్ధతిని నమ్మగలరా?

## నిజముగ జరిగిన సంగతి

వైద్య పరీక్ష లేదు. స్త్రీ పురుష వివక్షత లేదు.

ఇది శాస్త్రీయమైనది—ఇందు బోనసుగలదు—గ్యారంటీడ్ లాభములనిచ్చును.

---

మీ అర్థాంగితో కలసి ఒకజాయింటు పోలసీని తీసికొనుడు.

---

ఏజెన్సీ షరతులకు, ఇతరవివరములకు నేడే వ్రాయుడు

## ది వీనస్ అస్యూరెన్సు కంపెనీ, లిమిటెడ్, ఢిల్లీ.

మద్రాసు బ్రాంచి: 22, సెకండులైన్ బీచ్, జార్జిటవున్.

మదరాసు రాజధానిలో ఇతర బ్రాంచీలు:—1. విజయనగరము, 2. గుంటూరు, 3. తెలిచ్చేరి, 4 ట్యూటికారిన్ లేక సదరన్ యిండియా డిస్ట్రిక్టుస్.



# కరుణగీతము

[ఉచితముగా పంపబడును]

వేటాడబడిన లేడి వేటరికి తన పరివేదనము వెడలబోసికొనుట ఇందు వివరింపబడినది. గుండెను కరగించు ఘట్టము. చదివితీరవలసినదే. అంచెకూలికై యొకయణా తపాలాచీటిపంపిన యొక్కొక్కరికి 'కరుణగీత' యొక్కొక్కప్రతి పంపబడును. త్వరపడుడు. విలాసము: విజ్ఞానవల్లిక, అనంతపురము.



నొప్పుల నివారించుటలో సాటిలేనిది. బుడ్డి వెల 0-5-0.

# హనుమాన్ పెయిన్ బాం



పలుతావులయందు పలువురచే వాడబడి తృప్తికరముగా పనిచేసినట్లు యోగ్యతాపత్రములను పడసినది. అన్ని విధములైన నొప్పులకు, కత్తిగాట్లకు, జెణుకు నొప్పులకు, వరిబీజములకు, వాపులకు, జలుబులకు, చిగురు ఉబ్బులకు, తిమ్మురులకు నమ్మకమైన మందు. ఎంత తలనొప్పియైన 2, 3 నిమిషములలో గారంటీగా పోవును.

హెడ్ ఆఫీసు: హనుమాన్ పెయిన్ బామ్ వర్క్సు, 89 పూనమల్లి హైరోడ్. పి. టి. మదరాసు.

ఏజంట్లు: పి. స్వామినాయుడుగారు, ప్రొప్రయిటర్, శ్రీరామక్రిష్ణ ట్రేడింగుకంపెని, నర్సారావుపేట.

కె నాగభూషణరావుగారు, తాడేపల్లిగూడెం, వెస్టుగోదావరిజిల్లా.

వి. బుచ్చిఅబ్బాయి అండు సన్సు, చికాకోలు, గంజాం జిల్లా.

ఏజెంట్లు లేనితావులయందు ఏజెంట్లు కావలెను. మంచికమీషను ఈయబడును.

# శిశుపోషణి

ఇది చిన్నపిల్లలకు కలుగు సమస్తవ్యాధులను బోగొట్టి పిల్లల ఆరోగ్యమును వృద్ధిబొందించును. దీనిని ప్రతినిత్యమును వాడుచుండిన బల్లపెరుగుట, కోరింతదగ్గు, బాలాపస్మారము, పాలు కక్కుట మొదలగు క్రూరవ్యాధులు రాకుండ కాపాడును. మూడుమాసముల వయస్సు మొదలు 5 సం॥ ముల వయస్సువచ్చువరకు నుపయోగింపవచ్చును. ఉపయోగించువిధానము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రల సీసా అణాలు 4.

ఇంకను ఇప్పటికాలమున ప్రతినిత్యము సేవింపదగిన "కూష్మాండరసాయనము", ద్రాక్షారిష్టము, స్వర్ణాదివటి (టానిక్కు-పిలుస్సు), హిమసారతైలము (జేడింగ్ అండ్ హైరాయిల్) మొదలగు ఔషధములు మావద్ద సిద్ధముగా నున్నవి.

వలయువారు—

**లక్ష్మీనారాయణకంపెనీ, కాకినాడ.**

**డ్రగ్గు కెమికల్‌స్టోర్సు, వెస్టుకలక్టరేటు, గుంటూరు.**

**భారతవైద్యనిలయము, వేపేరి, మదరాసు, అని వ్రాయవలెను.**

# స్వర్ణమాలిని

ఇయ్యది కాసరోగములను, జీర్ణజ్వరములను, విషమజ్వరములను బోగొట్టి మిక్కిలి సుగుణమిచ్చును. క్షయరోగములయందు మిక్కిలి యుత్తమము. వారమురోజులమందు. రు 4-0-0.

## బ్రహ్మీతైలము.

జ్ఞాపకశక్తిని వృద్ధిచేసి మెదడునకు చలువనిచ్చును. ఉన్మాదఅపస్మారములను పోగొట్టును.

6 ఔన్సులువెల 1-0-0

ఇతర ఆయుర్వేదౌషధములన్నియు దొరకును.

భవానీ ఫార్మసి.

320, తంబుశెట్టి వీథి, మదరాసు.

# ది సౌత్ ఇండియా కో-ఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

పోస్టుబాక్సు నెం 182 రు. మద్రాసు

ఈసొసైటీలో ప్రీమియములు చాలతక్కువే! ఎందుచేత? కార్యనిర్వహణమునకగు ఖర్చు చాల తక్కువగుటచేత.

దక్షిణహిందూదేశమున కంతకు నీ సొసైటీ యొక్కటియేనా? ఔను ఎందువలన? సహకారధర్మముల మీద నడుపబడుటవలన.

జనసామాన్యమునకు చాల ఉపయోగించునట! ఏ విధమున? రు 100 లు తక్కువ మొత్తము మొదలు రు 5000 లు వరకు మాత్రమే పాలసీలు జారిచేయుట వలన

దీనిలో కార్యనిర్వహణవ్యయము చాలతక్కువా? ఔను. ఎట్లు? సహకారసంఘలాభములను పొందుటచేతను, విశేషవ్యయమునకు కారణమగు బ్రాంచి ఆఫీసుల నెలకొల్పక పోవుటచేతను.

బ్రాంచి ఆఫీసులస్థాపింపకయే మంచివ్యాపారము చేయుచున్నట్లున్నది. ఏలాగున? రాజధానిలోని సహకార సంస్థల కనుబంధములుగా లోకల్ బోర్డులను స్థాపించి.

ఈ ప్రణాళిక పాలసీదారులకు చాల సౌకర్యమే! ఔను. మనియార్డరునకగు కమీషనుఖర్చు లేకుండ పాలసీదారులు సహకారసంస్థలలో వారి ప్రీమియములను చెల్లింపవచ్చును.

సహకార సంఘలాభము లెవ్వి? ముఖ్యమైనవా? ఔను. రాబడిపన్ను లేకపోవుట, స్టాంపుడ్యూటీ లేకపోవుట మొదలైనవన్ని. పాలసీదారులే వాటాదారులగుట.

నీకు లాభముకావలెనా, నష్టముకావలెనా? లాభమే. ఐన, ఆలస్యముచేయక నేడే ఈ సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీలో నొక పాలసీ తీసికొనుము.

# ఆర్యరసాయనశాల, ముక్త్యాల

## సువర్ణసుందరరసము
## సర్వసవామేహములకు
## సంజీవివంటిది

ఎటువంటి సవామేహములనైన కుదుర్చును. ఇంజక్షనులు అవసరములేదు. అనేకులు వాడి మెచ్చియున్నారు 60 ఏండ్లు వైద్యమున అనుభవము గల కీ. శే. వేటూరి సుందరశాస్త్రి గారిచే కనిపెట్టబడినది. వాడువిధము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రలు: రు. 5-0-0.

## అభ్రకభస్మము.

—: అమృతమువంటిది :—

బహుమూత్రమును, క్షయను, దగ్గును పోగొట్టి వీర్యవృద్ధిని గలిగించును. మూత్రమునందుండు చక్కెరను మాయము చేయును. ప్రశస్తమైన రసాయనము.

వెల: తులము 1 కి: రు. 5-0-0.

కన్సల్టింగు ఫిజీషియన్ :—

ఆయుర్వేదభూషణ వేటూరి శంకరశాస్త్రి గారు, ఎ.ఎం.ఎ.సి

"ఆంధ్రభూమి"



శ్రీయుత
శనివారపు సుబ్బారావు గారు.

"ఆంధ్రభూమి"



ఆయుర్వేదాచార్య

డాక్టర్ యం. విశ్వేశ్వర శాస్త్రి గారు,

ఎల్. ఐ. యం., హెచ్. పి. ఐ. యం.

(Courtesy of Journal of Indian Medicine.)

# రుచీదేవి

(వచనరూపకము.)

అంకము ౫ : రంగము ౧.

కాలము : ఉదయము.

స్థలము : అరణ్యమునందలి పల్లెయందొక కుటీరము

(తెల్లనిచీర దాల్చి వెలవెలబోవు కనులతో, చిక్కుపడియున్న కురులతో, పాలిపోయిన మొగముతో, కటికనేలను చీరచెరగు పరచుకొని, మహారాణి రుచీదేవి. కుటీరమున ఎడమవైపునకు తిరిగి పరుండియున్నది. సమీపమున పద్మ. ఆమెవెనుక వేరొక దాసియగు కురంగి నిలచియున్నారు. పద్మయొకింత ముందునకు వంగి.)

పద్మ:—అమ్మా! పూలచెట్లకు నీరుబోసితిమి తమవంతుచెట్లు అట్లే నిలచియున్నవి.

రుచీదేవి:—(కుడివైపునకు తిరిగి కనులు విప్పి, ద్వారమునుండి లోనికి వచ్చుచున్న సూర్యకిరణములకు చేయి నడ్డుపెట్టి, పద్మను తిలకించి) ఏమి ?

పద్మ:—మిగిలియున్న పూలచెట్ల కీనాడు నీరుపోయరా ?

రుచి:—ఈదినము తెల్లవారక పూర్వమె చెట్లన్నింటికి నీరుపోసితిని, శ్రద్ధతో చూచిన పాదులయందు తడి కన్పింపగలదు.

పద్మ:—నీరు ఇంకిపోయినది కాబోలు. తల్లీ! తెల్లవారకపూర్వమె ఎవ్వరి కెఱుక లేకయే లేచి జలకమాడి, చెట్లకు నీరుపోసినారా? మేమందర ముండియు లాభమేమి? ఒంటరిగ చీకటిలో పోవలదు. తోటకు దక్షిణముననున్న జాజిగుంపు విరియబూసినది, అందొక త్రాచుపాము కలదనియే మా తలంపు. యికపై మమ్ము వదలి పోవలదు, యిట్లంటిమని కోపింపవలదు. పనులన్నియు మీరే నిర్వహించుకొనుచుండ నింకమే మెందులకు ?

రుచి:—(చిరునగవుతో) వెఱ్ఱిదానా త్రాచుపాము నన్ను ముట్టుకొనునా? ముట్టుకొనినచో, నా రక్తమునందలి విషము దానిని పరిమార్చునుగాని, దాని కోఱల లోని విషము నన్నేమియు చేయజాలదు. పాము కఱచి మరణించునంతటి యదృష్టము మీ పాతకురాలికి గలదా ? ముమ్మాటికిని లేదు. నాకును మృత్యుదేవతకును ఇపుడెంతో వైరము; ఆదరము మీర ఆహ్వానించినను ఆమె పెడమొగము త్రిప్పినది. గుణవంతుల యాహ్వానములను జనులు పరిగ్రహింతురుగాని, పాపాత్ముల పలుకు లాలించువారెవరు ?

పద్మ:—అమ్మా ! ఈదినము కళ్యాణసుందిరమున కేగినారా ? (వెనుదిరిగిచూచి, నాలుక కఱచుకొని, తనలో) అయ్యో ! కురంగి యుండగనే దేవి నిట్లు ప్రశ్నించితి నేమి ? అయినను కురంగి మంచిమనిషి ; ఇట్లు ప్రశ్నించినందులకు దేవి ఏమనుకొనునో ?

రుచీ :—(ఆలోచించి) అన్నిపనులు తీరినవి. పద్మా! నీవింక వెడలిపొమ్ము.

పద్మ:—వెడలిపోవుచున్నాము. గడచిన విషయములను త్రవ్విపోసికొని హృదయము నుడికింపజేసికొనవలదు. విశ్రాంతి గైకొనుడు. (కురంగి, పద్మ, వెడలిపోదురు.)

రుచి:—నేనిపు డొంటరిగనున్నాను.—ఔను—ఒంటరిగనున్నాను—అన్ని విషయములం దొంటరిగనే యున్నాను. నాకిక దిక్కెవ్వరు?— దిక్కులేని వారికి దేవుడే దిక్కు అను పలుకులయం దెంతవరకు సత్యముకలదు? పరాత్పరుని చెయిదములు, అర్థవంతములని అనుకొనవలయునా? 'నీవే దిక్కని పాదములపై బడిన వారికి మంచి దినములే లేవు; 'పరాత్పరు డెచ్చట నున్నాడ'ని ప్రశ్నించు నాస్తికుల భాగ్యమున కంతులేదు! ఈచిత్రమేమి? పూర్వజన్మమున పూజలు సల్పిన వారీజన్మమున భగవంతుని పాటింపకున్నను వారి యునికికి అంతరాయము రానేరదు. ఈజన్మమునం దెన్ని పూజలు సల్పినను, పూర్వజన్మమునందలి పాపములవలన కష్టములు కడతేరనేరవు—పూర్వజన్మమనియు—ఉత్తరజన్మమనియు. కలవా? ఎందులకీ నిరర్థకపు టాలోచనలు? ఎవరియదృష్టము వారిది—అదృష్టమనునది ఎట్లుండును? (వెనుతిరిగిచూచి) పద్మా ఎందులకో వచ్చియున్నావు?

పద్మ:—అమ్మా! వెలుపల పెక్కుమంది నిలచియున్నారు.

రుచి:—ఎందులకు వచ్చినారు?

పద్మ:—గడచినమాసమున ఈపల్లె కుత్తరముగ, తమరొక పెద్ద తటాకము త్రవ్వించియున్నారు; మొన్నటి వర్షమున కా తటాకము జలముచే నిండిపోయినది, ఈయూరి ప్రజలందరా తటాకమును గాంచి ఎంతయో సంతసమందినారు. పుడిసెడు నీరైన దొరకని ఈ యడవియం దా తటాకమెంతో, ఉపయోగముగా నుండునని ప్రతివారును తలచిరి, కాని పరాత్పరు డేలనో దయజూపింపలేదు, దురదృష్టవశమున కట్టకు గండిపడినదట, జలమంతయు నిరర్థకముగ వెలుపలకు పోవుచున్నదట; ఈయూరి ప్రజలందరచ్చటే గుంపులుగూడి యున్నారు. గంగమ్మ తల్లి కెన్నిసారులో మ్రొక్కుకున్నారు, కాని ప్రయోజనమేమి? ఎన్ని బండలను దొర్లించినను నీరు నిలచుటలేదట, గంపలతో మన్ను బోయుచున్నారట, అడవినుండి చెట్లను కొట్టుకొనివచ్చి అడ్డము వేయుచున్నారట. కొందరు పసుపుకుంకుమలతో గంగను పూజించుచున్నారట, కాని, నీరు నిముసమైనను నిలచియుండలేదట, ఏమిచేయుటకును తెలియక కొందరిచ్చట కరుదెంచియున్నారు. తమకీవిషయము విశదపరువవలెనని కోరుచున్నారు.

రుచి:—పద్మా! పరాత్పరుడే మనకు దిక్కు, ఆదయామయుడే అలిగినచో మనమేమిచేయగలము? అయినను కొంత దనుక ప్రయత్నించి, తుదిని భగవంతునిపై భారము వైచుట యుక్తము. పద్మా! వెనుకాడవలదు. ఈగ్రామమునందున్న ప్రజలనందరరావించి, ఒకసారి ప్రయత్నించుట యుక్తము, ఎంత ద్రవ్యమైనను కానిమ్ము. నీరు నిలచునంత వరకు కొండలనైనను దొర్లించుకొని వచ్చి అడ్డువైచుటకు ప్రయత్నింపవలయును. సత్వరము ఈవార్త ప్రజలందర కెఱింగించి పని జరిపింపవలయును.

పద్మ:—తల్లీ! మీప్రయత్నమునకు పరాత్పరుడు సంతసించి నీరు నిలుపకుండునా?

ఈవార్త అందర కెఱిగింప పోయివచ్చెదను. (నిష్క్రమించును)

రుచి:—తల్లీ! గంగాభవానీ! నీకెందులకీ కోపము? భర్తను పరిమార్ప నడుముగట్టిన పాతకురాలిచే నిర్మింపబడిన తటాకమునందు నిలచియుండుట కిష్టము లేదు కాబోలు! అయ్యో! నాకు దిక్కెవ్వరు? పరాత్పరుడే నాపై పగబూని యున్నాడు కాబోలును! పరాత్పరుడు నిర్గుణుడు కదా! (ఆశ్చర్యముతో ముందునకుచూచి) పద్మా! అప్పుడే వచ్చితివేమి?

పద్మ:—తల్లీ! గండి పూడ్చబడినదట, నీరు నిలచిపోయినదట

రుచి:—ఎట్లు? నీకీ వార్తనెవరు తెల్పిరి?

పద్మ:—ఇప్పుడే మరికొందరాతటాకము కడనుండి వచ్చియున్నారు. తటాకము నరబలి కోరినదట—ప్రజలు కోరికను తీర్చిరట—నీరు నిలచినదట.

రుచి:—(ఆశ్చర్యముతో) నరబలి!

పద్మ:—ఒక స్త్రీకి శివమువూని గంగమ్మ తల్లి నరబలి కోరుచున్నదని తెల్పినదట. ఆమెయే. పెదకంబడు, చినకంబడను తన కుమారులను గండియందు దుముక నాజ్ఞాపించెనట; వారట్లే గావించిరట. వెంటనే గండిలో మన్నుగ్రుమ్మరించిరట: నీరు నిలచినదట.

రుచి:—ఎంతటి స్వార్థత్యాగము. ఆ తటాకమును కంబముచెరువనియు, ఈ పల్లెను కంబపురి, అనియు ఇకపై వ్యవహరించుట యుక్తము. ఈదినమే ఈవిషయము గ్రామమెల్లడ చాటించి, ప్రజలందరకు అన్నదానము చేయుటట్లేర్పాట్లు గావింపవలయును.

పద్మ:—అట్లే గావింపవచ్చును. ఈదినమే మన పరివారమున కీవిషయము తెల్పెదను. తమ యనుజ్ఞ ననుసరించి పనులు జరిపింప సర్దారున కెరింగించెదను.

రుచి:—సత్వరము పనులు జరిపింపవలయును, వెడలిపొమ్ము. (పద్మ నిష్క్రమించును.)

(తెర.)

అంకము ౫ : రంగము ౨.

కాలము : రాత్రివేళ.

స్థలము : కంబపురియందొక కుటీరము.

(నీరుకలసిన నూనెయగుటచే. చిటపటలాడుచున్న దీపమునకు సమీపమున, పద్మ, కురంగి కూర్చుండియుందురు. తలవంచుకొని ఏదియో ఆలోచించుచున్న పద్మను తిలకించి, కురంగి:)

కురంగి:—పద్మా! నిన్నొకసంగతి యడుగ దలచితిని. ఏమందువు?

పద్మ:—ఏమందును! అడుగవచ్చును.

కురం:—నీవు మా యందరిలో పెద్దదానవు. నీ సుగుణములను గాంచియే దేవిగారు నిన్ను గౌరవించుచున్నారు. ఈనాడుదయము మన మిఱువురను దేవి సన్నిధియందున్నపుడు, 'కళ్యాణమందరమని' ఏదియో చెప్పవచ్చి మరల మిన్నకుంటివేమి? కళ్యాణమందిర మెచ్చటగలదు? ఈవిషయము నాకు తెల్పదగినదని నీకు తోచిననే

తెల్పుము, లేకున్న మించిపోయినది లేదు.

పద్మ:—(చిరునగవుతో) ఇందు తెల్ప రాని దేదియును లేదు. మన పిచ్చితల్లి తిరిగి కృష్ణరాయలవారి యనుగ్రహమును సంపాదింప నెన్నియోపాట్లు పడుచున్నది. ఆయమ్మను తిలకించిన నాగుండె పగిలిపోవుచున్నది. ఏమనిచెప్పను కురంగీ! ఆమె దేహమున రక్తము క్షీణించిపోవుచున్నది. ఇట్లే యున్న ఆమె కొలదిదినములలో ......

కురం:—అయ్యో! నాకు భయమగుచున్నది: మనకు దిక్కెవ్వరు? మనకు దిక్కెవ్వరు?

పద్మ:—ఆతల్లి ప్రతిదినము తన కుటీరమున కెదురుగా నున్న వేరొక కుటీరములోనికి పోవును; అందు శ్రీమహారాజుగారి చిత్రపఠమొకటి గలదు. ప్రతిదినము దేవి ఆపఠమును పూజించును. ఆపఠమునకు గావింపబడిన యలంకారమును వర్ణించుటకు మాటలు చాలకున్నవి ఆపఠమునకు సమీపమున కూర్చుండి దేవి ప్రతిదినము కొంతకాలము గడుపును. తనతప్పు క్షమింపుమని ప్రార్థించును, తన యవివేకమునకు తానే దిగులొందును, చేయునదిలేక నేలపై బడి విలపించును. కనులు తుడుచుకొని, చీర సవరించుకొని వెలుపలకు వచ్చును. ఆకుటీరమునకే కళ్యాణమండపమని పేరు. ప్రతి దినము దేవియే ఆ కుటీరమును స్వయముగ శుభ్రపరచును.

కురం:—ఆమహారాజు ఒకదిన మిచ్చట కరుదెంచి, ఆకుటీరమును గాంచిన, ఏమనుకొనునో?

పద్మ:—అంతటి యదృష్టమా!

కురం:—పద్మా! ఈ పల్లెయందున్నను, మనకెట్టి వినుకు కలుగకున్నది. ఈ తల్లిని వదలి పోవుట కెవ్వరికిని కాళ్ళాడకున్నవి.

పద్మ:—వెర్రిదానా! ఆమె ఋణము మనము తీర్పగలమా? ఆమె మహాసాధ్వి చిన్ననాటనుండియు ఆమెను నేనెరుగుదును: కటికవాడగు గజపతి మహారాజు ఆమెకాపుర మీరీతి కూల్చినాడు; అయినను భగవంతుడున్నాడు, సుగుణవంతులకు జయము లభింపకపోదు.

కురం:—దేవిగారికడ కేగుదము లెమ్ము. ఆమె ఒంటరిగ కూర్చుండి తనలోతాను కుమిలిపోవుచుండును.

పద్మ:—లెమ్ము. (వెడలిపోవుదురు.)

(తెర) (సశేషము)

—చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాదు, బి.ఏ.

## ఆనాడు

భోగిపండుగ జేయునా, పొంగులోన
మనుజులెల్లరు నేడిదే, మునిగినారు
నారికేళపు మునికన్య, లారవిప్పు
కొనుచునున్నారు చివురాకు, కుంతలాలు
తుహినబిందులు శీర్షాలు, దొరలిరాల॥

మండుచున్నట్టి యీ భోగి, మంటలెగసి
జ్వాలమాలాకులము గాగ, చలిదహించు
శిథిల జీర్ణములైన వీ, చితులమండ
నూతనధరిత్రి యీ సుప్రభాతవేళ
శిశిర నీహారసుస్నాత, శిశువువోలె
మరల జనియించినట్టి యీ, కరణితోచె॥

అకటనామది సంతోష, మడగిపోయె
తరులతాళి క్రమ్మిన మంచు, తెఱలరీతి
నెదమొఱంగిన చింత న, న్వదలలేదు
కామదహనంపు పండుగ, కాదు కాని
నా మనమ్మునదహించు ని, ర్ధూమశిఖల

—పెమ్మరాజు రాజగోపాలము బి.ఎ.

# కథారచన

ఇతర రచనలకంటె కథారచన చాలా తేలికపనల్లే కనిపిస్తుంది చప్పున చూసేవాడికి. ప్రస్తుతం మనదేశంలో రాతగాళ్ళను తీసుకుంటే పద్యాలూ, నాటకాలూ మొదలైనవి రాసేవాళ్ళకంటె కథలురాసేవాళ్ళే ఎక్కువగా ఉన్నారు. దీని కంతటికీ ఒకటేకారణం—కథలు ఎట్లాపడితే అట్లా రాయవచ్చుననే ఒక దురభిప్రాయం.

దీన్ని ఎవరోఒకరు ప్రకటించాలి, ఇది నలుగురి చేతా చదవబడాలి అనుకుని మరీ కలం పట్టుకునే వాడేది రాయటం మొదలుపెట్టినా కొన్నినియమాలూ కట్టుబాట్లూ అడ్డుపడతై. అవిలేకుండా రచనేలేదు.

అయితే ఏమిటంటే కథారచన ఎంతభిన్నంగా ఉందంటే, దాన్ని నియమబద్ధం చెయ్యబూనటం సులభసాధ్యమైన పనికాదు. అటువంటి దింతవరకు జరగలేదు. కట్టుబాట్లకు లోబడటం ఇష్టంలేక, ఏదో ఒకటి రాయాలని ఉండి, రాయబూనిన వారికి, శారదాబిల్లు తప్పించుకోదలిచిన వారికి బందరు ఫ్రెంచిపేటా నిజాం రాష్ట్రమూ దొరికినట్టు, కథారచన ఒకటి తేరగా ఉన్నది. పత్రికా సంపాదకులుకూడా పెద్ద చిక్కులోనే ఉన్నట్టున్నారు. ప్రకటనార్థం వచ్చినకథల్లో వేటిని స్వీకరించాలి? వేటిని తోసెయ్యాలి? తోసేసిన వాటిని ఏ వంకపెట్టి తోసెయ్యాలి? 'నాకిది బాగుండలేదు, దీన్ని నేను ప్రకటించను!' అనవచ్చు ననుకోండి; సొంత అభిరుచులమీద ఆధారపడటం తప్ప గత్యంతరం లేదా? వాదించలేనివాడు 'నా యిష్టం!' అన్నట్టు, కేవలం 'ఇది నాకు బాగుండలేదు,' అనటంతోనే పోనివ్వకుండానే, అనేకమార్గాల కథలు స్వీకరించటం, నిరాకరించటం జరుగుతున్నది. కథావస్తువు సంపాదకుడికి ఆమోదకరంగా ఉండదు; కథలో కాంగ్రెసు సంస్థ హేళనచెయ్యబడటమో, స్వేచ్ఛానురాగం ప్రశంసించబడటమో, సనాతనధర్మం సమర్థించబడటమో, సంపాదకుడి బుద్ధికి దారుణంగాతోచే సందర్భం ఏదో కలుగుతుంది. లేదూ, భాష దుర్భరంగా తోస్తుంది; రచననిండా పాషాణాలవంటి సమాసాలుండటమో, వాడుక భాషలోనే మరీ గ్రామ్యమైన—బొత్తిగా వ్యాకరణంలేని—రచన కావటమో జరుగుతుంది. లేదూ, కథ అచ్చుపుటలు ముప్ఫైమూడు అతిక్రమించటమో, మొదటిపేజీకే చివరల్లా రాకపోవటమో అవుతుంది. ఇంతకుమించి సంపాదకుడి చేతులో ఆయుధం లేదు. ఇక చదివేవాడి సంగతీ అంతే. ఎవడి అభిరుచినిబట్టి వాడు ఫలానికథ బాగుందనీ, ఫలానికథ బాగాలేదనీ, తన అజ్ఞానాన్ని బయటపెట్టటానికి జంకని ధైర్యస్థుడయితే తనకొక కథ అర్థం కాలేదనీ అనేస్తాడు. అంతతోసరి. అప్పుడప్పుడూ చదివేవాడి అభిరుచిని ధిక్కరిస్తూ మునిమాణిక్యంవారి కాంతం కథలంటివి బయలుదేరతై, అందరికీ బాగుండేవి. అటువంటి వాటిలో బాగేమిటో అర్థంచేసుకుందామని చదివేవాడు బలహీనంగా ప్రయత్నంచేసి, చివరకు—నే నెక్కడో రాసినట్టు—కాంతంకథల్లో కొంచెం 'ఇది' ఉందని తేల్చుకుంటాడు. వాటిలో ఉన్న ఇది ఇతరకథల్లో ఎందుకులేదో, అదిలేని కథలెందుకు పత్రికల్లోకెక్కాలో చదివేవాడికి పట్టదు. కథలకు ఏ నియమాలుండాలనే విషయాన్ని గురించి రాసేవాళ్లూ, సంపాదకులూ, చదివేవాళ్లూ అజ్ఞానంలో ఉండటం శోచనీయమైన విషయమే. కాని నియమాలు ఏర్పాటుచెయ్యటం ఎప్పటికీ జయప్రదం కానివాటిల్లో ఒకటి. పద్యాలను లక్షణాలన్నీ ఏర్పాటు చేసినంతమాత్రాన ఏం జరిగింది? వాటన్నిటినీ పాటిస్తూ ఎందుకూ కొరగానిపద్యాలు రాయవచ్చును; వాటన్నిటినీ ధిక్కరించి చక్కనిపద్యాలు రాయవచ్చును. ఈ నియమాలు అసమర్థుడికి సహాయంచెయ్యలేవు, కాని సమర్థుడికి అడ్డంవస్తయి. వాటిపనే అది. రాయగలవాడికి స్వేచ్ఛ ఎంతఉపకరిస్తుందో రాయలేని వాడికది అంత దుర్వినియోగానికి ఉపకరిస్తుంది. కనక ఎటొచ్చీ జరగవలిసిందేమిటంటే పత్రికాసంపాదకులు విడవకుండా రకరకాల కథలు చదువుతూండటమే. మంచికథకూ

చెడ్డకథకూ వ్యత్యాసంకనుక్కోటాని కంతకన్న మంచి అభ్యాసంలేదు. అక్కడక్కడా కథారచనను తృణీకారభావంతో చూసే సంపాదకులున్నట్టు నా కనుమానంఉంది. వారు వారిపత్రికల్లో కథలు ప్రకటించడమే మానివెయ్యటం బహు యోగ్యమైనపని. మంచి కథను వారు గుర్తించటం జరగనిపని.

కథల్లో అనేక జాతులుంటై. కథారచన కళగా చూసుకుని రాసేవారున్నారు. ప్రచారార్థం కథలు రాసేవారున్నారు. తమ అక్కరనిమిత్తం—గిట్టని వాళ్ళని తిట్టి ఏడిపించుదామని—కథలురాసి ఆత్మవంచనా పరవంచనా చేసుకునేవా రున్నారు. కేవలం ఉత్సాహంకొద్దీ రాసి ఇతరులను సంతోషపెడదామని కథలురాసేవా రున్నారు.

కళాసహితమైన కథారచన ఇతర కళలతోపాటు స్థానం పొందుతుంది. ప్రచారార్థం రాయబడే కథలను చదివేటప్పుడు ఏమరుపాటున ఉండరాదు. టాల్‌స్టాయివంటి రాతగాడు ఒక్కక్షణంలో మనకళ్ళలో దుమ్ముకొట్టి మనల్ని తనవెంట ఈడ్చుకుపోగలడు. అటువంటివాడి చేతులో చిక్కామో, మన దేశపరిస్థితులు రష్యాలోమాదిరిగానే ఉన్నవనీ, బుర్రతో పని చెయ్యటమంటూ లేనేలేదనీ, కూలినాలిచేసుకు బతికే వాళ్ళ హృదయాలు మన హృదయాలకంటె స్వతస్సిద్ధంగా పరిశుద్ధమైనవనీ అవలీలగా నమ్మించగలడు. కథలద్వారా పగ తీర్చుకోవటంలోగల అవినీతిని గురించి చెప్పేదేమీలేదు. ఉత్సాహంతో రాసేకథలు సరదాకు చదవదగినవే కాని వాటికి సారస్వతంలో తావుదొరకటం అసంభవం.

నూటికీ కోటికీ ఒకచిత్రం జరుగుతుంది. ఏ ప్రచారార్థం రాయబడ్డకథో, లేక పగతీర్చుకోటానికి రాయబడ్డకథో ఇతర కారణాలవల్ల అత్యద్భుతంగా తయారయి సారస్వతంలో స్థానం పొందుతుంది. ఒక నిజమైన మూర్ఖుణ్ణి తీసుకుని, రచనలో వెకిలితనంలేకుండా—నేను 'పెళ్ళినాడిచ్చినకట్నం' అన్నకథ రాసినట్టు కాకుండా—ఆ మూర్ఖుణ్ణి జయప్రదంగా కథానాయకుణ్ణి చేశాడు టాల్‌స్టాయి. ఇది ఎంతకష్టమో ప్రయత్నించిచూస్తే తెలుస్తుంది. అటువంటి కథ ఇంకొకటి రాయటానికి మరో టాల్‌స్టాయి పుట్టాలి. ఆ మహాశయుడి ప్రచారోద్దేశం అవతలపెట్టి ఆ కథకు నేను ఉత్తమస్థానం ఇస్తాను. ఈ విధంగానే లార్డ్ చెస్టర్‌ఫీల్డ్‌ను బహిరంగలేఖద్వారా అనవసరంగా (అందుకేమీ సందేహం అవసరంలేదు) తిట్టి, ఆ ఉత్తరానికి ఘనత సంపాదించాడు డాక్టర్ జాన్సన్. ఆ ఉత్తరంయొక్క ఘనత జాన్సన్‌యొక్క దూషణయందుగల న్యాయం వల్ల రాలేదు, దాన్ని రచించటంలో జాన్సన్ చూపిన నిపుణతవల్ల కలిగింది.

ఎవరన్నా అమానుషంగా ప్రవర్తిస్తే 'వీడు మనిషి కాదురా!' అని ఏ ఉద్దేశంతో అంటామో, ఆ ఉద్దేశంతోనే ఒకనాటకాన్ని నాటకంకాదనీ, కథలు కథ కాదనీ అనవచ్చును. మనిషిని మనిషికాదనేటప్పుడు మనిషి ఒకవిధంగా ప్రవర్తిస్తాడని ఒక అస్పష్టమైన జ్ఞానంఉంటుంది. అట్లాగే కథలనుగురించీ. చూడదగినది కాకపోతే నాటకంకాదు, చెప్పదగినది (వినదగినది) కాకపోతే కథకాదు.

అప్పుడే కథ అనేదానికొక అస్పష్టమైన ఆకారం వచ్చేసింది. కథకిది మొదటి నిబంధన. కనీసం చెప్పదగినదీ వినదగినదీ అయినా కాకపోతే కథకాదు. ఈ మొదటినిబంధనకే తట్టుకోలేని కథలెన్ని ప్రకటించబడుతున్నై ప్రతినెలా?

ఇప్పుడు మనం కథలనేవి ప్రపంచంలో లేవని భావించుకుని ఈ సూత్రంమీద కథజన్మించి ఎట్లా పెరుగుతూ ఎట్లా మారుతుందో ఆలోచిద్దాం.

సహజంగా మొదటి కథలు చాలా అసామాన్యంగా, దాదాపు అసహజంగా, అసంభవంగా ఉంటై. వాటినిండా ఉద్రేకపూరితాలైన హత్యలూ, ఎవరూ కనీ వినీ ఎరగని నరకాలూ (స్వర్గాలూ—రెండూ ఒకటే!) ఉంటై. కాలక్రమాన చదివేవాళ్ళకిటువంటి అసహజమైన రచనలనుచూస్తే అసహ్యంపుడుతుంది. క్రమంగా ఈ అసంభవాలస్థానే సులభంగా ఊహించుకోదగినవీ, అయినా అసామాన్యమైనవీ బయులుదేరతై. ఈ కథలు వెనకటివాటికన్న ఎక్కువకాలం నిలబడతై. కాని చదివేవాళ్ళకు వాటిమీదా రోతపుడుతుంది. అక్కడక్కడా కథకులు గమనిస్తారు, వినదగిన విష

యాలు మన నాలుగుబజార్లమధ్యా జరుగుతుంటే ఏవేవో ఊహించుకోవటం అనవసరంకాదా అని. కథల్లో వ్యక్తులు క్రమంగా సంఘంలోవ్యక్తులను సమీపిస్తారు. కథల్లోజరిగే విషయాలు సంఘంలో జరగదగిన విషయాలుగా మారతై. ఇంకా కాలంగడిచినకొద్దీ నాలుగుబజార్లమధ్య జరిగేవాటిస్తానే నాలుగుగోడల మధ్య జరివిగే వస్తయి. 'పాతాళగృహం' అవతలపారేసి 'కాంతంకథలు' చేపడతారు జనం.

ఇదంతా శాస్త్రీయంగా చర్చించదగిన కథయొక్క అభివృద్ధి. కథకులు అశాస్త్రీయంగా అనేక అలంకారాలు తెచ్చిపెడతారు. కథల జీవం యావత్తూ ఈ అలంకారాల్లో ఉంటుంది. ఒకోక్క కథకుడు కథను కొసతుంచి మెయిలుబండి స్టేషనులో ఆగినట్టుచేస్తాడు. మరొకడు తను చెప్పదలుచుకున్న విషయం తప్ప మిగతాదంతా చెప్పి సూచనఇచ్చి వదిలిపెట్టేస్తాడు. ఇటువంటి కథలు రాసేటప్పుడు చదివేవాడికి రెండుమూడు రకాల భావించటానికి కవకాశంఇస్తే కథయొక్క విలవపోతుంది. ఆ చేసే సూచన పొరపాటు లేకుండా చెయ్యాలి. మరొకడు కథను కావాలని తారుమారు చేసి వెనకదిముందూ ముందుదివెనకా చెప్పి తనకథను మరోసారి చదివిస్తాడు. ఒక ఇంగ్లీషు కథకుడు ఏక్షణాని కాక్షణం కొంపలు మునగబోతున్నట్టు రాసుకొచ్చి చివరకేమీ లేకుండా కథ తేలుస్తాడు. ఇటువంటి స్వల్పవిషయాలలో కథకులు తమకథలను తమ వ్యక్తిత్వాన్ని కలిగిస్తారు. పత్రికలు చదివేవాళ్ళు ఒక కథకుడి రచనలు కొన్నిచదివి అవి రుచించినమీదట అతడు ప్రకటిస్తూఉండే కథలను అతనిద్వారా ప్రేమిస్తారు. (అతన్నిగురించి అతనురాసే కథలు మినహా ఏమీ తెలీకపోయినాసరే!) ఇది చాలా చిత్రంకాని నిజం. నేను మొదటిసారి చింతా దీక్షితులుగారి పిల్లలకథలు చదివినప్పుడు ఇతరకథలు చదివినట్టే చదివాను కాని ఆయన 'పర్సనాలిటీ' నాకు కథలద్వారా చిక్కినతరవాత ఆయన కథలలో నేను వెతికేది నాకు పరిచితమైన ఆయన వ్యక్తిత్వమే. కనక కథలు ఒక్కసారే రెండు పనులు చేసేస్తయి. మొదట వాటిని చదివినవాళ్ళకు రాసినవాడియొక్క 'పర్సనల్ టచ్' కలిగించి, ఆ వెనక ఆ 'పర్సనల్ టచ్' యొక్క ఆధారంవల్ల కొంత వ్యక్తిత్వం పొందుతై.

కనక, కథ ఏవిధంగా ఉండాలంటే ఉజ్జాయింపుగా ఈ మూడువిషయాలూ చెప్పవచ్చును. ఒకటి, కథ చెప్పబడ్డట్టుండటం; రెండు, సంఘం (చదివేవాళ్ళు) యొక్క నాగరికతా అభిరుచులనుబట్టి చెప్పదగినదిగా (వినదగినదిగా) ఉండటం; మూడు, రాసేవాడియొక్క 'పర్సనాలిటీ' కథలోనించి తొంగిచూస్తుండటం.

మాట్లాడటానికీ ఉపయోగించే ధారాళమైనభాష (మాట్లాడేటప్పుడొచ్చే తొస్సులుమాత్రం లేకుండా) ఉపయోగించకపోతే మొదటి నియమానికి భంగం వస్తుంది. వినదగిన విషయాలూ వినదగని విషయాలూ—వీటి విచక్షణతెలీని కథకుడయితే రెండోనియమం చెడుతుంది. ఒకరికథలను ఒకరు ఆకారంతోసహా దొంగిలించటం మొదలుపెడితే మూడోనియమం చెడుతుంది. (మూడునియమాలూ చెడ్డ కథలు అప్పుడప్పుడూ పత్రికలలో కనిపించటమూ కద్దు!)

కథలురాసే వారింకోపనికూడా చెయ్యాలి. కొంతమందికి జరిగినవిషయాలు కథలోరాస్తేనే బాగుంటుందని ఒక అభిప్రాయంఉంది. ఉంటే కథకుడు తన భావనాశక్తి వినియోగించి కథరాయటంకంటె అనుభవం మీద రాస్తే కథ బాగుంటుందని. దానికి ఒకటే అభ్యంతరం. చూడదగినవన్నీ చెప్పదగినవిగా ఉండవు. చెప్పదగినవి చూడదగినవిగానూ ఉండవు. వ్యాసం రాయటానికి కిందుమీదవుతున్న తండ్రికి కొడుకు ఖగోళశాస్త్రసమస్యలతో అడ్డంరావటంలో చూడదగినదేముంటుంది? ఒకోక్కసారి మనం కళ్ళారాచూసిన విషయాలే మరో డింకొడితో చెబుతుంటే మనకు వినబుద్ధిపుడుతుంది. అట్లా చెప్పగలవాడు సహజకథకుడు. ఇటువంటి సహజకథకులు సామాన్యంగా కాగితంమీద కలంపెట్టలేరంటే, ఆ పనిచెయ్యటానికి కొన్ని నిబంధనలు వాళ్ళని బాధిస్తవని సులభంగా ఊహించుకోవచ్చును. అవేవో రాయటం మొదలుపెట్టినవాడికిగాని తెలిసిరావు. అవి ఒక కథారచననేకాక రచనకు సంబంధించినవి కావటంచేత మన కవసరంలేదు.

**తెలుగులో** ఇంకా చెప్పుకోతగ్గ కథలు లేకపోయినా కథకులుగా ప్రత్యేకతపొందినవారి కథలను గురించి క్లుప్తంగా రాస్తాను.

దీక్షితులుగారి చిన్నపిల్లల కథలు :—అనుభవం జ్ఞానంకాదని నిరూపిస్తయి ఈ కథలు. మనకందరికీ బాల్యం గడిచింది. జరిగినదంతా మరిచిపోయినాం. వెనక్కితిరిగి చూసుకుంటే అయోమయం ఒక్కసారి దీక్షితులుగారి కథలు తిరగవెయ్యగానే అయోమయం మాసిపోయి కలలో చూసినట్టున్న ఒక నూతనప్రపంచం కాంతివంతంగా మన ఎదట సాక్షాత్కరిస్తుంది.

వెంకటచలంగారి 'బూతు' కథలు :—వాటికదే పేరు! ఇంతకూ వెంకటచలంగారు చేసిన తప్పేమిటంటే మనం అశుద్ధమున్నట్టుగా కప్పిపెడుతున్నదాన్ని బయటికీడ్చి మన అవివేకం, అజ్ఞానం, మూఢత్వం, మొండితనం, చాటుబుద్ధి మొదలైన దుర్గుణాలమీద తీవ్రమైన జ్ఞానప్రకాశం చేస్తున్నారు. చేజేతులా అశుద్ధం చేసుకున్నామంటారు. ఈ కథలలో కొంత ప్రచారధోరణీ, జ్ఞానబోధచేసే ఉద్దేశమూ ఉన్నై. ఇవి ఆయనయొక్క మతకథలనీ, ఆయన దృష్టిలో పవిత్రమైనవిగా ఉద్దేశించబడ్డవనీ చెప్పవచ్చును.

నరసింహారావుగారి కాంతం కథలు :—కాంతం తెలుగువాళ్ళకు కొత్త సాంప్రదాయం. ప్రబంధాల నాటినుంచీ ఆడదానికి వ్యక్తిత్వం లేకపోవటం, ఆడది నోరుతెరిస్తే వెధవకంపు ఆచారంగా వస్తున్నై. కాంతం (తెలుగుసారస్వతంలో కొత్త) తెలివిగలది. కొయ్యబొమ్మకాదు. స్వతంత్రంగా ఆలోచిస్తుంది. తప్పులుచేసి దిద్దుకుంటుంది. ఇంట్లో సందడిగా ఉంటుంది. కాంతం లేకపోతే ఇల్లు చిన్నబోతుంది, వెంకట్రావు మనస్సు చిన్నబోతుంది, పిల్లలు నాగరికత పోగొట్టుకున్న జాతిమాదిరిగా ప్రవర్తిస్తారు, మళ్ళీ కాంతం ఇంట్లో అడుగుపెట్టగానే ఎవరిస్థానంలో వాళ్ళు అమరి ఊరుకుంటారు.

సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సాంసారికకథలు :—ఈ కథలలో విశేషమేమిటంటే పాత్రలు మాట్లాడ్తై—ఇతరకథలలో పాత్రలల్లే పోర్షను వప్పగించకుండా. కథ చదవటం మొదలుపెట్టగానే ఒక తెలుగుకుటుంబం మధ్య వెళ్ళి పడతాం. కథ అంతమయేవరకూ ఆభావం పోదు. కథ వినదగటంయావత్తూ కథనంలోనే ఉంటుంది. సంభాషణ జాస్తిగాఉండటంవల్ల కథ కుదుపులేకుండా దొర్లిపోతుంది. సంభాషణలో పాలు తీసుకునేవాళ్ళు మాట్లాడే విషయంమీదికి ఎగబడి మాట్లాడతారు. (ఇతర్ల సంభాషణల్లో పాత్రలు దూరాన నుంచుని దేవుడిమీద అక్షింతలు విసిరివేసినట్టు విషయ చర్చ జరుగుతుందని గమనించేది!)

ఇంకా ఇతరకథకులనేకమందిఉన్నారు. కాని నారి వారి కథల ప్రత్యేకత నేను గ్రహించలేకపోవటంచేత వాటినిగురించి రాయలేను.

తెలుగుకథలు చాలా అభివృద్ధి కావలిసిఉంది. ఇప్పుడు జరుగుతున్నదానికన్న ఇంకా చాలా దృఢంగా భావ ప్రకటన చెయ్యటం ఒకటి అవసరం. తరవాత కథలు యావత్తూ ఒక్క బ్రాహ్మణసంసారాల చుట్టూ తిరుగుతున్నై. సంసార్లను గురించి రాయబడే కథలలో క్షమించరాని అబద్ధాలూ తప్పులూ కనబడుతున్నై. కాకపోయినా ఆ కథలకు ప్రత్యేకత ఇవ్వగలిగినంత రాతగాళ్ళు రాకుండాఉన్నారు. తెలుగుసంఘం ఒక్క బ్రాహ్మణులతోనే లేదు, బి.ఏ.లు పాసయిన యువకులతోనూ లేదు. తెలుగువాళ్ళ ముఖ్యవ్యాపారం స్త్రీపురుషు లొకర్నొకరు ప్రేమించుకోవటమూ కాదు. కాని కథలు ఎంతసేపటికీ ఈ ధోరణిలోనే ఉంటున్నై. దానికి కారణం రాసేవాళ్ళను సంఘంయొక్క నాలుగు మూలల్నిగురించి కథలు రాయటానికి కావలిసినంత తెలీకపోవటమే. తరవాత కథకుడు చదువరిని బుర్రలేనివాడల్లేచూసి ప్రతి స్వల్పవిషయమూ వాడికి మేష్టరు బోధచేసినట్టు చేస్తూ చెబితే చదువరి ఊరుకోడు. ఇప్పటి కథకులు చదివేవాళ్ళకు పనికలిపించటం నేర్చుకోవాలి. వాళ్ళకుతెలీని విషయాలుకూడా తెలిసినట్టు మనకు తెలుసునన్నట్టు నటించాలి. ఇప్పటి రాజకీయాలూ సాంఘికాలూ మనమీద ఎట్లా పనిచేస్తున్నవో కథలలో పనిగానిపనిగా సూచించి వదిలిపెడితే ముందు కాలంలో ఇప్పటి కథలకు చరిత్రాత్మకమైన గౌరవం కొద్దిగా ఉంటుంది.

—కొడవటిగంటి కుటుంబరావు.

# విస్మృత నగరము

౧

కాఱుకొన గచ్చుపోదలు నల్లడలయందు వింతతరువులు నెల్లెడ విస్తరించెఁ
గాలవశమున నేర్పడెఁ గానసంబు కాకతినృపాల నగర రంగములలోన॥

౨

ఎలుఁగులు బెబ్బులుల్ కలసి యేకవిధంబుగఁ గాననాంతర
స్థలముల నోలగంబు బెలుచఁగ వెలయింప, మనుష్యదుర్గముం
బులగు నదీతటంబులను భూరుహముల్ కడువృద్ధినొందె, న
గ్గలమగు నెండయందయిన గాఢతమంబు తనర్చు నచ్చటన్॥

౩

విపుల విస్తృత శిలావితతితోఁ దీర్చిన కమనీయమైన ప్రాకారసమితి
జీవకళాసమంచితములై కొట్టవచ్చినరీతి తనరారు చిత్రతతులు
జలపక్షికాజి కుయ్యాలయౌ వారిధికన్ను సఖులనాఁదగు సరస్సముదయంబు
శిల్పశాస్త్రరహస్య జీవాతువుల పోల్కి కనుపించు బహుదీర్ఘికాచయంబు
పూర్వ రాజేంద్ర కీర్త్యంక పుణ్యగీతి వన రమాదేవి యాస్థాని నొనరఁబాడు
సలలిత స్నిగ్ధ శాసన సంచయంబు కలదు తదరణ్యపావన గర్భమందు॥

౪

రాజగృహాంతరంబులను రక్కెన కంపలు నిండె భిత్తికా
రాజములందు భూజనికరంబు కడుంగడఁ బెచ్చరిల్లె ని
స్తేజులరణ్యవాసులు గతించిన భూపులఁ జిత్రవిగ్రహ
వ్యాజమునం భజంత్రు రసవన్నవవన్య ఫలాశనంబులన్॥

౫

అస్మనహా విస్మృత ప్రదేశాంతరమునఁ గలదుపూర్వచరిత్ర సంగ్రహణమునకుఁ
గావలసినంతగను బరికరసమృద్ధి కాని సాధ్యంబె సామాన్య మానవునకు॥

౬

మఁదిని జిత్రశిల్ప యసమానముగాఁ బెనుపొంద, సమ్మదా
స్పదమయిమించెఁ దద్దపపిపాస, భయంకర నిర్జనాట వీ
పదమునఁ బ్రాక్తనాంధ్ర నరపాలక దివ్య యశోంకగీతికల్
చదివితి బాష్పసంతతులు శాసనసంతతి మీఁద నించితిన్॥

౭

సహగమన వ్రతాచరణ దీక్షాపతి కాంధ్రసుందరికి జోతలిడితి
భువనమోహన శాంతిముద్రా ముఖాంభోజు బుద్ధు సన్నిధి కేలు మోడ్చుకొంటి

౧౫౭

శిథిల దేవాలయ చిత్రసంఘాతంబు శూన్యదృక్కులతోడ జోతలిడితి
ప్రథన కర్కశ భటవ్రాత చిహ్నంబుల మానసమందు నమస్కృకొంటి
ప్రతిరజఃకణమునుండి ప్రతిఫలించు ప్రాక్తననృపాల విక్రమప్రభల నరసి
తన్మయుఁడనైతి నింతలోఁ దరణి యపర శైలశిఖరంబు జేరి విశ్రాంతినొందె॥

౮

వలఁగొని సంజకావి చెలువంబు విశీర్ణల బుద్ధ విగ్రహా
వళిఁగాగిఁ గావివల్వ వలెవాటుఘటింపఁ బ్రశాంతమైన మూ
ర్తుల పయిజాఱు బూయఁ జివురుం బువ్వుగుత్తుల రక్తకాంతులన్
జిలుక వనప్రదేశ మతిచిత్రముగాఁ గనిపించె నత్తఱిన్॥

౯

అంతలోనె చీఁకటు లావరించెఁ బ్రకృతిలో లీనమయ్యె నరణ్యసమితి
మెఱుఁగుఁ జుక్కలు భువనలక్ష్మికి నొనర్చెఁ బ్రాకటంబుగఁ గసకాభిషేకకలన॥

౧౦

కురువింద రుచికిఁ గ్రొమ్మెఱుఁగుఁ గూర్చెడి కనుకాంతులుమించ వ్యాఘ్రములుదిరిగె
కటికి చీఁకటి వెల్లువగన్న బిడ్డలపోల్కి మెలమెల్లఁ నెలుఁగుబంటులు చరించె
గిరివరంబుల ప్రహస్వతర రూపముల లీల వనవరాహములు పల్వలము జేరె
బహుమణారత్న దీపవ్రాత మలరార సర్పములెల్లెడ సంచరించె
సంజగని గాఢతర తపశ్చర్యవదలి యొలమి ఋషిపఙ్క్తి సముదాయ మెల్లదిశల
నావరించెఁ జరిత్ర రహస్యవేది బ్రతుకుఁ దెరువున కది కాళరాత్రియయ్యె॥

౧౧

అలరు లతావితోడ మలయానిలమంతట వీచెఁ బక్షిరా
ట్కులకల గీతికాధ్వనులఁ గంటె నొకించుక ముందుఁ బ్రాగ్దిశా
ఫలకమునందు రక్తరుచి బర్వఁ బవిత్రచరిత్ర వస్తుని
స్తులమగు తత్ప్రదేశమునఁ జూచితి పూర్వనృపాంకపఙ్క్తులన్॥

౧౨

ఓరమణీయ కానన మహోర్వరో నీకు నమస్కరింతు దు
ర్వార యశోవిభాసులగు ప్రాక్తనరాజుల చిహ్నముల్ కడుం
గూరిమి నీదు గర్భమునఁ గూర్చి భయంకర వత్సరాజ చే
నారయఁ జేయు మెన్నఁటికినైన రసజ్ఞులు వత్తురారయన్॥

౧౩

స్వార్థపరులగు మనుజులు సంచరింప నలవిగాని మహారణ్యమగుటఁ జేసి
పూర్వ నృపకీర్తి చిహ్నముల్ పోక నిల్చెఁ జాలు నాంధ్రప్రశస్తి కీశైలభూమి॥

— శేషాద్రిరమణకవులు.

# యక్షుడు—ప్రవరాఖ్యుడు

తెలుగు సారస్వతపు మాగాణులలో భావికాలపు సస్య సౌభాగ్యాన్ని సూచించు పత్రికలనే ఉచ్ఛిలీంధ్రములు అసంఖ్యాకములుగ ఉద్భవిస్తున్నవి నేడు. అట్టివాటిల్లో ఒక మాసపత్రికకు సంపాదకుణ్ణిగా ఎరుకపరుచుకుంటున్నాను మీకు. కాని, నా పత్రికను ప్రతినెలా వెలువరింపలేకపోవడానికి సరియైన వ్యాసాలు దొరక్కపోవడమే కాకుండా ఇంకా చాలా కారణాలున్నవి. అవన్నీ చెప్పను; గ్రంథ విస్తర భీతిచేతా, 'ఎడిటర్' అనే పేరుమీది మోజువల్ల పత్రికా నిర్వహణానికి పూనుకునేవాళ్ళ లోటుపాట్లు వెల్లడిస్తే నాకు నేనే ద్రోహంచేసుకున్నవాణ్ణవుతాను గనుకా. అందుచేత ఆ విషయములావుంచి మొన్న నాకు కలిగిన ఒక విచిత్రానుభవం మనవిచేస్తాను; అవధరించండి!

మా కుంభకర్ణుడికి మనుచరిత్రంటే చాలా యిష్టం. వాడి ప్రసంగమంతా ఆ ప్రబంధాన్ని గూర్చిన ప్రశంసే. తన ధోరణిలో విసుగెత్తించేవాడు నాకు. 'అయినా ఒకసారి చదివిచూద్దాం; నేటి మన భావకవులంటే అల్లసాని తాతగారు ఏమంత కూపంగా వ్రాశారో' అని బుద్ధిపోయిందినాకు. మొన్నరాత్రి పడుకుని లాంతరువెలుగున చదివేను. భావములు 'హృదయాంతరాళ సంచలనగాఢ ప్రగాఢములుగలేవు.' అంతా అర్థమౌతూనేవచ్చింది. వ్యవహారంలో మనం మాట్లాడుకుంటూన్నట్లు నడిచింది శైలి. కథావస్తువు రమ్యంగానే వుంది: ప్రవరాఖ్యుడు రావడం, వరూధినిని కలుసుకోవడం, ఆవిడ ఆయన్ని ప్రేమించి కోరికచూపడం; ఆయనగారి వేదాంతం, చివరకామె ప్రేమరక్తి ఆపుకోలేక కౌగిలించుకోవడం, బ్రాహ్మణుడు త్రోసిసి వెనక్కి తిరిగిపోవడం—

అంతవరకే నేను జాగ్రతవస్థలోవుండి చదివింది. తరువాత వేరే ప్రపంచంలో పడ్డాను. అనగా నిద్రవచ్చి స్వప్నంలో దిగేనన్నమాట.

అది హిమాలయ పర్వతారణ్య ప్రదేశం. అక్కడి ప్రకృతంతా వర్ణించను క్షమించండి. కథాభాగంవిడిచి అలా చేయడం రాదారిమీద నడుస్తూనడుస్తూ క్రిందికిదిగి డొంకదారిన కొంతదూరం నడిచి ముండ్లబాధపడలేక మళ్ళీ రోడ్డుకెక్కినట్లుందేమో కొంతమందికి.

ఆ మంచుకొండమీద అటూయిటూ పచార్లు చేస్తూ వుండగా ఎవరో కొంచెందూరాన దారి వెతుక్కుంటున్నట్లుగా కనుపించాడు. ప్రవరాఖ్యుడని పోల్చుకున్నాను పెద్దన్నగారి వర్ణణబట్టి. ఆ నిర్జరప్రదేశంలో కాస్సేపు ఆయనతో బాతాఖానీ వేసుకుందామని అనుకున్నా. కాని ఇంకోవ్యక్తి ఎవరో ఆ వైపునుంచివచ్చి ఆయన్ను కలుసుకున్నాడు. బహుశః ఆ నూతనపురుషుడు యక్షుడైవుండవచ్చునని ఊహచేశాను. వాళ్ళిద్దరూ ఏవో సంభాషణ మొదలుపెట్టినట్లు నాకు తోచింది. త్వరత్వరగా నడిచిపోయి ఆ సమీపంలో వున్న ఒక విశాలవృక్షము వెనుక వాళ్ళకు కనుపించకుండా నిల్చుని, జేబులోనుంచి కాగితమూ పెనసలూ తీసికొని వాళ్ళ సంభాషణంతా వ్రాసుకోవడం మొదలుపెట్టేను, బాగావుంటే నా పత్రికలో ప్రకటించుకుందామనే ఉద్దేశంచేత. వాళ్ళేమి మాట్లాడుకున్నారో ఒక్క అక్షరమైన పొల్లుపోకుండా వినిపిస్తాను చిత్తగించండి!

యక్షుడు:—పచ్చివైదీకంగా ప్రవర్తించావు కదయ్యా బ్రాహ్మణుడా! సిరిరామోకాలడ్డే రకంలా వుందే నీ వ్యవహారం!

ప్రవరాఖ్యుడు:—ఎవరు నాయనా నీవు? నీ వాలకంచూస్తే ప్రబంధనాయకుడులా గున్నావే?

య:—నేనా! స్వేచ్ఛాజీవిని, ప్రేమోపాసకుణ్ణి.

ప్ర:—ఇక్కడున్నావేం?

య:—నేనెప్పుడూ ఇల్లాంటిచోటులందే విహరిస్తుంటా. ఇక్కడిగాంగ సైకతాలూ, ఈలవలీనికుంజాలూ నా కానంద ధామాలు. సౌందర్యోపాసకుణ్ణి నేను; నక్కినిస్త్రీలతో ఐక్యంకోసం తపిస్తుంటాను.

ప్ర:—సరే నాకెందుకుగాని కాస్త మాయింటికి దోవచూపించి పుణ్యంకట్టుకుందూ. నాఖర్మంగాలి ఇలా వచ్చిపడ్డాను. ఈమిన్నులు పడ్డచోట.

య:—ఇట్లా, ఇల్లని కలవరింపు తప్పితే మరేమీ లేదే నీకు! వరూధినిలాంటి సౌందర్యవనిత తనంతదా వలచి వలచి వచ్చినప్పుడు నిరాకరించి పోతున్నావే? మధుపాత్ర వొలుకపోసుకుంటారుటయ్యా? పిచ్చివాడివిగాని.

ప్ర:—ఛీ. ఛీ. నాకా కులటసంగతి తిరిగీ జ్ఞాపకం చేసి నామనస్సును కలతపెట్టద్దు.

య:—ఇప్పటికైనా నీకు బుద్ధితిరిగి మళ్ళీ వెళ్ళవంటే 'ఛాన్సు' వుంటుంది. బాగా ఆలోచించుకో. గంధర్వకాంతతో మదనక్రీడ! నీమీదిప్రేమ వరూధినికి ఇంకా విరక్తిగా మారలేదు; వియోగభరం పట్టలేక చెలికత్తెలతో ఉద్యానవన విహారానికి పోయింది.

ప్ర:—అల్లాంటి సలహాలు వద్దునాకు. మాయింటికి దారేమన్నా తెలిస్తే చెప్పు.

య:—అరే! మళ్ళీ ఇల్లు! ఇల్లు! నీయింటిని ఆవరించుకుని ఈవిశాల ప్రపంచంవుంది కనుపిస్తున్నదా!

ప్ర:—దాన్ని చూద్దామనే కోరికే నన్నీ అయోమయ ప్రపంచానికి తెచ్చింది. ప్రాపంచిక సంబంధము దుఃఖకర మంటారు పెద్దలు.

య:—పెద్దలంటారులే; వాళ్ళమాటల కద్దులేకుండా పోయింది అంతా 'ఊ' గొట్టే పుల్లాయులైతేను—నేను చెప్పేదేమంటే నీరుగలసిన పాలలో నుంచి హంస ఏలాగు వేరుపరచి పాలే త్రాగుతుందో, అల్లే మనంకూడా, సుఖదుఃఖాలతో మిశ్రితమైవున్న ఈ ప్రపంచంలో సుఖమే గ్రహించాలి, అని

ప్ర:—సుఖమంటే ఏమిటి నీ వుద్దేశం?

య:—మేడలలో నివసించడం, సిరి సంపద కలిగి వుండడం, చేతిక్రింద మన అధికారానికి లొంగివుండే నౌకర్లు ఉండడం, సౌందర్యస్త్రీలతో ఉద్యాన వనాలలో విహరించడం.

ప్ర:—అవన్నీ తుచ్ఛసుఖాలు; మీసాలపై తేనియలు.

య:—అబద్ధం నీకుతెలీదు. వాటిని పొందటానికి శక్తిలేక తుచ్ఛసుఖాలని త్రోసివేయడం, ద్రాక్షపండ్లగుత్తి అందని నక్క 'అవి పుల్లగావుంటవితే' అని మనస్సుకు సమాధానం చెప్పుకున్నట్లు వుంటుంది.

ప్ర:—మన సుఖదుఃఖానుభవాలు ప్రారబ్ధాన్ని అనుసరించి వుంటవి. మనచేతిలో ఏమీలేదు.

య:—అవి పుంసత్వము లేనివాని మాటలు. నెపోలియన్ జీవితచరిత్ర ఎప్పుడైనా చదివేవా?

ప్ర:—ఎవరాయన? మనఋషిసంతతిలో వాడేనా?

య:—(హేళనగా నవ్వుతూ) నీకు ఆంగ్లభాషా జ్ఞానం బొత్తిగా లేనట్లున్నదే!

ప్ర:—ఔను. నేను వేదాలు వల్లెవేశాను. స్మృతులు అవలోడించాను. పురాణాలు పఠించాను.

య:—భేష్ కాని అవి నీకు ప్రేమతత్వాన్ని సరిగ్గా బోధపరచలే దన్నమాట.

ప్ర:—ఎందుచేత?

య:—ప్రేమోపాసకుడవైతే వరూధినిని విడిచి వెళ్ళవు.

ప్ర:—నేను విషయలంపటుడను కాదు. విషయ వాంఛయే ఉత్కృష్టమైన ప్రేమయని నీ అభిప్రాయమా?

య:—చెబుతావిను. ప్రేమ అనేది నిర్మలమైన సెలయేరు వంటిది. గులకరాలమీద జలజలా, ప్రబ్బలలో గిలగిలా, మైదానములో ప్రశాంతంగా ప్రవహిస్తుంది స్వేచ్ఛాగానం చేసికుంటూ. ఒక్కభార్యమీదనే కేంద్రీకరింపబడిన ప్రేమ వర్షపు నీరునిల్చిన ఒక కుంట వంటిది. ఎండాకాలంలో అపురూపమై పోవచ్చు.

ప్ర:—అయితే ఋష్యాదు లేర్పరచిన వివాహ బంధానికి అర్థంలేదన్నమాట! నాయనా! మీవంటి వాళ్ళ పుట్టుక హిందూమతానికి ఎంత సహకారమైన అవుతున్నది. శారదాబిల్లుతో అపాయకరమైన గాయం తగిలింది; ఇంకేం, నీపేరకూడ ఒకచట్టం ప్రవేశపెట్టితివా హైందవత్వం పూర్తిగా నశించిపోతుంది; నీకండ్లు చల్లబడగలవు.

య:—కోపపడవద్దు. నేను చెప్పేది బాగా ఆలో

చించి అర్థంచేసుకో. బహుకాంతా సంగమము మనకు అనేక జీవాత్మలతో ఐక్యం కలిగిస్తుంది. తన్మూలాన మన ఆత్మకు వికాసము అంతకంతకు అధికమౌతూ పరమాత్మకు దగ్గరౌతుంది.

ప్ర:—ఆహా! ఏమితర్కం! కేవలము కలిస్వరూపమట్లున్నావే! ఈ నీ మార్గంవల్ల ముక్తిపొందాలని తలచితివా, భగవంతుని ఈ సృష్టిలోని స్త్రీయాత్మలన్నింటినీ ఒక్కొక్కటిగ వెదకికొనుచూ—ఎన్నాళ్ళకు నీ పరమావధిని చేరగలవో లెక్కవేసికొన్నావా?

య:—అందుకోసరం ఎన్ని జన్మలైనా ఎత్తుతాను; నాకు విసుగులేదు.

ప్ర:—మొండితనం! ఎన్ని జన్మలెత్తినా నీకు మోక్షం సున్నా—అరెరే! లోకమెంత పాపభూయిష్టమైంది! రంకే మోక్షసాధనమా? అది పురుషులకు యశోహాని; స్త్రీల సౌశీల్యానికి భంగకరము. సిగ్గు, సిగ్గు. అవినీతి.

య:—నీతి అనేది ధృవనక్షత్రమువలె స్థిరమైనది కాదు. కాలానికి ఒకనీతి; దేశానికి ఒకనీతి. కొన్ని దేశాలలో మారుమనుము తప్పులేదు; మనదేశంలో అట్లా మారుమనుము చేసికొన్న స్త్రీకి బ్రతికివుండగానే శ్రాద్ధం పెట్టమంటాడు మనువు. స్త్రీ సహగమనం చేయకపోవడం ఒకప్పుడు చాలపాపంగా పరిగణించాం మనం. ఇప్పుడా ఆచారమేలేదు.

నా మార్గం స్త్రీల సౌశీల్యానికి భంగకరమని వాపోయ్యావే! స్త్రీల ప్రకృతి తెలిసివుంటే అలాగనవు. స్త్రీ ప్రేమ స్వార్థముచేత మలినముకానిది. తనప్రేమ ఎంతమందికైనా ఇచ్చివేయగలదు. నీవొక స్త్రీని ప్రేమించి విముఖుడవుకావడం అరుదు.

ప్ర:—స్త్రీలు ఇచ్చివేసేప్రేమకు మాతృప్రేమ అంటారు. పాతివ్రత్య తేజస్సుతో వెలుగుతూండే తల్లులపైకి నీ తుచ్ఛప్రేమ ప్రసరింపజాలదు. దీపముపై బడిన శలభమువలె నశించెదవు.

య:—ప్రేమకోసరం బలికావడం ఒక మహత్తరమైన ఆశయం. అందుకు రావణుడు మంచి వుదాహరణం. తన రాజ్యమంతా ఆహుతికానీ సీతమీది ప్రేమ వదలుకోలేదు.

ప్ర:—మూఢుడు.

య:—రాముడికంటె ఆదర్శనీయుడు మనకు అడవుల్లో సీత కష్టాలుపడటము సహింపజాలని తన ప్రేమ హృదయం ప్రేరేపింపగా వచ్చి ఆమెను ఎత్తుకుపోయాడు. చివరకామెప్రేమ సంపాదించాడు. అశోకవనంలో అతన్ని తనతొడమీద పడుకోబెట్టుకుని ప్రేమాశ్రువులు రాల్చింది అతని కళ్ళలోకి సీత.

ప్ర:—ఛీ.ఛీ. నీ స్వకపోలకల్పన నాకు కర్ణకఠోరంగా వుంది.

య:—వాల్మీకి అట్లా రాయలేదనా? ఆయనదే కల్పన. నేను చెప్పింది అసలు కథలోవిషయం. ఇంకో సంగతి; సావిత్రి సత్యవంతుణ్ణి ఎట్లు బ్రతికించుకోగలిగిందో తెలుసా! తన సౌందర్యముచూచి మోహపడిన యముని కోరిక తీర్చి.

ప్ర:—చాలుచాలు. ఆపు నీధోరణి. ఇట్టి మాటలు వింటూన్న నా తను వింతలింతలు తునియలై పోదేమి? నాయనా! నీవు నామతాన్ని దూషించావు. నాదైవాన్ని అగౌరవించావు. అందుకు శాపపీడితుడవు గాక తప్పదు.

నీవు తర్కముతో సత్యము అవగతము చేసికోలేవు ప్రతి ఆత్మలోనూ పరమాత్మ అంతర్యామియైవున్నాడు కదా. పరమాత్మను తెలిసికోవడమంటే నీ యాత్మలోని ఆ భగవజ్జ్యోతిని తెలిసికోవడమే. ఎప్పుడు నీ ఆత్మలోని భగవత్తత్వం నీ మనస్సుద్వారా, నీ ఇచ్ఛద్వారా, నీ ప్రేమలో, నీవుచేసే పనిలో ప్రవహించుతుందో అప్పుడు నీవే భగవంతుడివి. భగవంతుడే నీవు. నాడు నీవు మృత్యువును గెలువగలవు ఆత్మస్వరూపుడవైనావు గనుక. అదీ నిజమైన మోక్షమంటే; అంతేగాని బహుకాంతా సంగమము నిన్నధోలోకానికి తీసికొని పోగలదు. జాగ్రత్త. ఇక నేను పోవాలి. అహ్నికక్రియాకలాపము నెరవేర్చుటకు సమయమైంది.

(దక్షిణముఖంగా వెళ్ళిపోయాడు)

య:—పోవయ్యా, పో. ఏ శంకరభాష్యంలోని

ముక్కలో చిలుకవలె మళ్ళీ ప్రతిధ్వనిచేయడం తప్పితే నీ వేదాంతం నీకే అర్థంకానిది. గుడ్డకట్టుకోవడం కూడా తెలీని 'ఎబోరిజినీ'ల నాటి ఆచారాలు సనాతనమైనవని శిరసావహిస్తావు నువ్వు. సర్వోత్కృష్టమై నీ యభివృద్ధికి కారణములైన నూతనపద్ధతులను నిరసిస్తావు. నీకు వెనుకచూపేకాని ముందుచూపులేదు. అజ్ఞానముతో, మూఢనమ్మకాలతో, అర్థంలేని పూర్వాచారములతో, వ్యక్తిస్వాతంత్ర్యాన్ని చంపివేసే మీ సంఘ చట్టాలతో, బిగుతుగా బంధింపబడి పైగా మోక్ష మార్గ ముపదేశింప సమర్థుడవైతివా! బళే! నావంటి వాళ్ళు లోకమరమ్మతుకోసరం పూనుకుంటేనేగాని మీరు పైకిరాజాలరు.

సరే, ఇక నా కార్యక్రమం గుతించి. ప్రవరాఖ్యుణ్ణిచూచి వరూధిని మోహించడం, అతనిమీద పడటం, అంతా చూచానుకదా దూరాన్నుంచి. నే నిన్నినాళ్ళనుంచీ దాన్ని లాలిస్తుంటే నా బాహువులలో చిక్కించుకోలేకపోయ్యాను. ఆ బ్రాహ్మణుని వేషంతో పోయి నా అదృష్టాన్ని పరీక్షించుకుంటాను. ఈసారి నెగ్గగలనని ధైర్యంగా వుంది.

(కూనిరాగంతీసుకుంటూ అటుకేసి వెళ్ళిపోయాడు).

నేనుకూడా వెళ్ళిపోదామని వ్రాసుకున్న కాగితాలు మడిచి జేబులోపెట్టేసుకుని నాలుగువైపులా తేరిపారచూచాను ఒకసారి. దారిడొంకా ఏమీ కనుపించడంలేదు. ఇల్లు చేరుకోవడమెల్లాగా అనే సమస్యలోపడ్డాను. నాకు తోడు ప్రవరాఖ్యుడు వున్నాడుగదా అనేధైర్యంతో ఆ బ్రాహ్మణుడు పోయిన దారిన నేనూ నడిచాను

నే నాయనదగ్గరకు వచ్చేసరికి చేతులురెండూ జోడించి అగ్నిదేవుణ్ణి కాబోలు ప్రార్థిస్తున్నాడు. ఆయన్ను సమీపించాను. ఆశ్చర్యమైంది నాకు; కొంచెంకొంచెం భూమిమీదనుండి లేస్తున్నాడు. బ్రాహ్మణప్రభావం కాబోలు ననుకున్నాను: రెండు గజాలెత్తు లేచాడు. ఇక నాగితే దొరికిన అవకాశాన్ని పోగొట్టుకోవడమౌతుందని ఆయన రెండు కాళ్ళూ లంకించుకున్నాను. ఇంకేంచెప్పేది? వాయువేగ మనోవేగాలలో ఎగిరిపోతున్నా మిద్దరమూను మావూరు వచ్చేసరికి చేతులు రెండూ వదలేశాను. దబీలున క్రిందికి కూలేను.—

కన్నులు తెరచి చూచేసరికి ఏముంది? మంచం మీద పడుకున్నవాణ్ణి క్రిందపడి వున్నాను. నా ప్రక్కనే 'మనుచరిత్ర' కూడా పడివుంది.

—పురాణం కుమారరాఘవశాస్త్రి.

# ఒక స్నేహితునకు

## (అనువృత్తము)

చీకటియె వెల్తురను భ్రాంతి జెందుచోట
తాపమునె సౌఖ్యమనియెంచి తలచుచోట
ఆర్తి నారోగ్యమని చిత్తమరయుచోట
నేడుపే జన్మసాక్షియై యెసగుచోట
పాపనాత్మక! యిటశాంతి బడయగలవె?
కలహములు శోకలనికేంబు గలుగుచోట,
జనకుడై నను కఠినత్వమును వహించి
తనదు సుతు నింటనుండి పోదటుముచోట,
స్వార్థపరతయే నిత్యంబు సర్వకార్యములను నడిపించు సూత్రమై వెలయుచోట
ప్రవిమలానంద సంప్రాప్తి భాగ్యమకట!
మానిచంద్రమ! సుంతైన కానగలవె?
బహుళ సుఖదుఃఖ కలిత మీ పాడుజగతి
దీని తప్పించుకొనగ నెవ్వాని తరము?
కర్మనిగళంబుచే బద్ధ కంఠుడైన
మందభాగ్యుండు మోక్షసంపత్తి ధరణి
నెనయగల్గునె తుదకు తా నెచటనైన?
యోగసాధన, విషయ సౌఖ్యోదయంబు

భవ్యసంస్తుతి యోగీంద్రు పరమపదవి
ప్రార్థనలు, భూరివిత్త సంపాదనంబు
నియమములు దీక్షలును యాగ నిత్యక్రియలు
వీని నన్నింటి జూచితి ; దేనియందు
లేదు వీక్షింప సుఖబీజ లేశమైన !
సారహీనంబు భువి దేహధారి బ్రతుకు
హృదయ మౌదార్యశ్రేణి, నెదుగుకొలది
అంతకంతకు సంతాప మధికమగును
ఓయినిస్వార్థజీవి! యో యున్నతాత్మ!
గాఢతమోమయమైన లోకంబునందు
నీకు తలదాచుకొన నింత నెలవు లేదు :
భీకరంబైన సమ్మెట ప్రేటునం కిల
చలువ రాతిబొమ్మ యొకింత నిలువగలదె ?
అలసతను మించి. తుచ్ఛత్వ మభ్యసించి,
నాలుకను తేనె, విషము స్వాంతంబునందు,
కలిగి సత్యహీనత, స్వార్థ కలితుడవయి
యుందువా ధాత్రి నీకప్పుడుండు చోటు !
జ్ఞానమునుబొంద ప్రాణంబులైన యొడ్డి
గడపినాడను బ్రతుకులో గడువుసగము ;
ప్రేమకయి నేను పలుసార్లు, పిచ్చియెత్తి
ప్రాకులాడుచు నీడల పట్టుకొంటి ;
మతము విషయమై తెలిసికో మననుకలిగి
ధన్య గంగాస్రవంతినీ తటములందు,
పుణ్యక్షేత్రాళి, కాంతార భూములందు,
ప్రేతవాటికలను గుహా వితతియందు,
సలిపినాడ నవెన్ని యో సాధనముల ;
బిచ్చమెత్తుచు దివసము ల్బుచ్చియుంటి
అనదనై చింకిగుడ్డల తనువుదాల్చి
కడుపుమంటను చల్లార్చ బిడియముడిగి
యోగిరమునకై యింటింటి కేగినాడ :
అధిక క్లేశ్యాల నారోగ్య మంతరించె
కాని నేనేమి ఫలితంబు గాంచినాడ ?

అనుభవంబున నేనేర్చినట్టి దొకటి
సఖుడ! మనసార దెల్పెద, చక్కవినుము :
భయద సంసారవార్ధిలో పతితరంగ
ములను దాటింప నొక్కటే గలదు నావ.
శాస్త్రపఠనంబు; మంత్రాలు ; చదువులన్ని,
విపుల వేదాంతచర్చలు వేదవిధులు
ముక్కుమూయుట మొదలైన పెక్కుపనులు
చిత్త దౌర్బల్యమునకు వేయి చిహ్నములగు
ప్రేమ! ప్రేమకీడైన దీ పృథ్వి లేదు !
జీవునందును, పరమాత్ము చిత్తమందు
సురలయందును. గంధర్వ నరులయందు
పక్షులందును క్రిమి మృగావళులయందు
నిఖిలసృష్టిని వ్యాపించి నిండి నిండి
ప్రేమయే కాపురముచేసి వెలయుచుండు !
అటులె గాకున్న పరమాత్ముడనగ నెవడు ?
సకలభువనాళి నడిపించు స్వామి యెవడు ?
తనదు నిసుగును రక్షింప జనని మడియు :
దార్లు గొట్టును నిర్భీతి తస్కరుండు :
కాని యీ రెంటి కొక్కటే కారణంబు
ప్రేమయను దివ్యభావమే వెలసియుండె.
వాక్కునకు మించి ధ్యానింప వశముగాక
దుఃఖసంతోషములు రెండు దోపజేయు
ప్రేమయే మూలహేతువు పృథ్విలోన !
పురుగు మొదలు బ్రహ్మాండంబు వఱకు సకల
జగమునందును ప్రేమయే చాలగతుల
నిండియున్నది మిత్రుడా! నీవు సతము
మనసు వాక్కును కాయంబు జనహితముగ
నర్పణము సల్పుమా దాన శ్రేయంబు గలదు!
ఇన్నికోటుల రూపాల కన్నులెదుట
కన్పడెడు వాడె దేవుండు గాసిజెంది
యేల నెచటనో వెతకెదు? చాలు! భూత
సేవయె ధరణి పరమాత్ము సేవ నిజము.

—గోదావరి సత్యనారాయణ, బి.ఏ.

# భారతీయ గ్రంథాలయములు

## ౫. బౌద్ధ గ్రంథాలయములు

విద్యయు విద్యాసంస్థలును బౌద్ధయుగమున విశేషముగ నభివృద్ధినందినవి. బౌద్ధమత మెన్నియో విదేశముల యందు ప్రచారము చేయబడుటచే వేనవేలుగ జనులు భారతదేశమునకు యాత్రలను చేయుచుండిరి. ఇచటి విద్యాలయములును గ్రంథాగారములును క్రిక్కిరిసి యుండెడివి. వీనినిగూర్చి శాసనములనుండియు విదేశీయ యాత్రికుల వ్రాతలనుండియు విశేషములెన్నియో తెలియనగుచున్నవి.

బౌద్ధయుగమున లిపిజ్ఞానమును పుస్తకనిర్మాణమును సర్వసామాన్యముగ నుండినవి. కుటుంబములో మతగురువుల బోధనములను, ముఖ్యాంశములనుగూర్చిన విశేషములను లిఖితపూర్వకముగ బదిలపరుపబడుచుండెడివి. ఇది వ్యక్తికగ్రంథాలయములకు మూలమని చెప్పనగును.

### నాలందా

బౌద్ధమతముయొక్క ముఖ్యబలము విద్యాలయములందును భాండారములయందు నుండెడిది. నాలందా యను నామము బౌద్ధయుగమంతటికిని సాంకేతికముగ నుండినది. మతవాదముల కాటపట్టును, టిబెటు చైనా మున్నగు ప్రాచ్యదేశముల నాగరికతకు కారణమునగు నీ మహావిశ్వవిద్యాలయస్థానము(1) ప్రకృతమున బీహారులోని రాజఘుర్ (రాజగృహము)న కెనిమిదిమైళ్ళలో నున్న బారగన్‌వద్దనున్నది.(2) ఈ విద్యాపీఠమును సుప్రసిద్ధ చైనా యువకుడగు హ్యూయన్‌ష్వాంగ్ చక్కగ వర్ణించియున్నాడు.(3) ఈ విద్యాలయము రాజాదరణమువలన వర్ధిల్లినది. శక్రాదిత్య, బుధగుప్త, బాలాదిత్యాది గుప్తరాజులిచటి కట్టడములను గట్టించియు, గురుశిష్యుల పోషణమునకై యేర్పాటులను గావించియు నీ విద్యాపీఠము ననేకవిధముల నభివృద్ధి పరచిరి(4) హ్యూయన్‌ష్వాంగ్ కాలమున నూరుగ్రామములును, ఈత్‌సింగ్ అను మరియొకయాత్రికుని కాలమున రెండువందల గ్రామములు నీ విశ్వవిద్యాలయమునకు జెల్లుచుండెడివి.(5) ఈ గ్రామములలోని జనులు విద్యాలయమునకు బియ్యము, పాలు, వెన్న మున్నగు వానిని ప్రతిదినమును బంపుచుండిరి.(6) ఈ విధమున ద్రవ్యమునుగూర్చియు, భోజనమునుగూర్చియు విద్యాపీఠవాసుల కేవిధమగుచింతయు లేకుండినవి. ఇచ్చట హేతువిద్య, శబ్దవిద్య, చికిత్సావిద్య, వేదములు, తంత్రము, సాంఖ్యము, వ్యాకరణము మున్నగు శాస్త్రవిద్యలెన్నియో బోధింపబడుచుండెడివి.(7) ఇల్లుత్తమ పద్ధతులపై నిర్మింపబడి, యుత్తమవిద్యల కాలవాలముగ నుండిన యీ విద్యాపీఠమున నుత్కృష్టమగు గ్రంథాలయముండెడిదని టిబెటు దేశీయుల వ్రాతలనుండి తెలియుచున్నది. ఇది 'ధర్మగంజ' యనుచోట నుండెనట. రత్నసాగర, రత్నదధి, రత్నరంజగయను గొప్ప సౌధములలో నిది పదిలపరుబడియుండెడిది. ఇందు రత్నదధి యనునది తొమ్మిదంతస్థుల సౌధము. బౌద్ధుల ముఖ్యగ్రంథములు విశేషించి ప్రజ్ఞాపారమితా సూత్రము, నీ సౌధములో నుండెడివి.(8) ఇట్టి గొప్పకట్టడములలో కేంద్రీకరింపబడిన గ్రంథాలయమెట్టి ఘనతవహించియుండెడిదో యూహింపవలసినదే. ఇట్టివి నేడు కూడ నరుదుగనున్నవని చెప్పవచ్చును. ఈ భాండారములోని పుస్తకములసంఖ్యను నిర్ణయించుట కాధార

1. Samaddar - The Glories of Magadha p. 116.
2. D.N.Dey - Rajgir and its neighbour hood.
3. Glories of Magadha p. 120.
4. Real - Rec. West. II p. 168.
5. Glories of Magadha pp. 137-138.
6. Ibid.
7. A Record of the Buddhist Religion. p. 177.
8. Jour. Bud. Text Society VII. pt.4. pp. 18-21.

ములులేవు గాని యిచటి గురుశిష్యులయొక్కయు, కళాశాలలయొక్కయు, నిచటినుండి విదేశీయులు గొనిపోయిన గ్రంథములనుండియు, నా సంఖ్యను గొంతవరకు నూహింపవచ్చును. ఇచట గొన్నివేలమంది భిక్షువులుండిరి. వీరందరును మతగ్రంథములకు బ్రతులను వ్రాయుట ముఖ్యధర్మముగ బరిగణించుచుండిరి. ఈ విద్యాలయమునందలి శిష్యులందరును తమకువలసిన గ్రంథములకు బ్రతులు తామే వ్రాసికొనుచుండిరి. ఇచటినుండి వెడలునపుడు హూయాన్‌ష్వాంగ్ 650 గ్రంథములకును, ఈత్‌సింగ్ 400. గ్రంథములకును బ్రతులను తీసికొనిపోయిరి.(9) ఇంతియేగాక నీవిద్యాపీఠమున బ్రత్యేక విలేఖరులుండిరి. ప్రతిఫలమును గ్రహించి కోరినవారికి వారు గ్రంథములను వ్రాసిపెట్టుచుండిరి. ఈ మహాగ్రంథాలయము సుప్రసిద్ధులగు నాచార్యులచే నిర్వహింపబడుచుండెడిది. విద్యార్థులకు వారివారి యవసరముల ననుసరించి యుక్తములగు గ్రంథములను సూచించి వారి జ్ఞానమును పెంపొందించుటే భాండారాధ్యక్షులకు గర్తవ్యమైయుండెను. ఈ పవిత్ర విద్యాపీఠమునందలి గ్రంథాలయములో దయారుచేయబడిన ప్రతులు నేటికిని ఒకటిరెండు కాలగర్భమునబడక నిలచియున్నవి. అట్టివానిలో, పాలరాజగు మహీపాలుని 15-వ రాజ్యసంవత్సరమున వ్రాయబడిన అష్టసాహస్రిక ప్రజ్ఞాపారమితా సూత్రపు నకలొకటి. ఇది నేడు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ గ్రంథాలయమునయున్నది రెండవది మరి తొమ్మిది సంవత్సరములకు బూర్వ మదేగ్రంథమునకు వ్రాయబడిన మరియొకనకలు. ఇది బెంగాల్ రాయల్ ఏషియాటిక్ సొసైటీవారి గ్రంథాలయమున కలకత్తాలోనున్నది. ఇట్టి యీ నాలందా విశ్వవిద్యాలయ గ్రంథాలయము భారతదేశపు ఘనతకు శాశ్వతచిహ్నముగ నుండగలదు.

## విక్రమశిల

నాలందాకు పిమ్మట పేర్కొనదగినది విక్రమశిలా విశ్వవిద్యాలయము. నాలందా పాండిత్యమునకు విశేషముగు ఖ్యాతినిగాంచినచో విక్రమశిల తన గ్రంథాలయమునకు పేరెన్నికగాంచెను.(11) దీని నిర్మాతలు వద్యక్షులునుగూడ పాలవంశీయులగు రాజులే. ఈ విద్యాపీఠము భాగల్‌పురమునకును, కోల్‌గంగ్‌కును నడుమనున్న పాతరాఘాట్‌వద్ద నుండెడివని పరిశోధకులు నిర్ణయించియున్నారు (12) క్రీ. శ. 9-13 శతాబ్దుల నడుమ నీ విద్యాపీఠము వర్ధిల్లినది.(13) ఈ విద్యాపీఠమును ముఖ్యాచార్యుడు, ఆర్గురు సభ్యులుగల యొకసంఘము సాహాయ్యమున నిర్వహించుచుండెను. రాజపోషణముండుటచే నియ్యది మహోన్నతదశ ననుభవించెను. ఇచట 108 గురు ఆచార్యులుగల ఆరు కళాశాలలుండెడివి. ఇచటి గ్రంథాలయమున తంత్రవ్యాకరణ తర్కవేదాంతాది శాస్త్రములకు సంబంధించిన గ్రంథములు వేనవేలుండినవి.(14) ఈ విద్యాలయమునగూడ గురుశిష్యులు మతగ్రంథములకు బ్రతులను వ్రాయుచునే తమ విశ్రాంతికాలమును గడపుచుండిరి. పాలరాజగు మూడవ గోపాలునికాలమున వ్రాయబడిన ప్రతియొకటి నేడు లండన్ నగరములోని బ్రిటిషు మ్యూజియములో పదిలపరుపబడియున్నది.

## ఉద్దండపురము

ఉద్దండపురము లేక ఒదంతపురియను నీ విశ్వవిద్యాలయముగూడ బౌద్ధయుగమున మిక్కిలి ప్రసిద్ధికెక్కెను. దీనిని పాలరాజగు గోపాలుడు స్థాపించెనని తారానాథుడను టిబెటుదేశపు చరిత్రకారుడు వ్రాసియున్నాడు.(15) ఇటగూడ నొకచక్కని గ్రంథాలయముండెడిది. క్రీ. శ. 12-వ శతాబ్దిలో మహామ్మదీయులు దీనిని ధ్వంసముచేసిరి.

ఇవిగాక నుత్తర హిందూస్థానమునందింకను పెక్కుచోట్ల విద్యాపీఠములుండెడివి. ఫాహియాన్ అను చైనా దేశయాత్రికుడు ఉద్యాన, పురుషపురమథుర, సంకాశ్య, కాన్యకుబ్జ, శ్రావస్తి, సాకేత, రామగ్రామ,

9. Smith-Early Hist. of India p. 325.
10. See Bendall's Catalogue.
11. Glories of Magadha p. 145.
12. J.A.S.B. V No I. p. 7.
13. Schiefner - Taramath p. 220
14. Glories of Magadha pp. 151,152, 153.
15. Smith-Early Hist of India p.473,

కపిలవస్తు, వైశాలి, పాటలీపుత్ర, రాజగృహ, వారణాసి, గయ, చంప, తామ్రలిప్తి యను స్థలములను; హ్యూన్‌ష్యాంగు సింహపుర, ఉరస, కాశ్మీర, పునచ, రాజపుర, వృజ్జి, హిరణ్యపర్వత, పుండ్ర, వర్ధాన, కామరూప, సమతత, మంజూయత, భరుకచ్ఛ, వల్లభి, ఉజ్జయిని, మూలస్థానము మున్నగు చోట్లను; ఈత్ సింగు తామ్రలిప్తి, హరిక, కుశినగర యను పట్టణములను విద్యాపీఠములను గాంచియుండిరి. (16) నాలందా విక్రమశిలలలో వలెనే వీనిలోగూడ సుప్రసిద్ధములగు పుస్తక భాండారములుండెడివి.

దక్షిణ హిందూదేశమున నీ క్రింది విద్యాలయములును, వాని గ్రంథాలయములును ముఖ్యములు—

## ధాన్యకటకము

ఇది గుంటూరుజిల్లాలో అమరావతివద్దనుండి నేడు ధరణికోటయని పిలువబడుచున్నది. విశ్వవిఖ్యాతినందిన అమరావతీ స్తూపమువలెనే నేడీ విశ్వవిద్యాలయము గూడ కాలవాహినిలో గలసిపోయినది. విదేశీయ యాత్రికుల వ్రాతలనుండి వీనినిగూర్చి కొన్ని విశేషములు తెలియనగుచున్నవి. ఇట నెన్నియో సంఘారామములు నెందరో భిక్షువులు నుండిరి. విఖ్యాత బౌద్ధాచార్యుడగు నాగార్జునుడిట గొంతకాలము నివసించెను. ఇచటివిద్యాపీఠమున నెన్నియో విద్యాశాలలుండెడివి. వానికి యిటవర్ధిల్లిన గ్రంథాలయమును గూర్చి విశేషములు తెలియుటలేదు. (17)

## శ్రీశైలము

నేడు శైవులకు ముఖ్యయాత్రాస్థలముగనున్న యీ స్థలమున బౌద్ధ మఠములును, విద్యాలయములు నొకప్పుడుండెడివి. నాగార్జునుడిట నొకచక్కని గ్రంథాలయము నేర్పరచి యెందరో భిక్షువులకు బౌద్ధమతమును బోధించెను. (18)

## కాంచీపురము

•ఆంధ్రదేశమునకు ధాన్యకటకమువలె ద్రవిడదేశమునకీనగరము ముఖ్యస్థానముగనుండెను. ఇచటి విద్యాపీఠమున శిక్షణబడసి భిక్షువులు సింహళద్వీపమునకు మతప్రచారమునకై యేగుచుండిరి. ఇటగూడ గొప్ప గ్రంథాలయములుండెడివి. (19)

ఈ విధమున బౌద్ధయుగ చరిత్రమున విద్యాపీఠములును వానితో నవినాభావముగ నుండిన గ్రంథాలయములును దివ్యదీపికవలె నలరారుచున్నవి. ఈయుత్తమ సంస్థలతో నలరారుచుండిన భారతభూమిపై మహమ్మదీయ దండయాత్రలు వెల్లువవలె విరచికొని పడినవి. క్రీ శ. 1199 లో నీ విధ్వంసము మగధదేశమున నారంభమయ్యెను. (20) మహమ్మదీయ చరిత్రకారులును, టిబెటు చరిత్రకారులును గూడ నామహా ప్రళయమును వర్ణించియున్నారు. నాలందా, విక్రమశిల, ఓదంతపురి మున్నగు విద్యాపీఠములన్నియు నత్తైనగోడలచే నావరింపబడియుండినవి. ఖిల్జీవంశీయులు ఢిల్లీ సింహాసనము నధిష్ఠించిన పిమ్మట మగధరాజు లీ విద్యాపీఠముల రక్షణార్థమై సేనలను స్థాపించిరి. క్రీ. శ. 1199 లో భక్తయార్ 'ఖిల్జీ పుత్రుడగు మహమ్మదు పైవిద్యాపీఠముల నొక్కొకటిగ దండెత్తి వశపరచుకొనెను. ఆ సందర్భమున జరుపబడిన యత్యాచారములను మిన్‌హాజ్ అను మహమ్మదీయ చరిత్రకారు డిట్లు వర్ణించియున్నాడు— "మహమ్మదు వెనుకదారినుండి యీ విద్యాలయమున బ్రవేశించెను. ఇందుండినవారిలో నెక్కుమంది బోడితలలుగల బ్రాహ్మణులు. వారందరును చంపబడిరి. యథేచ్ఛముగ విహరించు విజేతలకు వేనవేలు గ్రంథములు గన్పించినవి. వాని స్వభావము నెరుక పరచుటకొక ప్రాణియైనను మిగిలియుండలేదు." (21) ఉత్తరదేశమునందలి బౌద్ధ విద్యాపీఠములన్నియు నిదేవిధమున ధ్వంసముచేయబడి, విక్రమశిలలోవలె వాని గ్రంథాలయములన్నియు నగ్నిహోత్రప్రీతి గావింపబడినవి. అందువలననే మనకు వీనియవశేషములు లభించుటలేదు.

—మారేమండ రామారావు, ఎం ఏ. బిఇడి,

---

16. భారతీయ విద్యాచరిత్రము—
భారతి ఆగస్టు 1933 పే 267.
17. Ibid 270.
18. Ibid.
19. Ibid.
20. Glories of Magadha p. 161.
21. Ibid p. 306.

# కిశోరక్రీడలు

## క

చంద్రంతల్లి గారెలు వండుతోంది. 'మాయింట్లో ఇంచక్కా పప్పులు వండుకుంటున్నా' మంటూ, ఇంటింటికీ వెళ్లి తన జట్టువాళ్ళనందరినీ ఊరించి వచ్చాడు చంద్రం.

'నేను నీజత వుండొద్దురా?' అని అడిగింది సుబ్బులు.

'ఆఁ....నువ్వూ నేనూ జతేం! మరి కావమ్మ మనజతకాదు; ...ఏం?' అన్నాడు చంద్రం

'మరి పార్వతో?' అంది సుబ్బులు.

'అదీ వుండొద్దు; ఏం?—మనం కాస్తైనా నోట్లముక్కా, గారిముక్కా వాళ్లకి పెట్టద్దు; మనకి పార్వతి పెట్టిందేఁవిటే, వాళ్ళింట్లో పప్పులు వండుకున్నప్పుడు? మనం చూసి అడుగుతామేమో అని, ఇంట్లోకి పరుగెత్తి బియ్యప్పెట్లో దాచుకొచ్చింది కాదుటే పొద్దున్న?

'ఊఁ....ఔను; దాచుకువచ్చింది; కొంచెంముక్కేమోనే,నవులుతూ వచ్చింది.'

'నే సూశా.'

'అరుగో వాళ్లొస్తున్నారు; మేమేమీ పెట్టం - పొమ్మందాం; మన జట్టుండొద్దని చెబుదామేం?

'ఊఁ మనం చప్పున పరుగెత్తుకుపోదాం - రా-మాయింటికి.'

పార్వతీ, కావమ్మాకూడా వాళ్ళవెంటనే పరుగెత్తుకుంటూ వెడతారు. సుబ్బుల్ని "చప్పునరావే" అని కేకేస్తూ, లోపలికి రావడంతోటే తలుపు గడియవేశేస్తాడు చంద్రం. పార్వతీ, కావమ్మా, అవతలసిల బడి వుంటారు.

సుబ్బులు లోపలకిటికీలోంకెక్కి 'ఇంచక్కా మేం.... గార్లు....తిం...టాం; మీకు కా... స్తైనా పెట్టం' అంటూవూరించింది.

'పోనీలే; ఈమాటు మా అమ్మ జంతికలు వండినప్పుడు నీకుపెడతానేమో చూడు మరి! ఇంచక్కా మాయింట్లో చెరుగ్గ్రుందీ— పకోడీలున్నాయీ—మిటా.... ...' అంటూవుంటే పార్వతి,

'ఉంటే వున్నాయిలే' అంది సుబ్బులు.

'మిటాయివుందీ—మానాన్న తీర్థంలో జీళ్లుకొంటాడూ—'

'పోనీలే—మాకుమాత్రం లేవా?'

'ఊఁ పాపం! పొద్దున్ననువ్వు పప్పులు తింటూ మాకు పెట్టేవేఁవిటి?' అన్నాడు చంద్రం.

'ఇంచక్కా నాదగ్గర డబ్బుందీ—నేను బొటానీలు కొనుక్కుంటానూ—'

'మాకక్కర్లేదులే' అని ధీమాగా సమాధానంచెప్పి,

'ఏమే సుబ్బులూ?' అన్నాడు చంద్రం-అటుతిరిగి.

'మనకి పెట్టకపోతే పోనీలే' అంది సుబ్బులు.

'నేను మొన్ననీకు శనగలు పెట్టలేదట్రా? నన్ను మీ జతుండనీయవూ?' అంది కావమ్మ.

'ఏమే సుబ్బులూ?' అన్నాడు చంద్రం.

'ఉండనిద్దామేఁవిటి?'

'నాకు మొన్నశనగలు పెట్టిందే, పాపం'

'ఐతే రమ్మనుదాన్ని ; పార్వతిని రానీయద్దబ్బాయ్. నేనుమొన్న జిలేబీతింటూంటే దానికి పెట్టలేదని కొట్టి పారిపోయింది. అది మనజట్టు లేదు.

'నువ్వవతలకుఫో' అని పార్వతిని కసరి కొట్టి, తలుపు ఓరవాకిలిగాతీసి, కావమ్మని లోపలికి రానిచ్చి, ఫెళ్లున తలుపునొక్కి, గడియవేశేశి, కిటికీలోకెళ్లి కూర్చున్నాడు చంద్రం. సుబ్బులు కిటికీలో కూర్చుని, నువ్వు మాజట్టు లేవోయ్....నువ్వు మాజట్టు లేవోయ్' అని గేలిచేసింది పార్వతిని.

'ఫో....అవతలకుఫో' అని కేకలేశాడు చంద్రం.

తెల్లబోయి నుంచుంది పార్వతి.

'ఫో...ఫో' అంది సుబ్బులు.

పార్వతి మాట్లాడకుండా అల్లాగే చూస్తూ నుంచుంది ఆమె పెదిమలు సాగినాయ్

'ఏడుస్తే ఏడువు—మాకేంభయమా?' అంది సుబ్బులు.

పార్వతి బ్యారుమని 'మా అమ్మతో చెబుతానుండం'డంటూ అరుగుదిగి వీధిలోకెళ్ళింది. పార్వతి ఏడుస్తూంటే చూసి తెల్లబోయాడు చంద్రం.

'ఎందుకల్లా ఏడుస్తావ్? నిన్ను మేమేం వన్నా కొట్టేమా?' అంది సుబ్బులు.

చంద్రం తలుపుతీసి పార్వతిని చూసి,

'పాపం, ఏడుస్తోంది—దాన్నికూడా మన జట్టులో వుండనిద్దామే సుబ్బులూ' అన్నాడు.

'పోనీ రానియ్;—ఏమే కావమ్మా?'

'పాపం, ఏడుస్తోంది-మనజతవుండనిద్దాం'

చంద్రంవెళ్ళి 'రా—అమ్మా' అంటూ పార్వతిని లోపలికి తీసుకొచ్చాడు. నలుగురి మధ్యనూ ఇంకా కూచుందో లేదో-పార్వతి-ఎక్కడేడు పక్కడి కెగిరిపోయింది. సూర్యోదయం కావడంతోటే పొగమంచల్లా.

చంద్రం లోపలికెళ్ళి 'నాకో అప్పచ్చి పెట్టవుటే?' అని అడిగేడు వాళ్ళమ్మని. 'ఛా, వెధవా, నీకస్తమానూ ఇదేపని' అని కసిరింది వాళ్ళమ్మ. చిందులు తొక్కుతూ 'ఒక్కటిపెట్టవుటే' అని ఏడ్చాడు చంద్రం.

'ఊఁ విసిగించేస్తావు; పట్టుకుపో అమ్మా-ఇదిగో' అని ఒకటి అవతలపడేసి 'అందమా, చందమా—ఒండినవిల్లా ఎప్పటికప్పుడు పోతూవుంటే' అని విసుక్కుంది.

చంద్రం గారిముక్క పట్టుకొని ఒక్క పరుగులో వచ్చేశాడు కిటికీదగ్గిరికి.

'నాకుకాస్త పెట్టవురా?' అంది సుబ్బులు.

'ఉండవే, వేడిగావుందీ—'

'నేను విరుస్తా నిల్లాఇవ్వరా' అందికావమ్మ.

'నాకుకొంచెంపెట్టవురా?' అంది పార్వతి.

'ఇదిగో పెడుతున్నా' నంటూ గారి విరిచి అందరికీ తలోకాస్తా పెట్టేడు చంద్రం.

'ఇందాకా పాపం, ఏడ్చిం' దంటూ ఇంకోముక్క విరిచి ఇచ్చేడు పార్వతికి.

'నాకింకో లేదిరా?' అంది సుబ్బులు.

'నాకింకో ముక్కేదిరా?' అంది కావమ్మ.

'అబ్బా! ఇంకమీకు పెట్టను—నాకో!' అన్నాడు చంద్రం.

'పోనీలే—మనం వీళ్ళజట్టు వుండొద్దు; వెళ్ళిపోదాం రావే' అంది సుబ్బులు కావమ్మతో.

'రేపు మాయింట్లో తద్దినమవుతుందీ—నీకేమేనా గారిముక్కలూ, పకోడీలూ పెడతామేమో చూడుమరి' అంది కావమ్మ వెడుతూ.

'మాఇంట్లో ఈవేళ తద్దినంకాలేదా? మేం గార్లొండుకోలేదా? రేపుమళ్ళీ మా

యింట్లో తద్దినంరాదా? మా అమ్మ పకోడీలూ, కారప్పూసా వొండదా?—ఏమే పారతీ' అన్నాడు చంద్రం.

'ఊఁ' అంది పార్వతి, నవ్వుతూ.

సుబ్బులూ, కావమ్మా వెళ్ళిపోయారు.

'మనం గారిముక్కలు తిందాం, రావే' అని పార్వతిని లోపలికి తీసికెళ్ళేడు చంద్రం.

'అమ్మా! ఓ గారిముక్కివ్వవుటే?'

'అప్పుడే వచ్చావూ?'

'ఆ...వొచ్చాం.'

'ఒస్తారు...ఒస్తారు.'

'అబ్బా...చప్పునీయవే—మేం వెళ్ళి ఆడుకోవాలి.'

'ఏం తొందర్లేదు; ఎక్కొచ్చిన గుఱ్ఱం దిగొచ్చు కానీవు.'

'ఆఁ....ఆఁ'

'ఊఁ తింటే జబ్బుచేస్తుందిరా.'

'ఆఁ...జబ్బుచెయ్యదే—నాన్న మంది స్తాడుగా.'

'ఎలాగూ మానవు నువ్వు; ఇదిగో—' అంటూ చంద్రానికోటీ, పార్వతికోటీ ఇచ్చి 'ఇహవెళ్ళండం'దామె. వాళ్ళక్కడే కూర్చుని తింటున్నారు.

'అమ్మా! మనింటిలో తద్దినం మళ్లీ ఎప్పుడొస్తుందే?' అన్నాడు చంద్రం.

(విరగబడినవ్వి) 'మంచిమాటలే నేర్చుకున్నా వాఖరికి; గారెలొండినప్పుడల్లా తద్దిన మేట్రా, వెర్రివాడా?'

'ఏం...తప్పా?'

'తప్పుకాదూ? పండగనాలి నాయనా. అల్లా అనకెప్పుడూ.'

'ఊఁ హూఁ...నాకు కావమ్మ నేర్పింది. వాళ్లింటో తద్దినమవుతుందిట; నాకు గార్లు పెట్టదంట'

'తప్పు తప్పు—అల్లా అనకండి.'

*　　　*

౮

చంద్రం, వాడి బుల్లిచక్రమూ, పలకపుల్లలువేసిన నబ్బుబిళ్లల పెట్టీ, బొమ్మలున్న కాయటలాగులూ తెచ్చి అరుగుమీద పెట్టేడు.

'నా బొమ్మలుకూడా తేవద్దురా నేను?' అంది పార్వతి.

'నేనూ వస్తాను మీయింటికి—నడువు' అన్నాడు చంద్రం. దారిలో ఓకుక్క కనిపించింది. 'పుచ్చుకోవే - పుచ్చుకోవే' అని చేతిలోవున్న పుస్తకాలూ అవీ పార్వతి చేతులో పెట్టేసి. ఆకుక్కను ఫెడీల్నోతన్ను తన్ని పరుగెత్తేడు చంద్రం.

'నువ్వకూడా తన్నవే'అన్నాడుపార్వతిని.

'నాకు బయంబాబూ; కరవదూ అది?' అంది పార్వతి.

ఆమాటలు వినిపించుకోకుండా,

"గిన్నెలు మాటుతాం
తెప్పేలాలు మాటుతాం
బిందెలు మాబుతాం
లాంతర్లు మాటుతాం
డబ్బాలు మాటుతాం
చెంబులు మాటుతాం
కంచాలు మాటుతాం
తాళాలు మాటుతాం"

అని కేకవేస్తూ పరుగెత్తేడు చంద్రం.

పార్వతి,

"రేగి పళ్ళోయ్
దోసకాయలోయ్
వెలక్కాయలోయ్

అరటిపళ్ళోయ్
దుంపలు—దుంపలోయ్"

అంటూ పరుగెత్తింది.

## ౮

పార్వతి, తన చిన్నపొయ్యీ, గిన్నెలూ, గరిటీ, లక్కపిడతలూ తెచ్చింది. చంద్రం ఒహ కేటలాగుతీసి పార్వతికి బొమ్మలు చూపిస్తున్నాడు. వీళ్ళనుచూసి కావమ్మ పరుగెత్తుకు వచ్చిందక్కడికి.

'ఛో...ఛో....నువ్వు మాజతుండనన్నావుగ! మీ ఇంటిలో తద్దినమైతే మాకు గార్లు పెట్టనన్నావుగ! ఇందాకా మాగారి ముక్కెందుకు తిన్నావ్ ? మా ది మా కు తెచ్చియ్యి ఇప్పుడు' అన్నాడు చంద్రం.

'ఊరికే అన్నానురా, ఇందాకా—మరేమోనే, నేనుకందిపప్పు తెచ్చేను ; మీకు పెడతానేం?'

'పెడతావా?'

'ఆఁ....'

'ఐతే కూచో ఇక్కడ ; మనంబువ్వాలాట ఆడుకుందాం. నేనెళ్లి తుంగచాప పట్టుకొస్తానేం ?'

'ఊఁ పట్రా.'

'పాపం, సుబ్బుల్నికూడా తీసుకురా నువ్వెళ్లి.'

'ఊఁ తీసుకొస్తా ; చింతపండూ, బెల్లమూ, అటుకులుకూడా తీసుకురమ్మంటా.'

'ఊఁ తెమ్మను.'

* * *

## ౯

దళసరి తుంగచాప తెచ్చి, అరుగుమీద ఓమూలగా గదికట్టేడు చంద్రం. 'నేను అమ్మనిటేం ?' అంది పార్వతి. 'నేను అమ్మాయిని' అంది సుబ్బులు. 'నేను నాన్నని' అన్నాడు చంద్రం. కావమ్మ 'నేనో' అంది. 'నువ్వు అబ్బాయివి' అంది పార్వతి. 'ఛా....నువ్వు మొగాడివౌతావోయ్' అని గేలిచేశాడు చంద్రం. 'ఐతే నేనూ అమ్మాయినే' అంది కావమ్మ.

పార్వతి గదిలోకెళ్ళి, 'వంటయింది; ఇహ మడిగట్టుకోవచ్చు.' అంది.

'ఆఁ కట్టుకుంటా-తడిగుడ్డతడిపియ్, మరి.'

'నీళ్లిక్కడ లేవురా—మరీ'

'ఎక్కడేనా (రా) అంటారేఁవిటే? చూశావుటే సుబ్బులూ, (ఏరా) అంటూరా ?'

'మరిచిపోయినానే—ఊఁ రండి వంటయింది.'

'తడిగుడ్డ ఇవ్వమన లేదూ ?'

'నీళ్లిక్కడ లేందే ?'

'ఉత్తుత్తి నీళ్లోసి, ఇదిగో, ఈసుమాలు తడిపియ్.'

'ఊఁ'

* * *

చంద్రం ఓరుమాలు కట్టుకుని పీటమీద కూర్చున్నాడు. ఉన్న అటుకులుతోనూ, చింతపండుతోనూ, పప్పూ, కూరా, పులుసూ, మజ్జిగా—అన్నీవడ్డించింది పార్వతి.

చంద్రం భోంచేసింతర్వాత 'మీరందరూ చప్పున రండర్రా, అన్నాలకీ' అని కేకేశింది.

కావమ్మ చాపలగదిలో కెళ్లింది. సుబ్బులు అవతలేవుండి 'నాకివతల పెట్టమనవే, అన్నం' అని కేకేశింది.

'ఏం' అంది పార్వతి లోపల్నుంచి.

'ఇవతలెందుకే' అన్నాడు చంద్రం.

'నేను చెప్పనుబాబూ ; అందరూ నవ్వుతారు' అంది సుబ్బులు.

'ఊఁహూఁ ...అన్నం ఆకులోవడ్డించి

తెస్తాను కూచోవే' అని కేకేశింది పార్వతి.

'మీఇల్లు బంగారంగానూ—యివ్వేటే మీరాడే ఆటలూ?' అంటూ నవ్వుతూ యింటిలోంచి యివతలకు వచ్చింది, చంద్రం తల్లి; పెద్దనవ్వులు నవ్వుకుంటూ, ఎక్కడి వాళ్లక్కడికి పరుగెత్తుకు పోయేరు.

* * *

౫

అరుగుమీద చాపతీసుకుని చంద్రంతల్లి లోపలికెళ్లిపోయింది. 'మాఅమ్మ వెళ్లిపోయింది—యిహ వెడదాం, రండే' అన్నాడు చంద్రం.

'ఏమో.... మేంరాం బాబూ—మీఅమ్మ నవ్వుతుంది' అంది సుబ్బులు.

'యింకక్కడ ఆడుకోవద్దులే; నే నన్నం తినేదాకా కూచోండి మాయింటిదగ్గర; తర్వాత మీయింటికెళ్లి ఆడుకుందాం.'

'ఐతే నడువు వెడదాం'

'అన్నం తిన్నతర్వాత మాయింటికెళ్ళి ఆడుకుందామంటే నే నొస్తా'అంది పార్వతి.

'మేం, మీయింటిదగ్గర ఆడం బాబూ; ఏమీ అల్లరిచేయకపోయినా గదిలోకి తీసికెళ్లి బుగ్గలు గిల్లిపంపిస్తుంది మీఅమ్మ.'

'ఏం?'

'వాళ్లమ్మకీ మాఅమ్మకీ పోట్లాటకాదూ?'

'ఔను, వాళ్లెప్పుడూ తిట్టుకుంటూ వుంటారు. ఒహరింటికొహరు వెళ్లరుకూడానూ; మనమెప్పుడూ దెబ్బలాడుకోం-కాదురా?' అంది సుబ్బులు.

'మనమించేక్కా జతగా వుంటాం.'

'జతగావుంటారుట పాపం మొన్ననేగా మీరిద్దరూ పోట్లాడుకున్నారు?'

'పోనీలే; పోట్లాడుకుంటే పోట్లాడుకున్నాంలే-రావేసుబ్బులూ, మనంవెడదాం.

* * *

చంద్రం, సుబ్బులూ, వెళ్లిపోయారు. క్షణంలో అన్నం తినేశాడు చంద్రం. 'చప్పున రారా-మాయింటికెళ్లి నేనింకా అన్నం తినాలి' అంది సుబ్బులు.

ఊఁ వెడదాం' అని, 'నాకోమితాయి వుండ యివ్వవుటే' అని అడిగేడు వాళ్లమ్మని.

'లేవు—అయిపోయినాయిరా.'

'ఆఁ....దొంగా; అయిపోయినా యంటావా? పెట్టెలోవుంటేనూ!'

'లేవురా.'

'ఉన్నాయి; నేను పొద్దున్నచూడలేదూ?'

'ఏం వేపించుకు తింటున్నావురా' అంటూ ఓవుండ సుబ్బులుకీ, ఒకటి చంద్రానికీ యిచ్చి 'ఇక వెళ్లి ఆడుకోండి' అందివాళ్లమ్మ.

చంద్రం వుండ పుచ్చుకుని 'అన్నివుండలు పెట్టెలో పెట్టుకుని, లేవు పొమ్మంటావా? నేనబద్ధం చెప్పేవని నాన్నతో చెప్పిమొన్న నన్ను కొట్టించేవుకాదూ, పాపం! నువ్వ అబద్ధాలాడొచ్చేం? ఉండు; నాన్నను రానీయ్—నీసంగతి—' అంటూ వెళ్లేడు చంద్రం.

'అరి నాతండ్రీ! ఎన్నిమాటలు నేర్చుకున్నావురా నువ్వు' అంటూ చంద్రాన్ని పట్టుకుని ముద్దెట్టుకుందామె.

'ఉండవే; నన్నువిడిచిపెట్టు; వెళ్లి ఆడుకోవాలి' అంటూ విదిలించుకు పారిపోయేడు చంద్రం.

—పమ్మి రామశాస్త్రి.

# ఆంధ్ర ప్రబంధముల యుత్పత్తి

## ( క్రీ. శె. 1180—1480 )

మనదేశమందు సంస్కృతభాషయందలి కావ్యము కేవలము నూతన స్వరూపముగా కవులచే సృష్టింపబడ వచ్చినదని. అది చిన్నచిన్న వాఙ్మయ స్వరూపముల నుంచి క్రమక్రమముగా వృద్ధినొంది కొన్ని శతాబ్దములలోగాని సంపూర్ణాకృతిని బొందలేదు*. ఆంధ్రప్రబంధ ముట్లుగాక కళాపూర్ణునివలె సద్యోయౌవనమున సంపూర్ణావయవముల నిర్మాణముతో పుట్టగలిగెను. ఏలనన ఆంధ్రవాఙ్మయము ప్రభవించిన కాలమునకు, అనగా, క్రీ.శె. తొమ్మిది లేక పదియవశతాబ్దమునాటికి సంస్కృతకావ్యస్వరూప మత్యధికముగా నభివృద్ధి బొంది గొప్పగొప్ప ప్రామాణికమూర్తులను జూపింపగలిగినది. కాళిదాసు, భారవి, మాఘుడు మున్నగు మహాకావ్యకర్త లానాటికే తమ గ్రంథరాజములను రచించియుండిరి. కావున నాంధ్రకవులు ప్రబంధములు వ్రాయుటకు కావలసిన మాదిరులు పుష్కలముగా వారికి లభించియున్నవి. ఆదికవియగు నన్నయభట్టు (క్రీ.శె. 1022) వాల్మీకి వ్యాసులను జదువుటయేగాక కాళిదాసు, భవభూతి, భారవి, మాఘుడు, శ్రీహర్షుడు మున్నగు సంస్కృతమునందలి కావ్యనాటకకర్తలు రచించిన గ్రంథములను కొన్నింటిని చదువగలిగియుండును. అయినను తాను పురాణమగు మహాభారతమును తెనిగింప బ్రయత్నించుటచే కావ్యజ్ఞానమును మరుగు పెట్టికొనెను. తన యేలికయగు రాజనరేంద్రుడు మహాభారతమును దెనిగించుమని కోరినకతన యా పురాణము నాంధ్రీకరింపవలసివచ్చెను గాని తనకాలమందు సంస్కృతమున నాటకములును కావ్యములును లేకయుండుటచే గాదు. అతను ఆంధ్రప్రబంధమును వ్రాయదలచినచో నిస్సందేహముగా నొక మహాప్రబంధమును వ్రాయగలిగియేయుండును. కుమారసంభవము, కిరాతార్జునీయము, శిశుపాలవధ—యిత్యాది మహాకావ్యములలో దేనినో యొకదానిని మాతృకగా గైకొని తానొక యాంధ్రప్రబంధము రచించియుండవచ్చును. అందుచేత యాంధ్రప్రబంధముల స్వరూపనిష్పత్తి క్రమక్రమముగా నభివృద్ధిబొందినదని యొకానొకరు సూచించినమాట యథార్థముకాదు. నన్నయభట్టు చేయనిపని యాతనితరువాత వచ్చిన నన్నెచోడుడు (క్రీ.శె. 1180) కడుసమర్థతతో నెరవేర్చెను. ఆతనురచించిన కుమారసంభవము ఆంధ్రానువాదమో లేక యాంధ్రానుసరణమో చెప్పుట కవకాశముచాలదు. ఆ కవివరుడు కాళిదాసుని బేర్కొనియుండుటచే నాతని కుమారసంభవము జదివియుండునుగాని తన గ్రంథము కాళిదాసుని గ్రంథమున కనువాదముగాదు, యనుకరణముగాదు. కాళిదాసునినేగాక యింక ఉద్భటుడను మరియొక గీర్వాణకవి రచించిన కుమారసంభవమను కావ్యమునుగూడ ప్రత్యేకముగా బేర్కొనెను. ఆ గ్రంథమునకైనను తాను రచించిన ప్రబంధము అనువాదముకాదు కాని అనుకరణమై యుండవచ్చునని తోచుచున్నది. నన్నెచోడుడు రచించిన యీ ప్రబంధము, సంస్కృతకావ్య లక్షణములనే, యొండు రెండు విషయములలోతప్ప, నిర్విశిష్టముగా జూపుచున్నది. సంస్కృతకావ్యములవలె పండ్రెండాశ్వాసములు గలిగి

* ఈ విషయమును పూర్తిగా తెలిసికొనగోరువారు ప్రొఫెసరు కీతు వ్రాసిన సంస్కృతవాఙ్మయ చరిత్రను చదువవలెను. ఆ గ్రంథమందు అశ్వఘోషుడు కాళిదాసు మున్నగువారు తమతమ కావ్యములను వ్రాయకపూర్వమే శిలాశాసనాదికములలో కావ్యశైలి యెట్లు నిరూపితమైనదో ఆ చిన్నచిన్న రూపములనుండి కావ్యగ్రంథము లెట్లుత్పన్నములైనవో యీ యావద్విషయము ఉదాహరణములతోగూడ విశదీకరింపబడియున్నది.

దీర్ఘముగానున్నది. వర్ణనాదివిషయములలో సంస్కృత కావ్యమును పరిపోలియున్నది. మరి భిన్నముగానున్న విషయములేవన గద్యపద్యాత్మకముగా ననగా చంపూకావ్యముగా రచింపబడుట, ప్రతి యాశ్వాసము నందు ననేకవిధములగు వృత్తములను గలిగియుండుట- యిత్యాదికములు.

చంపూకావ్యములుగా వ్రాయుట మన తెలుగు కవులకు మొట్టమొదటినుండియే యలవాటైనదని వెనుకటి యధ్యాయములో చెప్పితినిగదా. నన్నయభట్టు తన భారతమును చంపూగ్రంథముగానే రచించెను. ఆ మాదిరినే యటుతరువాత వచ్చిన నన్నెచోడుడును కుమారసంభవమును చంపూప్రబంధముగానే రచింపగలిగెను.

నన్నయభట్టు భారతమును ప్రత్యేకము ప్రబంధరూపముగా వ్రాయకపోయినను కొంతవరకు దానియందు ప్రబంధశైలి నుపయోగించెనని కొందఱు విమర్శకులు తమ పరిశీలనా నైపుణ్యమును ప్రయోగించి యుదహరించుచున్నారు. ప్రబంధశైలియనగా వర్ణనాదికములు గలదియై యలంకార సంభృతితోను, సమాసబాహుళ్యముతోను ప్రౌఢమై, సాహిత్య పోషితమై నాతిసులభముగనుండును. పురాణములయందలి శైలి యట్లుగాక సరళముగాను, సులభముగాను సుగ్రాహ్యముగానుండి పదాడంబరములేక భావములను నిర్వక్రముగా దెలుపుచు దేటతెల్లముగానుండునది.

సంస్కృతకావ్య నాటకములను సాకల్యముగా బఠించిన నన్నయభట్టచ్చటచట తన గ్రంథములో గీర్వాణ పాండిత్యమును కొంచము కొంచముగా జిలుకరించుట యొక గొప్ప విశేషముకాదు. కాని కిరాతార్జునీయము, కుమారసంభవము, అభిజ్ఞాన శాకుంతలము యిత్యాది మహాకావ్య నాటకములను జదివిన యాంధ్ర మహాకవి యాగ్రంథముల పరిచయము నాయా కథ పట్టులు వచ్చిన స్థలములలోనైనను తన భారతమందు కనుపరుపకపోవుట విస్మయజనకమైన విషయము. నన్నయభట్టతిశ్రద్ధతో వేదవ్యాసుని యథారూపముగా నాంధ్రభూమియందు బ్రతిష్ఠింప నుద్దేశించు కొనెనని నాకు దోచుచున్నది. ఏమాత్రమైనను మాతృక నతిక్రమించినయెడల నపచారదోషము సంభవించునేమోయని వైదికోత్తముడగు నన్నయభట్టు తలంచెనేమో. కావున వాగనుశాసనుని భారత భాగమందు ప్రబంధశైలి యంతగా గాన్పింపదు.

నన్నెచోడుడు ప్రత్యేకముగా నొక యాంధ్ర మహా ప్రబంధమును సంస్కృతకావ్య మార్గమున వ్రాయదలచి యిద్దరు సంస్కృత మహాకవులు కావ్యరూపముగా రచించిన కథనే తానుదీసికొని కావ్యానురూపముగా రచించి మెప్పొందియుండెను. న్యాయ్యముగా నాంధ్రప్రబంధమునకు మొట్టమొదట దారి చూపినవాడు మన మెఱిగినంతవరకు నీ నన్నెచోడుడనియే నిష్పక్షపాత బుద్ధితో జెప్పవలసియున్నది. ఈ కవిరాజ శిఖామణి నిక్కముగా ప్రబంధ పితామహుడని పిలువదగియున్నాడు. ఆంధ్రప్రబంధ రచనకు దారిచూపి గుణదోషములను సమానముగ నాంధ్ర కవులకు భిక్షమిడిన కవిపుంగవు డితడే. అంతకంతకు నాంధ్రప్రబంధములు క్రమముగా వృద్ధిబొంది తుదకు వెఱ్ఱితలలువేసి చూపినదోషములు కొన్ని యీతని గ్రంథమందే ప్రాదుర్భావము బొందినవి. ఈతను మాత్ర మేమిచేయగలడు. తనకు పూర్వముననున్న సంస్కృత కావ్యములలోని గుణదోషముల నట్లే తానును గైకొనెను. కాబట్టి ఆంధ్రప్రబంధములందలి గుణదోష విచారణ గీర్వాణ కావ్యములనుంచి గలిగిన సాంక్రమిక సంసర్గమనియే యంగీకరింపవలసియున్నది. పార్వతీ పరమేశ్వరుల సంభోగవర్ణనముచేసిన నన్నెచోడుడు కాళిదాస మహాకవి అట్టి సందర్భమున స్వయముగా కనపఱచిన శృంగారరసజ్ఞానమహిమ ననుకరించినవాడే కదా. ఇట్లే ఆంధ్రప్రబంధములయందలి దోష విషయములంధాంధ పరంపరగా సంస్కృత కావ్యములనుండియే వానియందు ప్రసరించినవని నిశ్చయముగా జెప్పవచ్చును. మఱియేమైనను కొంతనైతికశుద్ధియు రసౌచిత్యము మొదలగు వానియందు మనయాంధ్రకవీశ్వరులే యెక్కువ వివేకము జూపిరని నాయభిప్రాయము.

పురాణములను వ్రాయుచు ప్రబంధలక్షణములన్ను

నిర్విశిష్టముగా నిరూపించి మహాప్రబంధమును వ్రాసె నేమోయన్నట్లు పురాణమును దెనిగించిన మొదటి యాంధ్రమహాకవి తిక్కనసోమయాజి. సంస్కృత కవులు పురాణములను కావ్యములను (ప్రబంధములను) వేఱువేఱు శయ్యారీతుల రచించిరి. మన యాంధ్రకవులును మొట్టమొదట నా మార్గములనే పోయిరి. నన్నయభట్టు భారతపురాణమును పురాణముగా వ్రాయ నుద్దేశించి సరళమైనదియు, సులభమైనదియు నగుశైలి నుపయోగించెను. నన్నెచోడుఁడు సంస్కృత మహాకావ్యములవలె యాంధ్ర మహాప్రబంధము వ్రాయుచు, అష్టాదశవర్ణనలు, అలంకారవిశేషములు, పాండిత్యప్రకర్షయును జూపించెను. ఇంక తిక్కన భారత రామాయణములగు పురాణములను మహాకావ్యములుగా అనగా మహాప్రబంధములుగా, వ్రాయ నుద్దేశించి తదనుకూలమగు దృష్టితోనే వానినిచూచెను. ఉత్తర రామాయణమును సంస్కృత మహాకావ్యమువలె, అనగా, నిర్వచనముగా వ్రాసెను కాని యది తనకు తృప్తికలిగింపలేని కారణమున భారతమును తెనిగించునప్పుడు నన్నయభట్టువలె చంపూకావ్యముగానే రచించెను. అయితే నన్నయభట్టు కేవలపండితుడగుటచే తన రచనయందు నూతనఫక్కిని ప్రవేశపెట్ట వెఱచినట్లు కాన్పించుచున్నది. తిక్కనమాత్ర మట్లుగాక ప్రతిభాన్వితుడైన కావ్యశిల్పియగుటచే, మున్ను మతవిషయములో హరిహరసమన్వయము జేసినట్లు వాఙ్మయవిషయములో పురాణప్రబంధ సమన్వయము జేసినవాడయ్యెను. కావున భారతము పురాణమైనను చాలవరకు ప్రబంధముగానే రచించెను.

"మ॥ హృదయాహ్లాది చతుర్థమూర్జిత
కథోపేతంబు నానా రసా
భ్యుదయోల్లాసి విరాటపర్వమును
యుద్యోగాదులుం గూడగా
బదియేనింటిఁ దెనుంగుబాస
జనసంప్రార్థ్యంబులై పెంపునం
దుదిముట్టమున్ రచియించుటొప్పు
బుధ సంతోషంబు నిండారగన్.

క॥ అని రచనాకౌతుకమున
మనమలరఁగ నీ ప్రబంధమండలి కధి నా
థునిగా నేపురుషునిఁ జేర్కొను
వాడనో యనుతలంపు గూరినమదితోన్"

(విరాటపర్వము)

ఇటువంటి రచనాదృష్టి తనకేగాక తన శిష్యులకు గూడ కలుగునట్లుచేసెను. నాచనసోముడు ఉత్తర హరివంశమును ప్రబంధశైలిలో వ్రాసెను. మారన మార్కండేయ పురాణమును మహాకావ్యముగా రచించెను. కేతన దశకుమారచరిత్రమను వచనగ్రంథమును, ధర్మశాస్త్రమగు విజ్ఞానేశ్వరీయమును మహాప్రబంధములుగాఁ దెనిగించెను. ఎఱ్ఱాప్రగడ తొలుదొల్త హరివంశమును పురాణశైలిని వ్రాసినను నృసింహపురాణమును మాత్రము ప్రబంధముగానే నిర్మించెను. ఈ కవివరుల రచనాప్రావీణ్యమున ప్రబంధరచన స్థిరమై సాముదాయకమగు సౌభాగ్యమును ధరించి యర్వాచీనకవుల కాదర్శరూపమయినది. కాబట్టి మంచనకవి సంస్కృత నాటకమగు విద్ధసాలభంజిక యనుదానిని కేయూరబాహుచరిత్రమను ప్రబంధముగా కథను కొంత మార్చియు, క్రొత్తకథలను జేర్చియు రచించెను * కావున సంస్కృతమందలి నాటకములను గాని వచన గ్రంథములను గాని పురాణములను గాని శాస్త్రములను

* విద్ధసాలభంజికను రాజశేఖరుడనుకవి రచించెను. ఈతను కర్పూరమంజరియను మరియొక నాటకమును మరికొన్ని నాటకములను రచించిన సుప్రసిద్ధ గీర్వాణ కవి. విద్ధసాలభంజికయందు ఉజ్జయినీపట్టణము నేలుచుండిన విద్యాధరమల్లుడను రాజు కేయూరబాహుచరిత్రమున కళింగదేశమందలి త్రిపురీనగరము నేలుచుండిన కేయూరబాహువను రాజుగా మార్చబడెను. తక్కిన విషయములు చాలవరకు రెంటియందును సమానములే. అనగా భాగురాయణుఁడను మంత్రియు రత్నసుందరియను రాజ్ఞియు మృగాంకావళియను కుమార్తెయు నిత్యాదులు. ఈ కథకు కొన్ని నీతికథలను అచ్చటచ్చట సందర్భయుక్తముగా పొదివి నాలుగాశ్వాసముల గ్రంథముగా పెంచబడినది.

గాని తెనుగున ననువదింపవలసివచ్చినప్పుడు ప్రబంధమే వాఙ్మయస్వరూపమైనది. కావున ఆంధ్రకవిత్వ లక్షణమే గాక ఆంధ్రప్రబంధలక్షణముకూడ ప్రజలకు తెలియవలసిన యావశ్యకత యేర్పడినది. ఆ కారణమున తత్కాలమున విన్నకోట పెద్దనయను నాంధ్రకవి కావ్యాలంకారచూడామణి యను పేరను యాచార్య దండి వ్రాసిన కావ్యాదర్శమును దెనిగించియు మమ్మటుని కావ్యప్రకాశము ననుసరించియు నాంధ్రకవిత్వమునకును నాంధ్రప్రబంధమునకును లక్షణమును నిరూపించెను.

ఇంతవరకు నాంధ్రప్రబంధములు సామాన్యముగా పౌరాణికైతిహాసిక గాథలనుండి గ్రహింపబడి శృంగార రసముకలిగినను లేకపోయినను నీతిబోధకములై యుండినవి మంచనకవి చెప్పినట్లు

క॥ స్థాయిరసము శృంగారం
బై యలవడఁ గథలు నీతులై యెడ నెడరాఁ
గేయూరబాహు చరితము
చేయుము నీ వంధ్రవాక్య శిల్పము మెరయన్.

శృంగారరసముతో నున్నను ప్రబంధములు నీతియుక్తములై కాంతాసమ్మితములుగా నుండెను. కుమారసంభవము, నృసింహపురాణము, కేయూరబాహు చరిత్రము- యిత్యాదులన్నియు నీనియమము నతిక్రమింపలేదు. వీని యందు శృంగారరస ముత్కటముగాక తక్కిన రసములతోబాటు హద్దుపద్దులలో నిమిడియుండెను.

సుమారు పదునాల్గవ శతాబ్దాంతమున శ్రీనాథ మహాకవి యాంధ్రప్రబంధములను వ్రాయ మొదలుపెట్టెను. ఆతను ప్రారంభమునుండియు శృంగారరసమునకు ప్రాధాన్యము నిచ్చినవాడు. శృంగారరస ప్రధానమగు శ్రీహర్షుని నైషధకావ్యమును దెనిగించి యందు శృంగారరసము విజృంభితముగా వర్ణించిన కతన దానికి శృంగారనైషధమని పేరిడెను. శ్రీహర్షుని నైషధ కావ్యము సంస్కృత కావ్యములలో గడగొట్టువాని లోనిది. సంస్కృత కావ్యము లుచ్ఛదశను గోల్పోయి క్షీణదశ నొందుచున్న కాలమున నిది రచింపబడినది. ఈ కావ్యమందు శృంగారరసము అతికటువుగాను విపరీతముగాను సంఘమర్యాదల నతిక్రమించినదిగాను వర్ణింపబడినది. దానియందలి శైలియన్నను, పాండిత్య ప్రకర్షయే ముఖ్యోద్దేశముగా నుండినట్లు క్లిష్టమైన పదబంధములతోను నిగూఢమైన కల్పనలతోను నతి గహనముగా నుండియున్నది. ఇట్టి వికృత కావ్యమును తన గ్రంథమునకు మాతృకగా దీనికొని శ్రీనాథుడు శృంగారనైషధమును నాంధ్రప్రబంధమును నిర్మించెను. ఆ గ్రంథమున ప్రబంధమునకు గావలసిన లక్షణము లన్నియు నుండుటయే గాక శ్రీనాథుని యప్రతిమానపు శైలి మఱింత రమణీయమగు మెరుగు కలుగజేసినది. ఆ కారణమున యతని తరువాత వచ్చిన ప్రబంధ కవులందఱు శ్రీనాథుని యాదర్శముగా నిడికొని నైషధము ననుకరింపసాగిరి. శ్రీనాథుని శృంగారరసవర్ణనలు శ్రీనాథుని కవితాశైలియు నీరెండును కవిసంప్రదాయము లైనవి. ఎఱ్ఱాప్రగడ నృసింహపురాణమును రచించినట్లు స్థలపురాణములను ప్రబంధరూపముగా రచింప సమకట్టి శ్రీనాథుడు భీమేశ్వరపురాణమును, కాశీఖండమును నాంధ్రమున సంధానించెను. ఇట్లు పుణ్యక్షేత్రముల మాహాత్మ్యములను నిరూపించుచు భగవంతుని కథలను జెప్పుటలో నీయిద్దరు కవులును యెట్లు వేఱువేఱు మార్గముల నడచిరో యాయా గ్రంథముల నొకదానితో నొకటి సరిజూచి పరీక్షించినయెడల విశదము కాగలదు. నృసింహపురాణమందలి గౌరవగాంభీర్యములును, భీమేశ్వరపురాణమందలి యప్రశస్త శృంగార వర్ణనలును జూచిన యిద్దర కవులయొక్కయు వేఱు వేఱు రసనిరూపణమార్గములు తెలియగలవు. ఇట్లు శ్రీనాథు డాంధ్రప్రబంధములలో శృంగారరసమున కత్యధిక ప్రాధాన్యము నిచ్చుటయు శైలియందు పాండిత్య ప్రకర్షయు శబ్దార్భటియు మించునట్లు పెంచుటయు నిత్యాది నూతన కవితాధోరణులకు దారిచూపిన వాడయ్యెను. అతని తరువాత కవులలో పెద్దలును పిన్నలును సామాన్యముగ నాదారినే త్రొక్క మొదలిడిరి.

కాళిదాసుని శాకుంతల నాటకమును శృంగార శాకుంతలమను పేరున పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు ప్రబంధముగా రచించి శ్రీనాథుని పోకడలను విస్పష్టముగా ననుకరించెను. జక్కనకవి విక్రమార్క చరిత్ర

మందు అశ్లీల శృంగారరసమును విచ్చలవిడిగా జూపిన వాడయ్యెను. గాని శ్రీనాథుని బావమరదియగు దగ్గుబల్లి దుగ్గకవిమాత్రము నాసికేతోపాఖ్యానమను రమ్యమైన ప్రబంధమును రచించి శ్రీనాథుని యనుచిత శృంగారరచనల కెంతమాత్రము తావొసగక యాంధ్ర కవుల తొంటిశీలమును నిలువబెట్టెను. అనంతామాత్యుడును దన భోజరాజీయమునందు చక్కని మతివివేకములను గనబరచి స్తుతిపాత్రుడాయెను. ఇట్లాకాలమున కొందఱు మహామతులు శ్రీనాథుని యపార శృంగార రచనల నొల్లకపోయినను చాలమంది యాతని ప్రతిభాకాంక్షితులై యాతనికి వశంవదులైరి. ఇట్లు శ్రీనాథుడు తాను సంస్కృతకవులనుంచి స్వీకరించిన రసదోషము నాంధ్రకవులకు పంచిపెట్టిన వాడయ్యెను. మొదటికాల మాంధ్రకవులకు తిక్కనసోమయాజి యెట్లు కవితాగురువయ్యెనో యట్లే మధ్యయుగపు కవులకు శ్రీనాథుడు కవితాగురువయ్యెను.

మొత్తముమీద పదునేనవ శతాబ్దాంతమునకు నాంధ్రప్రబంధరచన సుస్థిరమై శాఖోపశాఖలుగ విస్తరిల్లి పెంపొందినది. ప్రతియాంధ్రకవియు నేదోయొక సంస్కృత గ్రంథమును తీసికొని దానిని ఆంధ్రప్రబంధముగా వ్రాయ నుద్యోగించుచుండెను. అనగా ప్రతి యాంధ్ర ప్రబంధమును సామాన్యముగా నేదోయొక సంస్కృత గ్రంథమునకు స్వేచ్ఛానువాదమో లేక స్వేచ్ఛానుకరణమో యయియుండెను. ఇట్లుండుటచే నాకాలమందలి యాంధ్రప్రబంధముల నాంధ్రభాషాంతరీకరణములనియే యూహింపవలసి యున్నది. ప్రత్యేకముగా స్వకపోల కల్పితములుగాని, లేక సంస్కృత కావ్యములవలె చిన్న పౌరాణికకథలను తీసికొని కవులు తమ ప్రజ్ఞావిశేషములచే వానిని పెంచి రచించుటగాని యాకాలమున ననగా పదునైదవ శతాబ్దాంతము వరకు గోచరింపలేదు. భాషాంతరీకరణము సర్వవిధముల పరిపూర్ణతబొందినది. యింక స్వకపోల కల్పనయు స్వతంత్ర రచనయు నాంధ్రప్రబంధమున నవతరింప వలసి యున్నవి.

—టి అచ్యుతరావు, యమ్.ఏ.యల్.టి.

# నిజరాగము

౧

రాణ్మహేంద్రవర నగర రాజవీథి
నెన్నొ వింతలున్నవాయది యెంతయిఱుకొ
యెందఱెందఱు నడుతురో యెఱుఁగనట్టి
యాంధ్రుఁడుండడు, ఉండ డేయాత్రికుండు.
అట్టి సువిశేష నగరంబునందు నొక్క
పేదరాల్ చీమచింతకా యాదరి దిటు
లీదరి కటు సర్దుచుఁ దట్టనే యమరిచి
యమ్ముకొనఁ జూచు దమ్మిడి కారు వంతు.
బియ్యమునకైనఁ గాదన కియ్యఁబోవు.
యింతకంటె వెలగల వికేవిలేవె ?
వర్తకమునకు మూలంబు వసుధపైని
చీమచింతకాయ దొరకె నీమనిషికి
నన్నవారెవ రగపడ రానగరున
కొన్నవారెవరో నేర దన్నెలతుక
ఉన్నదాక లేతరంగొక చెన్నుమెలిక
చీమ చింతకాయకుగూడ చెప్పదంతె.
పగిపైపు సూడనె సూడదూరక పయి
కుంచి యెర్పును జేర్చును మంచివన్ని.
చెప్పువారెవ్వ రాయొప్పు ? చీమ చింత
కాయ యొప్పని నేనెంచి డాయుచుండఁ
బ్రియులు ప్రియురాండ్రు చేరిరి వేనవేలు
ప్రియులు కొందఱు గొన్నారు వెలగలవన ?
కాదు. ప్రియురాండ్రముంగురుల్ కంటెసాగను
మెలికనుండుట అవ్వాని మెలిక మెలిక
విడిచి ప్రియురాండ్రు వలిచి ప్రియుల కిడిరి
తియ్యదనమునకా? కాదు తెల్లపొరలు
వయసుఁ జిరునవ్వుకంటెను నయమనుకొని.

—కవికొండల వెంకటరావు,
బి.ఏ.,బి.ఎల్.

# "న భూతో న భవిష్యతి"

౧

'ఒకమాట అడగాలని ఉంది. కోప్పడకుండా ఉంటారా?'

'అడిగినతర్వాత చెబుతాను'

'అడిగినతర్వాత ఇంకా చెప్పడమేముంటుంది?'

'..................'

'..................'

'ఏమిటి నీ వడుగదలచుకొన్నది?'

'ఏమీలేదు. ఇన్నాళ్ళనుంచీ అంటే వండిపెట్టే వాళ్ళు, చూచేవాళ్ళు, లేక పిల్లలను తాతముత్తవలింట్లో ఉంచారు ఇన్నాళ్ళాయి. ఇప్పుడయినా తీసుకురాకూడదూ?'

'..................'

'ఏమండి మాట్లాడరు?'

'నడుస్తున్న కాపరాన్ని ఈవిధంగా నడవనిద్దూ.'

'అంటే'

'సుఖాన ఉన్నవాళ్ళను తీసుకువచ్చి మనం కష్టపడడమూ, వాళ్ళు సుఖపడకపోవడమూ ఎందుకు? ఈ విధంగా జరిగితేమాత్రం వచ్చే నష్టమేముంది?'

'మీ మాటలు నా కర్థంకావడంలేదు. వాళ్ళను ఎవరు కష్టపెడతారు?'

'ఎవరా? ఎవరేమిటి? వాళ్ళే కష్టపడతారు.'

'వాళ్ళు ఎందుకు కష్టపడాలెనో నా కర్థంకావడం లేదు.'

'వాళ్ళకు చాకిరి జరగాలెనా! ఇక్కడ వాళ్ళ కెలా జరుగుతుంది?'

'బాగానే జరుగుతుంది. ఎవరికోసం జరుగుతుంది?'

'నా కెందుకు చెబుతావు?'......

'అవును. నేనూ మీరన్నమాట అర్థంచేసుకున్నాను. వాళ్ళను సరిగాచూడక నేనే వాళ్ళను కష్టపెడతానని మీ అభిప్రాయం. అవునా?'

'అలా ఎందుకు కావాలె? నీవు చిన్నదానవు. పోషణ చేయడం చేతకాదు. వాళ్ళకు సరియైన పోషణ లేకపోతే వాళ్ళు కష్టపడతారని ఎందుకుకాకూడదూ నే నన్నమాట?'

'మీరు వెయ్యిచెప్పండి! వాళ్ళనుమాత్రం త్వరలోనే తీసుకురాకతప్పదు.'

'ఏం అంత తప్పనిసరి?'

'వాళ్ళఇంట్లో వాళ్ళుండడం న్యాయమంటారా? తాతముత్తవలింట్లో ఉండడం న్యాయమంటారా?'

'ఈ పరిస్థితులలో వాళ్ళెక్కడ ఉన్నా ఒకటే!'

'అదెలా అవుతుంది? కన్నతండ్రులు మీరు మీ పిల్లలకు దూరమయిఉండడం న్యాయ మెలా అవుతుంది? ఎంత బిగబట్టినా మీ మనస్సు వాళ్ళకోసం ఉవ్విళ్లూరకుండా ఉంటుందా?'

'అయితే కావచ్చు. ఏం లాభమిప్పుడు?'

'లాభంలేకేమి? అందుకే వాళ్ళను ఇక్కడికి తీసుకురాక తప్పదంటున్నాను.'

'గట్టిగానే అంటున్నావుగాని అందులో ఉన్న సాధకబాధకాలు నీవు బాగా ఆలోచించడంలేదు.'

'బాధకా లేమీ లేవు. అన్నీ సాధకాలే.'

'అలాగే. మరి పోషణమాట!'

'ఇందాకనే చెప్పారుగా, చిన్నదాన్ని నాకు తెలియకపోయినా, కన్నతండ్రులు మీరున్నారు అందులో లోపమేమీ జరగదన్నమాటే.

'ఎప్పుడూ నే నింటివద్ద ఉంటానా!'

'లేనప్పుడు మీనుంచి తెలుసుకుని నేను చేస్తాను'

'అది అంత సులభం గాదు గాని ఆ విషయం మరిచిపో.'

'ఎందువల్ల సులభంగాదో!'

'ప్రపంచకంలో సవతిపిల్లల లేని ప్రేమ పుట్టమనడమూ అసహజమే. నీవు చిన్నతనంలో ఉన్నావుగనుకా, ఏదో పిచ్చిచదువులు చదివావుగనుకా ప్రపంచకంలో పద్ధతుల్ని తల్లక్రిందులు చేద్దామనుకుంటున్నావు

గాని నీ మనస్సు నీవు తెలుసుకోవడంలేదు.'

'మీరు చెప్పిందీ కాదనడానికి వీలులేదు. కాని మీ రెన్ని చెప్పినా మీరు ప్రక్కన ఉన్నతరువాత ఇతరుల అనూయలుగాని, తెలివితక్కువ పనులుగాని ఏమీ పని చేయవు.'

'ఎవరు చెప్పగలరూ? ఆ పరిస్థితులు న్యాయనితోచినప్పుడు నేనే తీసుకువస్తాను.'

'మరిమీరు తీసుకురాకపోబట్టే నేను చెప్పవలసి వచ్చింది.'

'కాని తీరా తీసుకువచ్చింతర్వాత అప్రతిష్ట పని అవుతుంది సుమా! ఎందుకు లేనిపోనిది తెచ్చి పెట్టుతావు పోనిద్దూ. కడుపులో చల్ల కదలకుండా కూర్చోలేక. బజారునపోయే పీడా మాయింటిదాకా వచ్చిపొమ్మని.'

'అప్రతిష్ఠే అనుకోండి. అదంతా నాదేగా?'

'నాకూ భాగంఉంటుంది.'

'అందుకనే. నాఅంతట నేనే తీసుకురమ్మంటున్నానుగా, నావల్ల అప్రతిష్టకు కారణాలు కలగవనుకోండి'

'ఏమోనబ్బా!'

'చూడమన్నానుగా. తరువాత అందురుగాని'

'ఇహ తరువాత అనేదేమిటి? నలుగురిలో తల వంపులే.'

'నావల్ల లోపంలేకుండా చేస్తాను. మీరుమాత్రం తీసుకురాకతప్పదు.'

'చాలా గట్టిపట్టుపట్టావు. ఎన్నాళ్ళనుంచీ ఆలోచిస్తున్నావేమిటి?'

'ఈ ఆరునెలలనుంచీ మీరే తీసుకువస్తారనుకుంటున్నాను.'

'నాకుమాత్రం వాళ్ళను వదిలిఉండడం సుఖమనుకున్నావా యేమిటి? పిల్ల నా మాలిమికూడానూ. నా దగ్గరతప్ప పడుకుండేదేగాదు. తల్లిదగ్గర ఏం పాలు తాగేదో'

'అయితే ఎప్పుడు తీసుకువస్తారు?'

'అనుకోంగానే అయినట్లేనా? మా అత్తగారేమంటుందో?'

'ఏమంటుందేమిటి? పిల్లలను తండ్రిదగ్గరకు పంపనంటుందా?'

'పంప ననదనుకో? పిల్లలకు జరగదనీ, పిల్లలు తన మాలిమి అనీ ఏవో ఆటంకాలు చెప్పరూ? ప్రపంచకంలో సవతిపిల్లలను సరిగా చూచిన సవతితల్లి లేనపుడు ఆవిడ సవతితల్లిదగ్గరకు పిల్లలను సులభంగా పంపిస్తుందంటావా?'

'అలా అయితే, నేనూ మీరూ ఇద్దరంవెళ్ళి ఆమెకు నచ్చచెప్పి తీసుకువద్దాము.

'నీవుకూడా వస్తావా? సవతిపుట్టింటికి?'

'తప్పేముంది? మన పిల్లలున్నచోటికి మనం వెళ్ళతాము? వాళ్ళనుటుకు మనకేం పరాయివాళ్ళా?'

'సరే ప్రయత్నంచేద్దాం కానీ'

'ఎప్పుడూ? రేపు వినాయకచవితికి వెళ్ళాలి.'

'సరే. అలాగేకానీ.'

## ౨

'ఏమండీ! వచ్చి నాలుగురోజులయింది. నాకు చాలా తొందరపనులున్నాయి, పిల్లలను తీసుకువెళ్ళుదామని'

'ఎందుకూ ఇప్పుడు?'

'ఎందుకేముందీ? అక్కడే ఉంటారని'

'ఏమిటీ? అక్కడే ఉంచుకుంటారా?

'అదే ఆలోచన.'

'ఇదేమిటీ? ఈ ఆలోచన ఎవరు చెప్పారు?

'మేమే అనుకున్నాము.'

'మీ పిల్లలను మీరు తీసుకువెళ్ళడానికి నా అభ్యంతరం ఏమీ ఉండదనుకోండి. వాళ్ళ కక్కడ ఏలాజరిగేదీ ఆలోచించారా! బుడబుడ తీసుకువస్తే తరువాత ఇబ్బందులువస్తయి.'

'ఏలా జరగడమేమిటండీ అమ్మగారూ? మహారాజులలాగా జరుగుతుంది నాకర్లను తక్కువా? చాకర్లకు తక్కువా?'

'ఎవరూ తక్కువగాదు జరుగుతుందనే అనుకో. నీవు చిన్నదానవా? నీచేత ఏమవుతుంది చెప్పూ?'

'చేతయినా కాకపోయినా చేతనయినదాంట్లో నే

లెక్క. ఏలాగోలా చేసుకుంటాము. వాళ్ళకు ప్రత్యేకంగా ఏంచెయ్యాలి. చెయ్యాలిసి వచ్చినప్పుడు చేసుకోకపోతేమటు కెలాగు?'

'నిజమేననుకో. ఇప్పుడు ఇక్కడ ఉంటేమాత్రమేమీ అంటి?'

'ఎక్కడున్నా ఒకటే. వారికీ పిల్లలు దగ్గరుండాలెనని ఉంటుందా? వాళ్ళుమాత్రం ఇప్పటినుండీ తండ్రికి ఎందుకు దూరంగాఉండాలె?'

'ఎందుకా? వాళ్ళ ఖర్మమమ్మా. పెట్టిపుట్టవద్దూ! లేకపోతే ఈ పసితనంలోనే తల్లి కరువుగావటమేమి?'

'నిజమే. మీరు కంటతడిబెట్టిమాత్రం ఏంలాభం చెప్పండి అమ్మగారూ! నేను మీకు చెప్పవలసినదాన్నిగాను. తల్లీలేక, తండ్రికీ దూరంగావడం ఇంకాకష్టము అవునంటారా? కాదంటారా?'

'అవుననుకో. తప్పనిసరి అయినపుడు ఏంజేస్తాం చెప్పు.'

'అంత తప్పనిసరేమి?'

'చిన్నతనం గనుక తెలియదుగాని పిల్లలను పోషించడం ఎంతకష్టం? కడుపునపుట్టిన వాళ్ళను పోషించడానికే ఎంతో ఓర్పుకావాలె. ఇహ...నిన్నేమి నే ననలేనుసుమా! కాని ప్రేమ అనేది ఉండడం చాలా తక్కువ ప్రపంచకంలో. అందుకంటున్నాను.'

'మీ అల్లుడుగారితో చెప్పినమాటలు మీతోనూ చెప్పుతున్నాను. నా లోపంలేకుండా చేస్తాను. పిల్లలూ తండ్రీ ఒక్కచోటఉండడమే నేను కోరేది. అలా జరగడానికిమాత్రం మీరేమి అభ్యంతరం చెప్పవద్దు అమ్మగారు!'

'మంచిమక్కే చెప్పుతున్నావు తల్లీ. నీ సంగతి ఈ నాలుగురోజులలోనే తెలిసింది. నీ దగ్గరకు పంపించడానికి నాకేమీ అభ్యంతరంలేదు. కాని పిల్లలను వదలి నేను ఉండలేను. అదీగాక ఈ రెండుమూడేండ్లనుండీ నా మాలిమి అయినారేమో వాళ్ళూ నన్ను వదిలి ఉండరు.'

'అల్లాఅయితే మీరుగూడారండి. వాళ్ళు నా మాలిమి అయిందాకా ఉందురుగాని.'

'ఇక్కడ ఏలాజరుగుతుందమ్మా? ఈ పిల్లలు నా మాలిమే.'

'కొన్నాళ్ళుండి రావచ్చు. ఈ పిల్లలకోసం, ఆ పిల్లలకోసం అక్కడా ఇక్కడాకూడ ఉండకతప్పదు మీకు వీళ్ళు పెద్దవాళ్ళయిందాకా ఏలాగోను.'

'మీరు భార్యాభర్తలు పట్టిపట్టుపట్టారుగాని నాకేమి ఇష్టంగాలేదు.'

'మీరు మారుమాటచెప్పకండీ అమ్మగారూ. ఇహ మనం వెళ్ళకతప్పదు.'

'ఈరోజే బాగుంది బయలుదేరుదాం మరి.'

'ఇవ్వాళనే నా ప్రయాణం? ఇద్దరూకలిపి మంచి ఎత్తుగడ ఎత్తుకువచ్చారే. ఎల్లుండి మంచిదేగా. ఆ రోజున చూద్దాము పెద్దవాడితో గూడా చెప్పి. సరేనా?'

'అలాగే కానీయండి.

## 3

'రెండోపెళ్ళి పెళ్ళాముఅంటేనే అంత స్వతంత్రం వస్తుందా ఏమిటే వెంకాయమ్మా?'

'ఎవరి సంగతీ?'

'రామనాధంగారింట్లో సంగతేనే. ఆ అమ్మాయి కాపరానికివచ్చి ఇంకా సంవత్సరం పూర్తిగాకాలేదు. ఆయన ఆ అమ్మాయిమాట అడుగుదాటడుట.'

'ఏం జరిగిందేమిటి?'

'ఏమీలేదు. పిల్లలను తీసుకువచ్చిందాకా ఒకటే నేపుకుతిన్నదటే. ఆయన వద్దంటూనే ఉన్నాడుట. వచ్చినప్పటినుంచీ వాళ్ళను ఒకటేవేధించుకు తినడముటే.'

'ఎవరు చెప్పారే కావమ్మా ఈ అబద్ధాలన్నీ నీకూ? లేక నీవు స్వయంగాచూశావా?'

'సూరయ్యగారి సోమిదేవి చెప్పిందే. అదేమో చూసిందిట.'

'దానిమాటా! బలేపని. దానిమాట ఎప్పుడూ నమ్మబోకు. కొంపలుముంచే కొరివిఅది. నేను కళ్ళారా చూశానే ఈ సంగతులు ఎవరుచెప్పారా అనుకుం

టున్నాను అదా? దానిమాటలు నూటికి నూరూ అబద్ధాలే.'

'అట్లాగు లేటి?'

'నిక్షేపంగా చిన్నపిల్లయినా అంతఓర్పుతో పిల్లలకు సర్వచాకిరీచేస్తున్నదే. ఎవరుచేస్తున్నారు చెప్పమ్మా.'

'నిజంగా?'

'అవునే. పిల్లలను ఏమరదు చూడూ. మనం ఎన్ని కబుర్లు చెప్తూవున్నా పిల్లలు ఇంటికివచ్చేవేళకు ఇక్కడ ఉంటుందేమో చూశావా? ముసలమ్మకు వాళ్ళపని ఒప్పజెప్పడ మెందుకని తానే పరుగెత్తివెళ్ళుతుంది. రోజూ తలగువ్వి నీళ్ళుపోయడం, అన్నంపెట్టడం, అవీ ఇవీ చేసిపెట్టడం, పడుకోబోయేముందు దీపంముందర కూచోని కాసేపు చదువుజెప్పడం, ఎవరు చేస్తున్నారే ఈ పనులు ఈ రోజులలో? ఒకొక్కరు సవతిపిల్లల కంచాలలో అన్నమే పెట్టరు?'

'నిజమేనే! నేనూ ఈలాగే అంటే సోమిదేవితో, ఆవిడ ఆలా పరుగెత్తుకువెళ్ళడం తానులేకుండా చూచి ఆ ముత్తవతల్లి వాళ్ళకేమైనా పెట్టుతుందేమోనని అన్నదే.'

'ఓసి దానిమొహంమండ దానిమాట చెప్పకే. నిన్న గాదులే నేను వెళ్ళివచ్చింది వాళ్ళయింటికి! పిల్లవాడు పదేళ్ళవాడయినాడు గనుక ఆ అమ్మాయికి బాగా మాలిమి కాలేదుగాని, పిల్ల సవితితల్లిని వదిలిఉండదే. పిన్నిపిన్ని అని ఆ అమ్మాయినే చుట్టుకునిఉంటుంది.'

'ఆలాగా?'

'ఆ పిల్లల ముత్తవతల్లితో కొంచెంసేపు మాట్లాడాను. ఆవిడా ఆమాట ఈమాట చెప్పి 'ఏమోనమ్మా! పెళ్ళాంపోయి అఘోరిస్తున్నా మా అల్లుడికి బంగారం దొరికిందమ్మా! ఒకపని ఒకరిచేత చెప్పించుకోదు గదా! అదేమిపిల్లో నేనుచూడలేదు. చదువుకున్న వాళ్ళకు నీలుగుంటుంది. పెద్దవాళ్ళంటే గౌరవంఉండదంటారు. ఆలాంటిగుణం మందుకైనాలేదుగదా! అందరికీ తలలో నాలికలాగుంటుంది. తల్లిపోయినా మా పిల్లలూ అదృష్టవంతులే అనుకుంటున్నాను ఒకవిధాన. రాజ్యం నాదగ్గర పడుకోవడమే మానేసిందమ్మా అదేమి చోద్యమో! పినతల్లిని ఒదిలిరాదు' అని చెప్పింది. ఏదైనాఉంటే ఆవిడ మాటమాత్రమైనా రానీయకుండా ఉంటుందా? ఒకటుందే కావమ్మా. మగవాడైనవాడు ఎప్పుడూ చెప్పిచేయించలేడనుకో దాని మనస్సులో లేకపోతే.'

'మరి దానిదుంపతెగ అది ఆలాచెప్పిందేమే వెంకాయక్కా?'

'అదిలేటి? దానిచెల్లెలొకతె సవతిపిల్లలను ఇంటికి రానీయకుండా నానాబాధలు పెట్టుతున్నదా? మిగిలిన సవతితల్లులందరూ దానికంటె చెడువాళ్ళని లోకం అనుకోవాలెనని దాని తాపత్రయమే. దాని తాపత్రయం అదీ ఏట్లో బడ.'

'నీవు చెప్పినవన్నీ నేనూ దానితో అన్నానే అంటే అది అంత నటన లోపల అంతా కుళ్ళేనన్నదే? దానికెక్కడ ఉన్నయ్యో పళ్ళు?'

'ఎంతంత వాళ్ళయినా ఉంటారు. చెప్పగానే వాళ్ళమాటలు నమ్మగూడదు సుమా! వెళ్లివస్తానే కావమ్మా గొడ్లు వచ్చేవేళయింది.'

## ౪

'డాక్టరుగారు వచ్చారా?'

ఇప్పుడే వచ్చివెళ్ళారు. జ్వరంఏమీ తగ్గలేదు. ఐనా ఏమీ భయపడ నక్కరలేదని చెప్పారు.'

'ఏం భయపడకపోవడమో? ఇంతవరకూ ఏమీతగ్గే పద్ధతికనపడలేదన్న మాట.'

'మీరు ఇప్పుడే వస్తారు. ఉండమన్నాను. మళ్ళీ వస్తానని సోమయాజులుగారింటికి వెళ్ళారు.'

'తిరిగీ వచ్చేటప్పుడు ఈలాగే వస్తారుగా అబ్బాయిని చూస్తానన్నా ఉండమను.'

'దొడ్లో ఉన్నట్టున్నాడు. అబ్బాయి! సత్యం!! వాకిట్లో కూర్చుని డాక్టరుగారు వెళ్లుతూంటే చెప్పు నాయనా.'

'మూసిన కన్ను తెరవకుండా పడిఉంది. నోరు కాసేపు ఊరుకుండేదా?'

'ఈనాలుగేళ్ళలోనూ ఒక్కసారి అయినా కళ్లు మూసి ఎరగదు. ఒక్కసారిగా ప్రళయంవచ్చినట్లు వచ్చింది ఏం కర్మమో?'

‘పిన్నీ !’

‘ఎందుకు తల్లీ’

‘మంచినీళ్లు కావాలె’

‘మంచినీళ్ళా ! పొయిమీదపెట్టాను. కాగినయి. చల్లార్చి ఇప్పుడే ఇస్తానమ్మా.’

‘ఇప్పుడు కావాలె’

‘ఎలాచెప్పు తల్లీ ! మా తల్లిగామా. పచ్చిద్రాక్షపండు ఒకటిపెట్టనా కమ్మగాఉంటుంది?’

‘నాకొద్దు. మంచినీళ్ళివ్వు.’

‘తల్లీ ! నాన్నగారు చూశావూ నీకోసం పళ్ళుతెచ్చారు నిన్న’

‘ఏడీ నాన్న’

‘ఎందుకుతల్లీ. ఇదుగో ఈ పండు తిను కమ్మగా ఉంది.’

‘నాన్నోయి. నాకు జ్వరం వచ్చింది నాన్నా.’

‘మా అమ్మే. జ్వరంవచ్చిందా? పోతుందిలే తల్లీ. డాక్టరుగారే మందిస్తారు. ఇహరాదమ్మా జ్వరం.’

‘జ్వరం నయమయింతర్వాత నేనుబళ్ళోకి వెళ్లొద్దు నాన్నా?’

‘ఆలాగేలే అమ్మా’

‘మొన్నటినుంచీ బళ్ళోకిపోనీయలేదు నాన్నా పిన్ని.’

‘జ్వరంతో ఏలా వెళ్ళుతావమ్మా’

‘పాఠాలు పోవు నాన్నా?’

‘పిన్ని చెబుతుందిలే తల్లీ.’

‘నాన్నా. అదుగో డాక్టరుగారు వస్తున్నారు’

‘ఈలా పిలు......రండి ! దయచేయండి. నేను లేను ఈ నాలుగురోజులనుంచీని. రాత్రేవచ్చాను. నేను బయటికివెళ్ళి వచ్చేసరికి మీరు వచ్చివెళ్ళారుట ఏలాఉంది పిల్లసంగతి!’

‘కొంచెం జ్వరం తీవ్రంగానే ఉందిగాని, మరేం ఫరవాలేదులెండి.’

‘మరేం చెడురకంగాదు గదా.’

‘పదిరోజులు పట్టవచ్చుగాని భయం అవసరం లేదు.’

‘ఏమో అన్నిటికి మీరేఉన్నారు. నేను వచ్చి వపనటినుండీ మనస్సు మనస్సులో లేదు.’

‘నా శాయశక్తులా పనిచేస్తాను. ఏం ఫరవాలేదు లెండి.’

‘అన్నిటికీ మిమ్మల్నే నమ్ముకున్నాము. మీశక్తికి లోపంలేకుండా చేస్తే తమసహాయం మరిచిపోము.’

‘మీరు చెప్పనక్కరలేదు. నాకు తెలియదూ.’

‘మరి సెలవుపుచ్చుకోనా ?’

‘చిత్తం.

*　*　*

‘నాలుగురోజులు పట్టేట్లుంది. కాస్త జాగ్రతగా ఉండాలెసుమా.’

‘జాగ్రత్తగానే ఉంటాము. భగవంతుడి దయ ఉండాలె.’

‘అదికాదు నేను చెప్పేది. రాత్రి నీవు మేలుకొన్న ధోరణిచూస్తే నాలుగురోజులు ఆలాఉంటే నీకూ జబ్బుచేస్తుంది.’

‘ఇంతమాత్రానికేనా? ఏం ఫరవాలేదులెండి. మరేలాగ? ఏవేళ పిల్ల మేలుకుంటుందో జాగ్రత్తగా ఉండవద్దూ.’

‘మరి ఈపనీ, ఇంట్లోపనీ, ఈ నిద్రలేకపోవడమూ నీకుమాత్రం మంచిదంటావా? మా అత్తగార్నయినా రమ్మనివ్రాస్తాను.’

‘వ్రాయండి. పెద్దతోడు ఇంట్లో ఉంటుంది ఇలాంటి దెప్పుడైనా చూశానా చెట్టానా నేను ?. మనిషిని పంపితే ?

‘మనిషిని పంపితే గాభరాపడతారేమో ?

‘సరే కార్డువ్రాయండి. రేపుమాపటికి వస్తారు.

*　*　*

‘ఎన్నాళ్ళమ్మా నేనింకా బళ్లోకి వెళ్ళకుండానూ? పాఠాలు పోవడంలేదా ఏమిటి?’

‘ఏలాగమ్మా మరీ? నాలుగురోజులనించేగా కాస్త మెతుకు తింటున్నదీ. ఇంక నాలుగురోజులుండి వెళ్ళుదువుగాని.’

‘పాఠాలెట్లాగే పిన్నీ. వాళ్ళుసుశీల నాకన్న మించిపోదూ ?’

‘పాఠాలన్నీ చెబుతాగా నీకునేను ? సుశీని నీవు మించిపోయేట్లు చెప్తాను.’

'ఇన్నాళ్ళనుంచీ బళ్ళోకి పోకుండా సుశీని మించి పోతే ఎంచక్కా ఉంటుంది గాదూ పిన్నీ?'

'అవునమ్మా అవును'

'ఏమిటి తల్లీకూతురూ కబుర్లు చెప్పుకుంటున్నారు?'

'రాజ్యం బళ్ళోకి వెళ్తానంటున్నది.'

'వెళ్ళదువుగానిలే అమ్మా! బతికి బయటపడ్డావు డాక్టరుగారి ధర్మమా అని.'

'ఆ! అమాత్రం డాక్టరు పల్లెటూళ్ళో మన అదృష్టంకొద్దీ దొరికాడు. తాలూకాబోర్డులుండగా జరిగిన మంచిపని ఇదొక్కటే అనుకుంటాను. ప్రతి పల్లెటూరికీ అమాత్రం డాక్టరు అవసరం సుమండీ.'

'అభ్యంతరమేమిటి? నేటికి మనపాలిటి దేవుడే ఆయన.'

'నాన్నా! అమ్మమ్మ మడిగట్టుకోమంటున్నది. ఆలస్యంలేదుట.'

'వస్తున్నా.'

౫

'మిమ్మల్నే'

'వినపడుతూనే ఉంది.'

'ఏంలాభం? నే వాగేదాన్ని, వాగుతూనే ఉన్నాను 'ఈలాగే అరిచిఅరిచి మాగేదెదూడ ఒకటి...' అనే సామెతలా ఉంది సంగతి.'

'అయితే ఏం చెయ్యమన్నావు? తిరుగుతూనే ఉన్నానా. ఏ సంబంధమూ అనుకూలమయింది కనబడక పోయే.'

'త్వరపడాలె ఏలామరి. నెలకో యెంతకో పదమూడుగూడా వెళ్ళుతుంది తెలుసునా. తర్వాత చాలా ఇబ్బందిపడాలిసొస్తుంది.'

'తిన్న ఊళ్ళో పడుకోకుండా, పడుకున్న ఊళ్ళో తినకుండా తిరుగుతూనే ఉన్నానా?'

'బెజవాడ మానాప్రగడవారి సంబంధం అన్నివిధాల బాగుంది.'

'నిజమే. కట్నందగ్గరే మనతాహతుకు అందడంలేదు.'

'అన్నివిధాల బాగున్నప్పుడు కాస్త ఇటో అటో వారు అడిగినకాడి ఇవ్వగూడదూ? మనకుమాత్రం ఏ పదిమంది ఉన్నారు.'

'నిజమేననుకో. మూడువేలు కట్నమూ, లాంఛనాలు ఒక అయిదువందలూ, పెళ్ళిఖర్చు పదిహేను వందలూ అల్లాటప్పా అనుకుంటున్నావేమో.'

'కానీయండి. ఏంతప్పేట్టు.'

'నిజమే కాని మనలో సంబంధాలన్నీ ధరలలోకి దిగింది.'

'అని సత్యానికి కట్నంలేకుండా సంబంధంచేసుకోండి చూద్దాము.'

'నా ఒక్కడివల్లనే అందరూ మానేశే పద్ధతి ఏమన్నా ఉందా?'

'అందరూ ఆలాగేఅంటే? ఏదోవిధంగా ఒకరు చేసిచూపించేవారు ఉండాలె. ప్రచారమూ జరగాలె.'

'సరి. ఎత్తుకోవడమే నాయకులలాగా ఎత్తుకుంటావు ఉపన్యాసము. జరిగేదా పెట్టేదా?'

'నా ఉపన్యాసం మీ ముందరేగా. మానాప్రగడ వారి సంబంధం నిశ్చయించుకురండి.'

౬

'వియ్యాలవారికి ఉత్తరంవ్రాసి వారంరోజులయింది. సమాధానమే రాలేదే?'

'ఏమో ఎందువల్లనో? రజస్వలఅయి సంవత్సరం అయిందిగదా అని మనం తొందరపడుతూంటే వాళ్ళకు చీమకుట్టినట్లయినాలేదు. ఇంకా ఎన్నాళ్ళు ఆపడం?'

'అదే నేనూచూస్తున్నాను. వెళ్ళి స్వయంగా మాట్లాడివస్తాను. సత్యానికికూడా ఏదో సంబంధం నిశ్చయించుకుని అబ్బాయి పెళ్ళికానిచ్చి, తర్వాతనే అమ్మాయిని అత్తవారింటికి పంపితే బాగుంటుంది.'

'ఆలాగే. సంబంధం నిశ్చయించండి.'

'నీ అభిప్రాయం చెప్పు.'

'నా అభిప్రాయమా. నా మటుకు గుంటూరు సంబధం బాగుందండీ. పిల్ల బాగా చదువుకున్నదీ, అందమైందీనీ.'

'నిజమే సాంప్రదాయమైంది గూడానూ. ఆయన హైస్కూలులో నూటఎనభయ్యో ఎంతో తెచ్చుకుంటున్నాడు. కాని కట్నంలోనే కాస్త నాలీసుగాఉంది. వెయ్యిన్నూటపదహార్లకు మించడం నాచేతగాదంటున్నాడు.'

'పోనిద్దురూ! వారిస్తే మనకు వస్తుందట.మనకున్నది చాలదా? మనవాడు ప్లీడరీచేసి సంపాదించగూడదా?'

'ఏమోలే. అప్పటిమాటగదా. భగవంతుడిదయ బాగుంటే మనకున్నది చాలదూ?'

'కనుకనే ఆ సంబంధం కుదుర్చుదురూ మరో ఆలోచనలేసుండా.'

'అబ్బాయి అభిప్రాయము కనుక్కున్నావా'

'కనుక్కున్నాలెండీ. అబ్బాయి గుంటూరులో పిల్లను చూడనుగూడాచూశాడుట. మా ఇద్దరికీ,ట్లూ అటే'

'సరే నాదిమాత్రము! ఏకగ్రీవంగానే తీర్మానిద్దాము'

'ఈ సంబంధం నిశ్చయించుకుందాం.

౨

'బరువుమీద బరువు ఉండకూడదంటారు. రాజ్యాన్ని ఇప్పట్లో తీసుకురావడానికి కూడా వీలుకనపడలేదు. విన్నారా?'

'ఆ విన్నా మరేంచెయ్యడం. నీవుకుడు వచ్చిం తర్వాతనే తీసుకురావాలి.

'అప్పటికి అమ్మాయికి ఎనిమిదోనెల వస్తుందో ఏమో? చూడండి. ఏలావచ్చిందో? చిన్నతనం, గర్భిణి అయినందుకు అయిదోమాసంలో తీసుకురావడం ఎంత బాగుంటుందీ. తొమ్మిదోమాసంవరకు వీలుపడకపోవడం చూడండి.'

'అయిదోమాసంలోనో, ఏడోమాసంలోనో నిద్రయినా చేయించమని రాద్దాము. అక్కడ అయినా అమ్మాయికి బాగానే జరుగుతుందనుకో.'

'అయితేమాత్రం. మనింట్లో ఉండడం సహజం ఆనేకముంటయి. ఎంత చనువున్నా అడగడానికి వీలుండదు.'

'ఎటూ వీలుకాకుండా వచ్చింది. ఏమిచేస్తాం?'

'నన్ను తీసుకువెళ్ళేవాళ్ళున్నా ఉంటే అమ్మాయిని ఇక్కడికి తీసుకురావచ్చు. అదీలేకపాయె.

'దానికేంచేస్తాము? అప్పుడుమాత్రం అమ్మాయికిక్కడేం సౌఖ్యముంటుందీ నీవు లేకపోతే?

'నాకుమాత్రం ఆలాంటప్పుడు అమ్మాయిని వదిలి ఉంటే తోస్తుందా? ఏమయినా ఆ పరిస్థితులు లేవుగా. అనుకొని ఏంప్రయోజనం.'

౩

'ఇదుగో మనమడు. తీసుకోండి చేతులోకి.'

'నాచేతగాదులే నీచేతులోనే ఉండనీ. రాజ్యం! ఇదేమిటమ్మా మీవాడికి మూతి ఈమూలనుంచి ఆమూలకున్నదీ.'

'పోనీలే. మీ అమ్మాయి ఉందిగా పెసరపలుకంత కళ్ళూ అదీని'

'అవునమ్మా నీపోలికే వచ్చింది ఏంచేస్తాం. చిన్నప్పుడు అంతా నీవు అట్లాగే ఉండేదానవు.'

'పిచ్చితల్లీ! నీకు చెల్లాయికదూ నీవాలాఅనోచ్చా?'

'మరి నాన్న ఆలాఅనడం దేనికీ?'

'నిన్ను ఉడికించడానికన్నారు. నాచిట్టితండ్రికంటె బాగుండేవాళ్ళున్నారా ఏమిటీ?

'పాపాయిగొలుసు వీడికివేస్తే బాగానేఉండేపిన్నీ!'

'వాడిమెడలోనే ఉండనీ. మనమడికి మీరు చేతికి ఒకగొలుసు కాలికిఒకజత చేయించారా నేను మనమడికి ఈగొలుసు ఇద్దామనుకున్నాను.'

'అవును. నీతాతసొమ్ముగాదూ.'

'వాడి తాతసొమ్మే అనుకోండి. నాచేతిమీదుగా వచ్చింది.'

'అయితే చేయించినవి చాలకనా అదిగూడా వాడికిస్తానంటావు? ఇస్తూఉంటే ఎంతైనా పుచ్చుకుంటూనే ఉంటారు.'

'ఏమిచ్చావమ్మా ఇచ్చాను ఇచ్చానంటావుపాపం'

'లెక్కచెప్పనా? కట్నం......'

'కట్నాలు, కానుకలు ఇస్తేనాకే ఒరిగిందేమిటీ?'

'నీకుమాత్రం ఏమీపెట్టలేదుటమ్మా?'

'అయితే పిల్లాడికేం ఒరుగుతుందే పిన్నీ?'

'వాడికీ చేయించానుగా'

'ఇదిగూడా ఉంటే బాగుంటుంది లేతురూ. కాస్తలో ఏం ఆలోచిస్తారు.'

'మరి పాపాయికి ఇప్పుడు చేయించవద్దూ?'

'వీలుంటే చేయింతురుగాని. వీలులేకపోతే వీలుచూచే చేయించుకుందాము.'

'తల్లీ కూతురూ కలిసి మంచిపన్నాగమేపన్నారు.'

'నాదేంలేదు నాయనా.'

'పోనీలే మీపిన్నిదే నాయను పన్నాగమంతా.'

* * *

'మాడండి! కట్టుకోను చీరెలు అయిపోయినవి. ఈ తడవ తెనాలివెళ్ళినప్పుడు పట్టుకురావాలె.'

'అదేమిటీ? అమ్మాయితోబాటు నీకూ తెచ్చాను గామూ మొన్న. అమ్మాయివెళ్ళి నెలవెళ్ళిందా?'

'నెలా పదిహేనురోజులయింది.'

'ఇంతలోనే మళ్ళీ చీరెలుకావలసి వచ్చినయ్యా.'

'ఆచీరెలు అమ్మాయి బాగున్నయి అనుకుంటే దాని పాతచీరెలు తీసుకుని అవి ఇచ్చాను.'

'దానికి జోడుచీరెలు ఇవ్వనేఇచ్చాముగా?'

'ఇచ్చాములెండి. అవి ఖరీదుగలవీ బాగున్నవి వాటి మధ్య కొంత ఉండాలె లెండి.

'అడిగిందా?'

'అడగలేదనుకోండి. ఖరీదుగలవి దాపుడుకు బాగుంటయి, రోజూ కట్టుకోవడానికి ఈ మాత్రపువి చాలునే పిన్నీ అన్నది. అయినా మనదగ్గర అడగకపోతే ఎక్కడ అడుగుతుంది చెప్పండీ.'

## ౬
(ఆరేళ్ళయిన తర్వాత)

* * *

'ఈ గండం గడవడం కొంచెం కష్టమేసుమా! అమ్మాయిని తీసుకొని అల్లుణ్ణి రమ్మనమని సత్యాన్ని ఉత్తరం రాయమన్నాను.'

'మీరు అలా భయపడకండీ. రేపీపాటికి నయంగా మీరు అసలు భయస్థులు కారు.'

'భయంగాదులే. నాకు మారకంరోజులు సమీపిస్తున్నయి. నా జాతకం అక్షరాలా జరిగింది.'

'ఇవో గిలిగూడా మనస్సులో పెట్టుకోకండి. డాక్టరుగారు ఏమీ భయంలేదన్నారు విన్నారుగదూ?'

'ఏలా అయితే అలా అవుతుంది. అమ్మాయిని రమ్మంటే మించిపోయిందేముందీ?'

'ఏమీలేదు. వస్తే ఒక నెలరోజులుండి వెళ్ళుతుంది రమ్మనండి. అమ్మాయిఉంటే కాస్త ధైర్యంగానన్నా ఉంటుంది మీకు నాకూను.'

'నాకు వేరే ఆలోచన ఏమీలేదుగాని అబ్బాయికి సంతానమే కనపడలేదు.'

'ఏమిటండీ మరీని? ఆడవాళ్ళకంటె కనాకష్టమయినారు. భగవంతుడి దయవల్ల మీకు త్వరగా నయమూ అవుతుంది. మనమలనూ, మనమరాళ్ళను ఎత్తుకునీ తిరుగుతారు.'

'సరేలే కానీ.'

* * *

'ఈలారా'

'ఆc. ఎందుకూ?'

'అమ్మాయి, కోడలూ ఎక్కడఉన్నారు?'

'వాళ్లో ఏదో పనిచేసుకుంటున్నారు. ఎందుకూ?'

'ఈలా కూర్చో. విషయం చూస్తున్నావుగదా! ఈ తడవ నాకు నయంగావడం దుర్లభం.'

'మళ్ళీ మొదలు ఏలాచెప్పండి! ఆభయం మనస్సులో ఉంచుకోగూడదని మీకుమాత్రం తెలియదూ? నేనువస్తేసరి ఈలా మొదలుపెడతారు. అమ్మాయిని పంపుతాను.'

'కాదులే కూర్చో! నా ఆలోచన ఏమిటంటే— కొసాకీ విను—ఎటుబోయి ఎటువచ్చినా మంచిది నీ పేర నాలుగు ఎకరాలున్నూ, పాపాయిపెళ్ళి కట్నం క్రింద రెండు ఎకరాలున్నూ ఖర్చుకు రెండువేలున్నూ వ్రాద్దామనీ. నీతో చెబుదామంటే ఎప్పటికప్పుడు ప్రసంగం రానీయడంలేదు.'

'ఆమాట జన్మకు మీరు అనుకోవద్దు. అలాంటిపని నా ఘటంఉండగా జరగకూడదు. నాకేమీ ప్రత్యేకంగా అవసరంలేదు. పాపాయిమాటా? పాపాయిని ఒకవిధంగానూ, రాజ్యాన్ని ఒకవిధంగానూ నేను చూడలేదు. సత్యంగూడా చూడడు. నా కంతవరకు రూఢే'

'నిజమేననుకో. వాడెంత మంచివాడైనా......'

'కోడలుమాటా? అదీ ఒకరంటిదిగాదు. అయినా ఆ విషయమే తలపెట్టకండి. వాళ్ళను నాకన్నవాళ్ళగానే పెంచుకున్నాను. కన్నతల్లికి కొడుక్కూ వేరు పెట్టాలెనని ఆలోచిస్తారా ఎక్కడైనా? అలాగే ఇదీని.

'రోజులు ఎల్లకాలం ఒకవిధంగా ఉంటాయా?'

'అలాగే అనుకుందాం. నాకు కన్నకొడుకే ఉండి వాడే సరిగాచూడకపోతే ఏంచేస్తాం? సత్యం విషయంలో ఆఆలోచనే అవసరంలేదు.'

'ఎప్పుడూ నీమాటే నెగ్గించుకుంటున్నావు.'

'మీదయవల్లనూ, భగవంతుడి దయవల్లనూ.

'తరువాత నాజీవానికి పడి ఏడుస్తావేమోనని'

'మీరు ఆభయమే మనస్సులో ఉంచుకోవద్దు. ఈ ఆలోచనలు మాని ధైర్యంతెచ్చుకోండి.

## ౧౦

(మరి నాలుగేళ్ళయిం తర్వాత)

* * *

'పిన్నీ! ఈమందు పుచ్చుకో'

'నాయనా! ఇంకా మందులెందుకు తండ్రీ?'

'కాదు. నేజెప్పినమాట విను. నీకేం భరవాలేదు. రేపీ పాటికి నయమవుతుంది. మొండిజ్వరమన్నమాట గాని నీకేం భరవాలేదని డాక్టరుగారు కూడా అన్నారు విన్నావుగా?'

'అలాగే పుచ్చుకుంటాగాని రాజ్యాన్ని, పాపాయిని, సత్యవతిని పిలుఒకసారి.

'ఎందుకూ?'

'పిలు తండ్రీ.'

'చెల్లీ పాపాయి నువ్వూ మీవదినె ఈలారండి పిన్ని పిలుస్తోంది.'

'అందరూ వచ్చారా?

'రాజ్యం! నాయనాసత్యం.!! సత్యవతి !!! నాకు చచ్చిపోతానని దిగులులేదుగాని అదుగో పాపాయి ఉంటుంది. తల్లి తండ్రి లేని పిల్ల అవుతుందిగదా. కడుపులో పెట్టుకోండి. నా కోరిక అంతే.'

'పిన్నీ. దానివిషయమై నీవు దిగులుపెట్టుకోబోకు. నేనూ, చెల్లాయీ నిన్ను 'అమ్మ' అని పిలవలేదనే లోపం ఒక్కటిదప్ప మాకు మరోలోపం కలిగించలేదు నువ్వు. పాపాయికూడా మాతోపాటుదే. దాని సంగతి ముందూ రాజ్యంసంగతి తరువాతా.'

'పెళ్ళిఅయినా కాలేదుగదా! అయినా దాని విషయమైనముచ్చట్లు తీరలేదనికూడా అనుకోనే అనుకోను. మీ నాన్నగారి మంచితనానా, నా అదృష్టం వల్లా మీ వల్లనే అన్నిముచ్చట్లూ తీర్చుకున్నాను. కాని దానిమనస్సులో క్షోభతప్పదుగదా! మీరే ఉన్నారు అన్నింటికీని.'

'పిన్నీ! పాపాయికి అమ్మను, నాన్నను తీసుకురాలేముగాని ఇంకేలోపమూ జరగదనుకో. అన్నయ్య సంగతి తెలుసుగదా. వదినెకూడా అలాంటిదే.'

'నాకు తెలుసుతల్లీ. అయినా మనసు ఉండబట్టక చెప్తున్నాను. సందేహం ఉండి కాదు సుమా! పాపాయి ఏడుస్తున్నది మన మాటలువిని. సముదాయించండి. అన్నింటికీ మీరేదానికి. పాపాయీ! ఈలారా తల్లీ. అన్నయ్య వదినె చెప్పినమాటలు వింటూఉండు తల్లీ. అక్కయ్యకూడా నిన్ను కనిపెట్టిఉంటుంది.'

'ఏమిటే పిన్నీ మరీని. పసిదాన్ని, దాన్ని మరీ ఏడిపిస్తావా? దిగులుపడదూ?'

'లేదులే తల్లీ. ఆడుకోపోయి. నాకు నయమవుతుందిలే పో. ఏడవకు పో.'

— మొదలి వెంకటసుబ్రహ్మణ్య శర్మ.

## ప్రేమరత్నము

కనుఁగొన్న యట్లుగా కలగాంచితిని
గద్గదస్వరముతోఁ గలవరించితిని
మెఱసినచోటెల్ల మెఱపుతో వెదకి
దొఱకిన మణినెల్లఁ దొలిచిచూచితిని॥

ఇన్నింటగనరాని యీ రత్నమూర్తి
కన్నీటిలోననేఁ గానవచ్చుటకు
తాత్పర్యమేమని తలపోయుచుండ
నాప్రేమరత్నమా నవ్వుచున్నావ॥

కొదువలన్నియుఁదీర్చు గోపాలమూర్తి
నీతోడ నిత్యంబు నెనరొందునట్లు
భవదంకమే వేళఁ బాయనియట్లు
ప్రేమ జూపించుమో ప్రేమస్వరూప॥

—రాజ్యలక్ష్మి.

# దయ యెక్కడో దేవుడూ అక్కడే

ఒకవూళ్ళో చెప్పులుకుట్టేవా డొకడుండేవాడు. పేరు మార్టిన్. ఒకరియింట్లో వీధివైపున ఒక చిన్న దిగుడుగదిలో కాపురమున్నాడు. ఆగది కొక్కటే చిన్నకిటికీ. అది వీధివైపుకే తెరచివుండేది. దానిగుండ వీధిలోకిచూస్తే దారినిపోయేవాళ్ళ పాదాలుమాత్రం కనబడుతూవుండేవి. మార్గస్థులు తొడుగుకొనిపోయే చెప్పులజోళ్ళుచూచి ఆ మనుష్యులెవరో స్పష్టంగా గుర్తుపట్టగలిగేవాడు మార్టిన్. అతడు చాలదినాలనుంచి ఆగదిలోనే కాపురం. చుట్టుపట్ల అందరూ అతనికి పరిచయస్థులే ఆప్రాంతంలోవున్న ప్రతి పాదరక్షల జతలో యేదో ఒకటి రెండుసార్లైనా మరమ్మతుకు మార్టిన్ చేతికి వచ్చేవుంటుంది. వచ్చేపాయే ప్రతి జోడూ కిటికీగుండా చూస్తూ 'ఇవన్నీ ఒక్కొక్కసారైనా నాచేతికి వచ్చిపోయినవే!' అని తనలో తాననుకుంటూ సంతోషపడుతుండేవాడు. పాతమడమలు తీసి కొత్తవి వేసియిచ్చిన జోళ్లుకొన్ని, చినిగినచోట్ల అతుకులువేసి బాగుచేసినవి కొన్ని, ఊడిపోయినకుట్లు తిరిగి కుట్టియిచ్చినవి కొన్ని, పైకప్పువిప్పి కొత్తచర్మంతో మూయబడ్డవి కొన్ని—మొత్తంమీద అన్నీ ఒకటి రెండుసార్లయినా మార్టిన్ చేతిలో బడ్డవే. అతడెప్పుడూ మంచిచర్మమే వుపయోగించేవాడు. చౌకరకం తెచ్చి ప్రజలను మోసగించడం అతనిచేతగాదు. దురాశపడకుండ సరసమైన కూలి తీసుకునేవాడు. బహు మర్యాదతో మెలగుతూ అందరికీ విశ్వాసపాత్రుడైనాడు. అందుచేతనే మార్టిన్ కెప్పుడూ చేతినిండా పనివుండేది. మంచిపనివాడనిపించుకున్నాడు. ఒప్పుకున్నదినానికి పని పూర్తిచేయగలనని తోస్తేనే పని ఒప్పుకుని తీసుకునేవాడు. కాదనితోస్తే, వీలుపడదని చెప్పివేసేవాడేగాని తప్పుడువాగ్దానా లెన్నడూ చేసేవాడుగాడు. అందుచేతనే, అందరిచేతనూ మంచివాడనిపించుకున్నాడు.

కాలం గడచినకొద్దీ మార్టిన్ యొక్కవనేపు ఆత్మచింతలో గడుపుతూ భగవంతునిచేరే మార్గాన్నిగూర్చి నిరంతరం యోచిస్తుండేవాడు. ఇటీవలనే జోళ్ళవ్యాపారం స్వంతంగా ప్రారంభించాడు. అంతకుపూర్వం మరొకనివద్ద జీతానికి పనిచేస్తుండేవాడు. అప్పుడే భార్య చనిపోయింది. అప్పటికి మూడేండ్ల మగపిల్లవా డొకడున్నాడు. అంతకుముందు కలిగిన సంతానం చిన్నతనంలోనే చనిపోయినారు. కుర్రవాణ్ణి ఒక పల్లెగ్రామంలోవున్న తనచెల్లెలివద్దకు పంపివేద్దామనుకున్నాడు మార్టిన్. అయితే వున్న ఒక్కబిడ్డనూవిడిచి వుండడానికి మనసొప్పిందిగాదు. 'పరాయి కుటుంబంలో వుండి యీపసిబిడ్డ యేమిసుఖపడతాడుపాపం! ఏమైతే అయింది, నాదగ్గరనేవుంటాడు.' అనుకొని పిల్లవాణ్ణి తనవద్దనే వుంచుకునే నిశ్చయం చేసుకున్నాడు.

భార్య చనిపోయిన కొద్దికాలానికే మార్టిన్ తన పూర్వపు యజమానిని విడిచి, స్వంతవ్యాపారం మొదలుపెట్టి కాపురం యీకొత్తయింటికి మార్చాడు. కాని దురదృష్టంకూడ వెన్నంటేవచ్చింది. కుర్రవానికి యుక్తవయస్సు వచ్చింది. తాను కష్టపడి పనిచేసుకుంటూ, ముసలితండ్రిని పోషిస్తూ, అతనికి సుఖం ఆనందం యిస్తాడనుకునే సమయంలో కుమారునికి ఆకస్మికంగా జబ్బుచేసింది వారందినాలు జ్వరంతో బాధపడి, వాడుకూడా చనిపోయినాడు. రెండవదిక్కులేక, శవాన్ని తీసుకొనిపోయి మార్టినే పూడ్చిపెట్టివచ్చాడు. కొడుకు చావుతో మార్టిన్కు తీరనిమనోవ్యధ ప్రారంభమయింది. హృదయం నిరాశతో నిండిపోయి, ఆత్మవిశ్వాసం నశించి భగవంతునికూడ నిందించటం మొదలుపెట్టినాడు. దుఃఖం ఆపుకోలేక తానుకూడ త్వరలో చనిపోతే బాగుండునని కోరుకునేవాడు. తానంత గారాబంతో పెంచుకున్న బిడ్డను తీసుకొనిపోయి తనబోటి ముసలివాణ్ణింకా బ్రతికిస్తున్న భగవంతుని క్రూరత్వాన్ని గర్హిస్తూ దినాలుగడిపినాడు. కొడుకు చనిపోయినతరువాత మార్టిన్ ప్రార్థనాలయానికికూడ పోవటం

మూనుకున్నాడు.

ఒకనాడు మార్టిన్ స్వగ్రామంనుంచి ముసలివా డొకడు వచ్చాడు. ఎనిమిదేండ్లనుంచి సన్యసించి దేశాటనంచేస్తూ, ఆ రోజున మార్టిన్ బసకువచ్చి తలుపు తట్టి పిలిచాడు. పూర్వపరిచయాన్నిబట్టి మార్టిన్ సన్యాసిని ఆదరించి కూర్చోబెట్టి తనకష్టాలన్నీ అతనితో చెప్పటం ప్రారంభించాడు:

'నా కింక బ్రతకాలనిలేదయ్యా, మహాత్మా! నాకీ జీవితంలో మిగిలివున్నకోరికల్లా ఒక్కటే. నేనుకూడ త్వరలో చనిపోతే బాగుండునన్నేకోరిక తప్పితే మరే కోరికలూలేవు. ఈ ప్రపంచంలో నాకిక దేనిమీదనూ కాంక్షలేదు. సుఖం సంతోషం మొదలేలేవు.'

సన్యాసి యిట్లా జవాబిచ్చాడు: 'మార్టిన్, నీవిట్లా మాట్లాడటం యేమాత్రం తగదు. భగవంతుని విధానాన్ని, మనుష్యమాత్రులం, మనం విమర్శించడం న్యాయమా? సృష్టినియమాలను అమలు జరిపేది భగవంతుని పవిత్రేచ్ఛగాని మనంచేసే తర్కవాదాలుగావు సుమా! ఆయన యిష్టాయిష్టాలను మనం అడ్డునిలవగలమా? నీవు బ్రతికి, నీ కుమారుడు చనిపోవడమే భగవదిచ్ఛ అయినప్పుడు అట్లాగే జరిగితీరుతుంది. ఈ విశ్వాసమే మనకు కలగవలె. నీలో ఆ విశ్వాసంలేదు కనుకనే యింత బాధపడుతున్నావు. నీ కిప్పుడు కలిగిన నిరాశ కూడా ఒకవిధమైన అహంకారమే. ఎప్పుడూ సుఖంకొరకే బ్రతకవలెనని నీవు కోరుకోవడంచేతనే నీకింత భయంకరమైన నిరాశకలిగింది.'

'సుఖంకోసం కాకపోతే మరి దేనికోసం బ్రతకాలేమయ్యా?' అని ప్రశ్నించాడు మార్టిన్.

'భగవంతునికొరకోయి, మార్టిన్! మనకీ జీవితమిచ్చినదాయన. కనుక మనం బ్రతకవలసిన దాయనకోసమేనని వేరేచెప్పాలా? ఈ బ్రతుకాయనకొరకేయని యెప్పుడు తెలుసుకుంటామో మనకప్పటినుంచి దుఃఖాలేవుండవు. అది, సుఖమంటే!'

ఇది విని మార్టిన్ కొంతసేపు నిశ్శబ్దంగాకూర్చుని తిరిగి యిట్లా ప్రశ్నించాడు సన్యాసిని—'సరే, భగవంతునికొరకు జీవించడమన్నావే—అదెట్లా?'

'ఆ మార్గం ప్రపంచానికి జీససుమహాత్ముడే చూపించాడుకదోయి! నీకు చదవటం చేతనౌనా? బైబిల్ కొని ఆయన చరిత్ర చదువుమూ! భగవంతుడు మనకందరికీ నియమించినమార్గమేదో ఆ చరిత్రద్వారా తెలుస్తుంది.' అని సన్యాసి జవాబిచ్చాడు.

ఈ మాటలు మార్టిన్ హృదయంలో గట్టిగా నాటుకున్నాయి. ఆ పూటేపోయి బైబిల్, పెద్ద అచ్చుదొకటి కొనితెచ్చి వెంటనే చదవటం ప్రారంభించాడు. పండుగదినాలలో మాత్రమే చదువుదామనుకున్నాడు మొదట. కాని క్రమంగా కలుగుతూవచ్చిన ఆత్మానందాన్నిబట్టి అనుదినం చదవటం ప్రారంభించాడు. గంటలతరబడి ఆదేపనిగా చదువుతూ కూర్చోవడంచేత రాత్రులు యెంత పొద్దుపోయిందో తెలిసేదికాదు. ఒక్కొక్కప్పుడు చదువుతూండగానే నూనె అయిపోయి దీపం ఆరిపోయేది. అప్పుడు విధిలేక చదువు ఆపవలసివచ్చేది. పుస్తకంమూసి పడుకొని నిద్రపోయేవాడు ఇట్లా విడువకుండా ప్రతిరాత్రీ చాలసేపు చదువుతూవుండేవాడు. విషయం అవగాహన అయినకొద్దీ భగవంతుని శాసనమేదో, తన జీవితాన్నిగూర్చి భగవంతుని యుద్దేశమేమో, ఆయన ఆజ్ఞయేమో స్పష్టంగా తెలియవచ్చింది. దుఃఖంతగ్గి అంతకంతకు మనస్సు తేలికపడ్డట్లయింది. ఇంతకుపూర్వం రాత్రులు పక్కమీద పడుకోనేసరికి యేదో భరించరాని బరువుతో గుండె లాగుకొనిపోయేది. చనిపోయిన పిల్లవాణ్ణి తలచుకొని యేడుస్తూ ప్రతిరాత్రీ పక్కమీదికి చేరుకునేవాడు. ఇప్పుడా బాధలన్నీ అంతరించాయి. 'ఈశ్వరా, నీకే జయమయ్యా, నీకేజయం! నీ యిష్టమెట్లాగో అట్లాగే సమస్తం జరుగుతుంది. అట్లాగే జరుగును గాక!' అని యీవిధంగా పదేపదే తనలో తాననుకుంటూవుండేవాడు.

మార్టిన్ జీవితమిట్లా కొంత మార్పు చెందింది. పూర్వం, తరుచు అంగడికిపోయి, తేనీరు, 'వాడ్కా' సారాయి తాగే అలవాటుండేది. ఒళ్ళెరగకుండా తాగి, స్నేహితులతో కలిసి యింటికిపోతూ, దారినిపోయేవాళ్ళను యెగతాళిచేయడం, మోటుమాట లనడం జరుగుతూవుండేది. ఇప్పుడాస్థితి గడిచిపోయింది. మార్టిన్

జీవితంలో ఒకరకమైనశాంతి, సంతోషం యేర్పడ్డవి. ఉదయం మొదలు సాయంకాలంవరకు జోళ్ళపని చేస్తూ, చీకటిపడగానే గోడనున్న దీపపుబుడ్డితీసి, వెలిగించి బల్లమీదపెట్టి గ్రంథపఠనం ప్రారంభించేవాడు. ఏకాగ్రదృష్టితో చదవగా చదవగా ధర్మతత్వం బాగా బోధపడి, యేపూట కాపూటే మనస్సు తేలికపడి ఆనందంతో నిండిపోయేది.

ఒకనాటిరాత్రి మార్టిన్ పుస్తకం చదువుతూ చాల పొద్దుపోయేవరకూ కూర్చున్నాడు. 'లూకా' సువార్త చదువుతున్నాడప్పుడు. ఆరవ అధ్యాయంలో యీ విధంగా వ్రాయబడ్డది: 'నిన్నొకచెంపమీదకొట్టిన వానికి నీ రెండవచెంపకూడ అందియ్యి. నీ చొక్కా తీసుకొనిపోయినవానికి నీ కోటుకూడ యిచ్చిపంపడమే ఉత్తమధర్మం. నిన్నుచేరి అడిగినవానికి అడిగిన వస్తువిచ్చి పంపడమే నీవిధి. నీ సొత్తు తీసుకొనిపోయిన వాని వద్దనుంచి తిరిగి దానిని నీ వడిగి పుచ్చుకోకూడదు. దానికొరకు నీ వాశించనూకూడదు. ఇతరులు నిన్నెట్లా మన్నించాలని కోరుకుంటావో వాళ్ళనుకూడ నీ వదేవిధంగా గౌరవించాలని తెలుసుకో!'

అందులోనే మరొకచోట జీససుమహాత్ముడు ఈ విధంగా చెప్పినాడు: 'ఊరికే 'ప్రభూ, ప్రభూ!' అని నన్నెందుకంటారు మీరు? నేను చేయమన్నపనులలో ఒక్కటీ నెరవేర్చకుండా, నన్ను 'ప్రభూ!' అన్నంత మాత్రాన యేమిలాభం? ఎవరైతే నా వుపదేశంవిని దానిని ఆచరణలోపెడతాడో అతడే ధీరుడు. గట్టిదైన కొండప్రదేశంలో పునాదివేసి యిల్లుకట్టిన బుద్ధిమంతునితో పోల్చవచ్చు ఆ ధీరుణ్ణి. ఎంతెంత వరదలు వచ్చి కొడితేమాత్రం ఆ యింటికి చలనమెక్కడ? కాని యెవరు నా ధర్మాన్ని చెవులతోమాత్రంవిని ఆచరణ శూన్యుడౌతాడో అతడు, పునాదిలేకుండ యిసుకదిబ్బ మీద యిల్లుకట్టిన వానితో సమానుడు. ఒక్క కెరటం వచ్చి తాకడంతోనే కూలి నేలమట్టమౌతుం దాగృహం. దానితో సర్వంనాశనం.

ఈ వాక్యాలు చదివేటప్పటికి మార్టిన్ హృదయంలో అమితసంతోషం కలిగింది. సులోచనాలుతీసి పుస్తకంమీద వుంచాడు. మోచేతులు బల్లమీద ఆనుకొని చదివిన వాక్యాలనుగూర్చి యోచిస్తు కూర్చున్నాడు. ఆ మహోపదేశాన్ని యెదుటపెట్టుకొని, దానిని బట్టి తన జీవితాన్ని పరీక్షించుకొనడం మొదలుపెట్టినాడు. ఆ పరీక్షలో, తనలోతనకు తీవ్రమైన ధర్మజిజ్ఞాసపుట్టి యిట్లనుకున్నాడు:

'నాయిల్లు కొండపునాదిమీదనా లేక యిసుక దిబ్బమీదనా కట్టబడ్డది? కొండమీదనున్నదైతే మంచిదే—భయమేలేదు. ఒంటరిగా యిక్కడ యిట్లా కూర్చుని ఆలోచనలోమాత్రం భగవదాజ్ఞ లన్నింటినీ నెరవేరుస్తున్నాననుకొనడం బహుసులభం! కాని తిరిగి నన్ను నేనే మరచిపోయి యేక్షణంలో దుర్బలుణ్ణౌతానో, ఆ క్షణమే పాపంవచ్చినా నాలో ప్రవేశించడం అనుభవసిద్ధంగా చూస్తున్నాను. అయినా యింకా పట్టుదలతో బలంసంపాదించి జీవితాన్ని సాధించవలెగదా! ఆహా, యీ సాధనలో యెంత ఆనందమున్నది! ఈశ్వరా, యీ నా ప్రయత్నంలో నీ సహాయమే కావలెనయ్యా తండ్రీ!'

ఇట్లా ఆత్మప్రబోధం చేసుకొని, యిక పడుకుందామని పక్కమీదికి పోయినాడు. పుస్తకాన్ని విడిచిపెట్టలేక, లేచినవాడు తిరిగికూర్చుని తిరిగి యేడవఅధ్యాయం తీసి చదవటం మొదలుపెట్టినాడు. విశతంతువు కుమారునికి జీసను ప్రాణదానమిచ్చినసంగతి, సేనాధిపతి యొక్క సేవకునికి రోగనివారణచేసిన సంగతి, జాన్ శిష్యులకు జీససిచ్చిపంపిన జవాబు—వీటినిగురించి చదివి, ధనికుడైన 'పరిసీయుడు' జీససును తనయింటికి ఆహ్వానించిన కథదగ్గరకు వచ్చాడు. పతితురాలైన స్త్రీ జీసను దర్శనార్థం పరసీయునియింటికివచ్చి, తన కన్నీటిధారలతో ఆ మహాత్ముని పాదాలుకడిగి, తద్వారా ఆమె పశ్చాత్తాపంపొందిన కథ చదివినాడు. తరువాత నలభైనాల్గవపద్యంలో యిట్లావున్నది: 'జీసను అప్పుడా స్త్రీనిజూపి పరసీయునితో యిట్లన్నాడు: 'ఏమయ్యా, యీమెను చూస్తున్నావుకదా! మీ యింటికేకదా నే నతిథిగావస్తిని! పాదప్రక్షాళనకు నాకు కొంచెం నీళ్ళయినా యిచ్చావానీవు? మరి యీమెనుచూడు! పవిత్రమైన తన కన్నీటితో నా



రావుబహదూర్

డాక్టర్ టి. యస్. తిరుమూర్తిగారు,

బి. ఏ., యం. బి. సి. యం. డి. టి. యం. (లండన్.)

(Courtesy of Journal of Indian Medicine.)





మైసూరు దృశ్యములు.

పాదాలు కడిగి, తన మృదుశిరోజాలతో నాపాదాలు తుడిచిందే! నీయింటి కతిథిగా వచ్చినందుకు నీవు నాకు చూపిన ఆదరణయేది? పశ్చాత్తాపంతో నిండిన హృదయంతో వచ్చి, తాను గుమ్మంలో అడుగుపెట్టినది మొదలు, పదేపదే యీమె నాపాదాలను ముద్దుపెట్టుకుంటూ వుండటం నీవే చూస్తున్నావు.'

అంతవరకు చదివి మార్టిన్ తనలో తానిట్లనుకున్నాడు: 'అయ్యో, అతిథి కామాత్రం మర్యాదకూడ చూపలేకపోయినాడుగా వాడు! తలకొక్క నూనె చుక్కైనా యియ్యలేకపోయినాడే! ఇదేనా గృహస్థ ధర్మం?' అంటూ తిరిగి కండ్లద్దాలు తీసి పుస్తకంమీద పెట్టి ఆలోచనలో బడ్డాడు:

'ఆపరసీయుడెవడో గాని, నావంటి మందబుద్ధే అయివుంటాడు, వాడూ నాలాగునే తనపొట్టకు మాత్రమే చూచుకునేవాడై యుండవలె! ఏపూటకాపూట గిన్నెడు తేనీ రెట్లా లభిస్తుందో అని చూచుకునే వానికి యింటికివచ్చిన అతిథుల గొడవెందుకు? పోనీ, ఆవచ్చిన అతిథిమాత్ర మెవరు? సామాన్య మానవుడా? ఆయనే నాయింటికి వచ్చివుంటే నేనట్లాగే చేస్తానా? సిగ్గు కాదూ?'

ఇట్లా యోచనచేస్తూనే మార్టిన్ తల చేతులమీద ఆనుకొని అప్రయత్నంగా నిద్రపోయినాడు.

అంతలోనే ఆకస్మికంగా 'మార్టిన్, మార్టిన్!' అని పిలుస్తూ యెవరోవచ్చి తన్ను లేపుతూన్నట్లు బిగ్గరగా కేకవినబడ్డది.

ఉలికిపాటున లేచి కూర్చొని 'ఎవరక్కడ?' అన్నాడు మార్టిన్.

ద్వారంవైపు తిరిగిచూచాడు. ఎవ్వరూ కనిపించలేదు. 'బయట యెవర'ని తిరిగి బిగ్గరగా ప్రశ్నించాడు. తిరిగి స్పష్టంగా వినబడ్డది పిలుపు—'మార్టిన్, మార్టిన్! రేపటిరోజున వీధివంకచూస్తూ వేచివుండుసుమా! రేపే వస్తాను!'

మార్టిన్ స్పృహతెచ్చుకొని కండ్లు తుడుచుకున్నాడు. కుర్చీలోనుంచి లేచి నిలబడ్డాడు. తాను విన్నధ్వని నిజమైనదో లేక స్వప్నమో తెలియలేదు. దీపం ఆరిపి పడుకొని నిద్రపోయినాడు.

మర్నాడుదయాన్ని వెలుగు రాకముందే నిద్ర లేచాడు. దైవప్రార్థన చేసుకొని పొయ్యిమంటబెట్టి వంటచేశాడు. మరొకగిన్నెడు నీళ్ళు పొయిమీదబెట్టి మాపుగుడ్డవేసుకొని కుట్టుపనికి కూర్చున్నాడు. కాని, చేతులు పనిచేస్తూవున్నా, మనస్సు తీవ్రమైన ఆలోచనలోనే మునిగివున్నది. రాత్రి జరిగిన విషయాన్ని గూర్చి దీర్ఘాలోచనచేస్తూ కూర్చున్నాడు. ఒకప్పుడు అంతా స్వప్నమేమోననిపించేది. మరొకప్పుడు 'నిజంగా మెలకువలో వినబడ్డపిలుపే!' అని నిశ్చయం చేసుకునేవాడు. 'యేమో, యేమిచెప్పగలం? ఇంతకు పూర్వం ప్రపంచంలో యిటువంటి వింతలెన్నో జరిగేవుంటాయి!' అనుకుంటూ, తనకు వినవచ్చింది నిజమైన పిలుపేయని నిర్ధారణ చేసుకున్నాడు.

చేతిలోవున్న పనిమీద అంతగా శ్రద్ధలేకుండ కిటికీ వద్దనే కూర్చుని నిమిషనిమిషానికీ వీధివంక చూస్తున్నాడు మార్టిన్. కొత్తజోడు తొడుక్కొని ఆదారినెవరు పోతూన్నా కిటికీలోపలికి తలవంచి వాళ్ళ ముఖాలవంక చూస్తున్నాడు. కొత్తజోడు తొడుక్కొని యింటినౌకరొకడు, తరువాత కీల్లు మోసేవాడొకడు కనిపించారు. ఇంతలోనే చేతిపార ఒకటి పట్టుకొని ముసలి సిపాయొకడు వచ్చి కిటికీబయట నిలబడ్డాడు. అతడు తొడుక్కున్న చెప్పులనుబట్టి మార్టిన్ అతన్ని గుర్తించాడు. ఒక వర్తకుని దయవల్ల పొట్టపోసుకుంటున్నాడా సిపాయి. ఇంటినౌకరుతో కలిసి పని చేయడమే ఆసిపాయికి నియమింపబడ్డ పని. సిపాయి ముసలివాడు. కిటికీబయట పేరుకున్న మంచు తుడిచివేయడం ప్రారంభించాడు. మార్టిన్ సిపాయివంక చూస్తూ, ఒకవైపున తనపని తాను చేసుకుంటూ, లోలోపల నవ్వుకుంటూ యిట్లనుకున్నాడు:

'కాలం గడచినకొద్దీ నాకు పిచ్చెత్తిపోతున్నట్లున్నదే! ఈ ముసలివాడు మంచుతుడిచి బాట బాగుచేయడానికేగదా వచ్చాడిక్కడికి! ఇక త్వరలో క్రీస్తు మహాత్ముడుకూడా నన్ను చూడటానికి వస్తాడు కాబోలు! ఏమో—మనస్సు అనేకవిధాల పోతూ

న్నది. ఏమిటి నాకీ చలచిత్తం?'

ఇట్లా అంటూనే పదిపన్నెండుకుట్లు కుట్టేసరికీ తిరిగి అప్రయత్నంగా వీధివైపుకే మళ్ళింది మార్టిన్‌దృష్టి. చేతిపారమీద నడుము ఆనుకుని సిపాయి గోడపక్క నిలబడ్డాడు. అసలే ముసలివాడు. ఆశక్తతుడుతోడు చలి బాధవొకటి. పారతో మంచుకూడ లాగలేనిస్థితిలో వున్నాడు.

'అయ్యో, ఈ ముసలివాణ్ణి ఒకసారి లోనికిరమ్మని కొంచెం తేనీరిద్దునా, పాపం!—నీళ్ళు పొయ్యిమీద మరుగుతూనేవున్నాయి.' అనుకున్నాడు మార్టిన్.

చేతనున్న సూది, దారం అక్కడివక్కడనే దిగవిడిచి లేచాడు. మరుగునీళ్ళు తెచ్చి బల్లపైబెట్టి తేనీరు తయారుచేశాడు. కిటికీతలుపుతట్టి గోడవారనున్న సిపాయిని పిలిచాడు. పిలుపువిని స్టైపానిష్ (సిపాయిపేరది) కిటికీకెదురుగావచ్చి నిలిచాడు. అతన్ని లోపలికిరమ్మని సంజ్ఞచేసి, మార్టిన్ గదితలుపు తెరవడానికి పోయినాడు.

'రా, నాయనా—లోపలికివచ్చి కొంచెం చలి తీర్చుకో. ఎంత బాధపడుతున్నావోకదా!' అంటూ తలుపు తెరిచాడు మార్టిన్.

'నీకెంతైనా దేవునిమెప్పుందయ్యా, అన్నా! ఈ చలిచేత నిజంగా కీలుకీలుకూ భరించలేని పోట్లు పొడుస్తూన్నవంటే నమ్ము నాయనా!' అంటూ లోపల ప్రవేశించాడు స్టైపానిష్. ఒంటిమీదపడ్డ మంచంతా బయటనే దులిపివేసినాడు. తడికాళ్ళతో వస్తే గది పాడౌతుందన్న భయంచేత పాదాలు తుడుచుకుంటూ తూలి పడబోయినాడు.

మార్టిన్ వెంటనే దగ్గరకుపోయి సిపాయి చెయ్యి పట్టుకొని 'అయ్యయ్యో, కాళ్ళు తుడుచుకో నక్కరలేదు ఇంత చలిబాధపడుతూ యెందుకు నీకింతశ్రమ? ఇల్లు తడైతే నేను తుడుచుకోనా? ఎట్లాగూ దినదినం తుడుచుకోవలసిందే. రా, బాబూ—నెమ్మదిగా యిట్లా కూర్చుని కొంచెం తేనీరుపుచ్చుకో!' అని ఆదరణతో అతిథిని కూర్చోబెట్టి, తేనీటిని రెండుగిన్నెలలో పోసి ఒకటి సిపాయి కందిచ్చాడు. తనగిన్నెలోది కొంచెం పళ్ళెంలోపోసి ఊది చల్లారబెడుతున్నాడు.

స్టైపానిష్ తనగిన్నెడూ తాగి, గిన్నె పళ్ళెంలో బోర్లించి మార్టిన్ చూపిన దయకై అతన్ని అభినందిస్తూ కూర్చున్నాడు.

'అన్నా, మరికొంచెం పుచ్చుకుందూ!' అంటూ మార్టిన్ తిరిగి రెండుగిన్నెలూ నింపినాడు. మార్టిన్ తేనీరు తాగుతున్నాడేగాని కిటికీగుండా రోడ్డుమీదికి చూడటం మానలేదు.

'అన్నా, యేమట్లా చూస్తావు—ఎవరికోసం?' అని ప్రశ్నించాడు స్టైపానిష్.

'ఎవరికొరకంటావా?—అబ్బా, ఆసంగతి యిప్పుడు నీతో చెప్పుకోవడానికే సిగ్గౌతున్నదోయి' ఎవరికోసమా?—ఏమనిచెప్పను? నిన్నటిరాత్రి నిద్రలో నాకేదో పిలుపులాగున వినవచ్చింది. అది మొదలు యీ క్షణంవరకూ నన్నది విడిచిపోవడంలేదు. నిజమైన పిలుపో, లేక నేను కలిగించుకున్న భ్రమో తెలియడంలేదు. నిన్నటిరాత్రి యిక్కడేకూర్చుని బైబిల్ చదువుతున్నాను. జీసుప్రభు యీలోకంలో అవతరించి ధర్మప్రబోధ మెట్లాచేశాడో, యెన్నికష్టా లనుభవించి ధర్మస్థాపన చేశాడో—ఆవిషయం చదువుతున్నాను. ఆ కథ నీవూ వినేవుంటావు.' అన్నాడు మార్టిన్.

'అవును విన్నాను. కాని నాకేమి తెలుస్తుంది నాయనా? మూర్ఖుణ్ణి—చదువురాదు.'

'జీససు చేసిన ధర్మప్రచారాన్ని గురించే చదువుతూ కూర్చున్నాను. అతడు పరసియుని యింటికి పోవడం, వాడాయనను నిర్లక్ష్యంగా చూడటం—ఆకథ చదువుతూ, అంత మహానుభావుని అగౌరవపరిచేటంత నిర్భాగ్యత ఆమానవుడి కెట్లాకలిగిందని నా కాశ్చర్యం తోచింది. ఆమహాత్ముడు యింటికతిథిగావచ్చే అదృష్టం నాబోటివానికే తటస్థిస్తే, నాప్రయత్నలోపం లేకుండానే నాయనకోసం యెంతైనా చేతునే! వాడి దురదృష్టంకొద్దీ అంత దౌర్భాగ్యుడైనాడు పరసీయుడు. ఆ మహనీయుని గొప్పతనం మరేమానవుడు తెలుసుకోలేకపోతాడు? ఇట్లా అనుకుంటూవుండగానే నిద్ర పట్టింది. వెంటనే యెవరోవచ్చి నాపేరుబెట్టి పిలిచినట్లు

వినబడ్డది. అప్పుడే తిరిగి మరొకసారి వినవచ్చింది. రెండుసార్లు వినబడటంతోనే ఆపిలుపు నామనసులో నాటుకొనిపోయింది. ఇప్పుడది బహిరంగంగా నీతో చెప్పడానికే లజ్జపడుతున్నానుగాని ఆమహాత్ముని కొరకే నేనిట్లా వేచి కూర్చున్నాను—నిజం చెప్ప వద్దూ?' అన్నాడు మార్టిన్.

స్టెపానిచ్ నిశ్శబ్దంగా యేదో ఆలోచిస్తూ తల వూచాడు. రెండవగిన్నె తేనీరుకూడతాగి గిన్నె బల్లమీద వొరగబెట్టినాడు. మార్టిన్ గిన్నెనిలబెట్టి తిరిగి దానిని తేనీటితో నింపి, అతిథిముందుబెట్టి

'అన్నా, యిదిగో మరొకగిన్నెడు పుచ్చుకో!—విను, యిట్లాగే యోచిస్తూ కూర్చున్నాను. ఆ మహా పురుషుడు ధర్మబోధచేస్తూ యెట్లా ఊరూరూ తిరుగుతూపోయినాడో, పోయినచోటల్లా కొద్ది గొప్ప లెంచకుండా యెప్పుడూ సామాన్యప్రజలతో యెట్లా కలసిమెలసి వుండేవాడో, అదే గొప్పవిషయం. ఎక్కడచూచినా, యెప్పుడుచూచినా ప్రజలు గుంపులుగా ఆయనచుట్టూ చేరేవారు. మనవంటి అతి సామాన్యులను కాదూ ఆయన తనశిష్యులుగా చేరదీసుకున్నది? మనవంటి కూలిపనివాళ్ళు, పాపాత్ములు ఆయన వెంటపోయి శిష్యులైనారు. ఇక ఆయనచేసే బోధయెట్లా వుండేదో విన్నావా?—'అహంకారానికెవడు దాసుడై పేరుప్రతిష్ఠలకోసం పాకులాడతాడో వాడు పతితుడౌతాడు; ఎవడు వినమ్రుడై అణగి మణగి యుంటాడో వాని కౌన్నత్యం చేకూరుతుంది.'...... 'నన్నా ప్రభువంటారు మీరు? నేను గాను ప్రభువును. మీ సేవకుణ్ణి మీ పాదాలుకూడా కడుగుతాను. ప్రభువనదగిన వాడా పరమాత్మ ఒక్కడే!'...'ఎవడు మనుష్యులలో మొదటివాడు, అనగా ఉత్తముడు కాగోరుతాడో వాడందరికీ సేవకుడైయుండవలె. ఎందుచేతనంటే, స్వామిభక్తులైన దరిద్రులు, వినమ్రులు, శాంతాత్ములు, దయాహృదయులు మాత్రమే ధన్యచరిత్రులు.' ఇదే ఆయనబోధించే ఉత్కృష్టతత్వం' అన్నాడు మార్టిన్.

ఈ మహావాక్యాలు వింటూవింటూ స్టెపానిచ్ తేనీరుతాగడమే మరచిపోయి, యేదేదో ఆలోచిస్తు బొటబొట కన్నీరు గార్చాడు.

'రా, అయ్యా! మరికొంచెం తేనీరుపుచ్చుకో' మని హెచ్చరించాడు మార్టిన్. కాని స్టెపానిచ్ మనస్సు తేనీరుమీదికి పోలేదు. ఈ సంభాషణతో అతనిహృదయం కదలి పరవశమయింది. తనపైన మార్టిన్ చూపినదయకు కృతజ్ఞత తెలుపుతూ చేతిలో గిన్నె ఒకపక్కకు బెట్టి లేచి నిలబడ్డాడు.

'కృతజ్ఞుణ్ణయ్యా తండ్రీ! నా శరీరానికీ ఆత్మకూ కూడ కావలసిన ఆహారమూ ఆనందమూ యిచ్చావు నీవు.' అన్నాడు సిపాయి.

'అట్లా అనవద్దు—నీ విక్కడికి రావడమే నాకెంతో సంతోషాన్ని కలిగించింది. మరొకసారి వస్తావుకాదూ? తప్పకరా! నీవంటి పెద్దమనుష్యులను గౌరవించడంకంటే వేరే భాగ్యమేముంటుంది?' అంటూ సంతోషం వెలిబుచ్చాడు మార్టిన్.

తరువాత స్టెపానిచ్ సెలవుపుచ్చుకొని వెళ్ళిపోయినాడు. మిగిలిన తేనీరుకూడ గిన్నెలోవంచుకుని మార్టినే తాగివేశాడు. పాత్రసామగ్రంతా కడిగిజాగ్రత పెట్టి కిటికీవద్దనే కూర్చుని తిరిగి కుట్టుపని ప్రారంభించాడు. కుట్టుపని చేస్తూనే జీసస మహాత్మునిగూర్చి, అతని చేతలనుగూర్చి మననంచేస్తూ అతని రాకకొరకే నిరీక్షిస్తూ కూర్చున్నాడు. క్రీస్తు సదుపదేశాలతోనే మార్టిన్ మనస్సు నిండిపోయింది.

మార్టిన్ చూస్తూండగానే మరియిద్దరు సిపాయిలు ఆదారిని పోయినారు. అందులో ఒకడు గవర్నమెంటు 'బూట్సు', రెండోవాడు స్వంత 'బూట్సు' తొడుక్కున్నారు. తరువాత ఆయింటిపొరుగు గృహస్థుడొకడు పోయినాడు. వానితరువాత రొట్టెలమ్మేవాడొకడు తట్ట నెత్తినిబెట్టుకొని పోయినాడు. ఇందులో ఒక్కడు కూడ మార్టిన్ యింటి సమీపంలో ఆగకుండా యెవరి పనిమీద వారే పోయినారు. తరువాత మేజోళ్ళూ చెప్పులూ తొడుక్కొని పోతూన్న స్త్రీ ఒకతె కనిపించింది. ఆమెకూడ మొదట కిటికీదాటి పైకిపోయింది. కాని తిరిగివచ్చి గోడపక్కకుచేరి నిలబడ్డది. గోడవద్ద

యెవరో నిలబడ్డట్లూహించి కిటికీగుండా తొంగి చూచాడు మార్టిన్. తానెప్పుడూ చూడనిపరాయి మనిషివలె కనబడ్డదామె. కటికిదారిద్ర్యాన్ని సూచిస్తున్నాయి ఆమెకట్టుకున్న దుస్తులు. చంటిబిడ్డకూడా వున్నదామె చేతిలో. తాను కట్టుకున్న చాలీచాలని చింపిపాతనే ఒక పెద్ద బిడ్డకుకూడ కప్పి చలితీర్చడానికి ప్రయత్నిస్తున్నది. కాని ఆబట్ట యిద్దరికీ చాలింది కాదు. ఇకనేంజేస్తుంది? బిడ్డతో చలిగాలి కెదురుగా నిలవలేక గోడవైపుతిరిగి గోడనంటుకొని నిలబడ్డది. నిలువనీయకుండ బిడ్డ యేడ్పు మొదలుపెట్టింది. తల్లి యెంత ఓదార్చినా యేడ్పుమానదు. ఇదంతా మార్టిన్ చూస్తునే వున్నాడు. తల్లినీ బిడ్డనూ ఆస్థితిలో చూస్తు, స్తిమితంగా కూర్చోలేక పోయినాడు. చివాలునలేచి తలుపుతీసి బయటకుపోయి ఆమెను పలకరించాడు.

'అమ్మాయీ, ఇదిగో యిట్లాచూడు!'

మార్టిన్ పిలుపువిని స్త్రీ తిరిగిచూచింది.

'అయ్యో! ఎందుకమ్మా, పసిబిడ్డను పెట్టుకొని చలిలో నిలబడ్డావు? లోపలికి రారాదా? కొంతసేపు కుంపటివద్ద కూర్చోవచ్చు. ఇదిగో, యిదేమార్గం—ఇట్లారా!' అన్నాడు మార్టిన్.

ఆస్త్రీకి మార్టిను క్రొత్తవాడే. పరాయిమనిషి తన్నంతగా ఆదరించి పిలవటంచూస్తే ఆశ్చర్యం కలిగిందామెకు. కాని, యేమనుకున్నదో, బిడ్డనెత్తుకొని మార్టిన్ వెనుకనే మెట్లుదిగి లోపలికివచ్చింది. గదిలో ఒకమూల పక్కపరచివుంది. మార్టిన్ ఆమెనాపక్కవద్దకు తీసుకొనిపోయి 'అమ్మా కూర్చో, యీ కుంపటిదగ్గర. పక్కమీద కూర్చుని చలికాచుకుంటూ బిడ్డకు పాలియ్యి, పాపం!' అన్నాడు మార్టిన్.

'పాలులేవు బాబూ! ఇప్పటివరకూ, యీ వేళ నేనేమీ తినలేదు.' అంటూ బిడ్డను దగ్గరకు తీసుకున్నది స్త్రీ.

'అయ్యో, అట్లాగునా? సరే, సరే!' అని తల వూపుతూ పోయి మార్టిను కొంతరొట్టె, కొంచెము పళ్ళెంలోబెట్టి తెచ్చి బల్లమీద వుంచాడు.

—సశేషము.

[టాల్‌స్టాయి కథకు అనువాదము.]

—తల్లాప్రగడ ప్రకాశరాయుడు, యం ఏ.

---

# ఓదార్పు

కన్నులనిండ బాష్పములు గ్రమ్మి స్రవంతులు గట్టె, మోముననా
విన్నదనంబు ప్రేలెడిని; వేదురుచందము సర్వదా వ్యథా
ఖిన్నత జీవితంబొక నికృష్టపు దారినిఁ బట్టె, నెంత యా
పన్నుఁడవో దురూహ్యము భవత్పరితాప మహో! కృషీవలా!

ఎంతటి సాధుశీలుఁడవో, యెండకు గాలికి వాన కోర్చి క
ష్టింతువు తెక్కలం విడిచి; చేతకుఁ దగ్గఫలంబు రాక, యం
తంతకుఁ దగ్గిపోయి యడుగంటెను నెమ్మది; యెన్నఁడున్నన
శ్శాంతి యదెట్టిదో యెఱుఁగఁజాలవుగా! అకటా! కృషీవలా!

వరుసను దప్పికాని మఱి వానలు వచ్చుట లేదు; వచ్చినన్
ధర యొగఁజేపుచున్నయది; తగ్గఁగఁ జొచ్చెను బాడిపంటలున్

ధరలును గూలిపోయె; ఋణదాతల త్రొక్కుడు తీవ్రమయ్యె; హా!
కఱవులు నిత్యకృత్యములుగా విధివ్రాలుగదే, కృషీవలా!

కోరవు భోగభాగ్యములు; కోరవు దాల్ప దుకూలముల్ సదా
కారము సంకటిం దిని యొకానొకరీతిఁ జరించు నీకు దు
ర్వారములై యొసంగి ఋణబాధలు దారుణబాధలయ్యె; కం
గారయిపోయె నీచరిత; న్యాయము మాటుపడెం గృషీవలా!

పనులకు మేతగాని, పనిపాటల కే కొఱముట్లుగాని వె
క్కసముగ రొక్కము న్వదలఁగల్గనిచో మఱిచిక్కవన్న! యే
వనతులు లేకపోయినను, పన్నులు మూలము ముట్టునట్లు, నీ
వొసఁగక తప్పఁబోవు, భవదూర్జిత పాపమొకో! కృషీవలా!

పైరుల నమ్ముకోఁదగదు, భార్యమెడంగల తాళిగాక, బం
గార మదేదొ చిల్లర తగాదల కోసమె చెల్లుపోయె; వే
యారులు సేయుభూములు క్రయానికి నూటికి నైనఁ బోవఁ, కే
తీరునఁ దీర్చి గౌరవమతిన్ విహరించెదవో! కృషీవలా!

రేపును మాపు నీదగు పరిశ్రమచేతనె కూడుగుడ్డకున్
లోపము లేకయే మనుట లోకములోని సమస్తజీవులున్
నీ పరిశుద్ధ జీవనము, నీయుపకార పరత్వ మెంచియే
కాపును కల్పవృక్షమనఁ గల్గిరి పెద్దలు నిన్ గృషీవలా!

ఏమని వచ్చెనో, కఱవిదేగతిఁ బోవునో, రక్షకుండు దా
నేమి తలంచెనో, యెఱుఁగ మింతకుఁ జిత్రము దైవమాయ; నీ
మోమునఁ దొల్లిరీతి నగుమొల్కలు మాచెడి భాగ్యమబ్బుటే
ఆమని యీప్రపంచమున కయ్య దిఁ కెప్పుడొకో! కృషీవలా!

ఎందఱు రాజకార్యపరు, లెందఱు నార్థికశాస్త్రవేత్త, లిం
దందునఁ జేరి దిద్దఁగల 'ప్యాక్టుల' తోఁబని లేదు మాకు, నీ
కుం దగు సాయమిచ్చి, నినుఁ గోల్కొనఁ జేయుట శాంతికీలకం
బిందుకుఁ దప్పి రేని వెత తేనుమి! లోకమునన్ గృషీవలా!

ఊఱటఁ జెందుమోయి సఖ! యోపికపట్టుము; కాలమొక్కటే
తీరున నుండఁబోదు, జగతిం బరివర్తన మున్నదే కదా!
భూరి దయాస్వభావ పరిపూర్ణుఁడు దేవుఁడు సైచునొక్కొ? క
న్నీరును రాల్పకుండ, విని నీ పరివేదన మో కృషీవలా!

—భూతపురి నారాయణస్వామి.

# ఊహాలు – ఉరకలు

౧

**పాపిష్ఠి పట్టుదల :**

ప్రతివిషయంలోనూ పట్టుదల అనేది అడ్డంవస్తుంది. అందువల్లనే తగాదాలు తెగకపోవడమూ, లేని తగాదాలు పుట్టుతూ ఉండడమూనూ.

మొదట్లో ఒక విషయాన్నిగురించి నిక్కచ్చి అభిప్రాయం ఇస్తాం. తర్వాత గ్రంథపఠనమువల్లగాని, పెద్దలనుంచి వినడంవల్లగాని ఆ అభిప్రాయానికి వ్యతిరేకంగా మనకు కొన్ని సంగతులు తెలుస్తయి. కాని పాపిష్ఠి పట్టుదల వాటిని ఒకంతరాన ఒప్పుకోనివ్వదు. ఆవిషయంలో మనం అథారిటీ అని మనం అనుకుంటున్నప్పుడు ఈ పట్టుదల మరీ అడ్డంవస్తుంది.

గాంధిగారి ఉద్యమం ఏదైనాసరే కొందరికి ఇదే కారణంవల్ల గిట్టదు. ఆయనంత గొప్పవాడు లేకపోవచ్చు భారతదేశంలోనేగాక యావత్తు ప్రపంచకంలోగూడా. అయినా మతం నాశనమయ్యేట్టు అస్పృశ్యతా నివారణోద్యమం లేవదీసిన ఆయన ఇతర ఉద్యమాలు గూడా కొందరికి అహితంగా ఉంటున్నయి. ఎన్నైనా చెప్పండి—ఆయన గొప్పవాడు. తపశ్శాలి, ఋషి—అన్నీ ఒప్పుకుంటారు. కాని ఆయన ఉద్యమాలు దేశనాశనకరాలు కావనిమాత్రం సుతరామూ ఒప్పుకోరు ఈలాంటి మానవులు.

మన ఆచారాలవిషయం ఆలోచిద్దాము. చాలామంది అవి ఆచరించడం ఆ ఆచారాలు తరతరాలనుండీ ఆచరింపబడుతున్నవనే కారణంవల్ల తప్ప మరొకటి గాదు. నూటికి తొంభయితొమ్మిది మంది ఇంతే. వారిలో ప్రపంచకజ్ఞానం కలవారూ ఉన్నారు, బొత్తిగా లేనివారూ ఉన్నారు. జ్ఞానంలేనివారిమాట ఏలాఉన్నా, ఉన్నవారుకూడా ఆ ఆచారాల మంచిచెడ్డలు విచారించడానికి పూనుకోరు. కారణం పాపిష్ఠి పట్టుదలే.

ఒకవేళ ఎవరైనా వాటి మంచిచెడ్డలు శ్రమపడి వివరిస్తే అన్నీవిని వారు మరొకవాదన లేవదీస్తారు. 'మనపూర్వులేమి తెలివితక్కువవాళ్ళా? ఈమాత్రం తెలియకుండా ఉందావారికి? వాళ్ళు ఆచరించినప్పుడు మనంమటుకు ఆచరిస్తే తప్పేమిటి?' అని దానికి ఇహ సమాధానంలేనట్టుగా ప్రశ్నిస్తారు. ఎవరైనాసరే వాళ్ళ పూర్వులు తెలివితక్కువవాళ్ళని ఒక్కపెట్టున అనడానికి సందేహిస్తారుగదూ! కారణాలన్నీవిని, వాదనలోనూ, విషయంలోనూ గల బాగోగులు చక్కగా విచారించుకుని తీరా మనంచెప్పింది ఒప్పుకోక తప్పదు అనే పరిస్థితి వచ్చినప్పుడు ఈప్రశ్నచాటున దాక్కోవడం తెలివితక్కువ. ఇది అక్షరాలా పాపిష్ఠిపట్టుదల పనే. ఏకాలానికి ఏ ఆచారం సరిపోతుందో ఆఆచారం ఆకాలపువారు ఆచరించారు అని ఆప్రశ్నకు సమాధానం చెప్పబోయి కొందరు ఒళ్ళుమండి మనపూర్వులు అక్షరాలా తెలివితక్కువాళ్ళే అని చెప్పినవాళ్ళుగూడా ఉన్నారు పాపిష్ఠి పట్టుదలకు ప్రతిగా.

భాషావిషయం తీసుకున్నా అంతే. ఏమాత్రం కాస్త స్వతంత్రంగా ఆలోచించగలవాడైనా శిష్టవ్యవహారంలో గద్యము వ్రాయడమేమంచిది అనేరోజులు వచ్చినయి. కాని ఇంకా ఆ నిర్జీవగ్రాంథికాన్నే పట్టుకుని ప్రాకులాడే పెద్దలు లేకపోలేదు. ఇతర భాషా సాంప్రదాయాలుగూడా తెలిసినవారిందులో కొందరుంటారు. వారికి జీవంగలభాషను వాడడంలోగల ఉపయోగాలు, వ్యాకరణానికీ భాషకూగల సంబంధము— అనగా వ్యాకరణం భాషను శాసించేదిగాదు. భాషయొక్క మార్పు ఎప్పటికప్పుడు క్రోడీకరించి ఒక్కచోట కనపర్చేది అనుసంగతి—మొదలగు విషయాలు ఎన్నిచెప్పినా వారు అన్నీవిని ముక్తాయింపు గ్రాంథిక భాషమీదనే వేస్తూఉంటారు. పాపిష్ఠిపట్టుదలే దీనికి కారణం. దానితోడు తమకు వచ్చినంతభాష రానివారుగూడా తెగవ్రాశేస్తున్నారే అనే అసూయ

కూడా ఉంటే ఉండవచ్చు.

మానవునికి కలిగిన ఓటమీ, భావంలో కలిగిన మార్పూ ఎంతమాత్రమూ ఒప్పుకోనివ్వదు ఈ పిశాచము. మొండిఎద్దయినా సాయిగ్గే గెలవవలెనంటుంది.

జ్ఞానం కలిగినందుకు ఫలితం షాపిష్టి పట్టుదలకు దాసులంకావడంగాదు. చదవడమూ, నేర్చుకోవడమూ, మార్పులను తెలుసుకోవడమూ, ప్రాతవిషయాల స్థానే నూతనాలూ, యుక్తాలూ అయిన విషయాలను నిలపడమూ, అయుక్తాలు త్రోసివేయడమూ, వృద్ధిపొందడమూ ఇవి జ్ఞానంకలిగినవారు చేయవలసిన పనులు.

ఈ పిశాచాన్ని జయించినమానవుడు వృద్ధిలోకి రావడానికి ఆక్షేపకష్టం ఉండదు.

## ౨

## ప్రయాణీకుల సంఘం :

ఈ సంఘం స్థాపింపబడినప్పటినుండీ చాలా శ్రద్ధగా పనిచేస్తూ ప్రయాణీకులకు చాలా ఉపయోగమైన పనులను చేస్తున్నది.

వీరు ముఖ్యంగా రైల్వేకంపెనీవారితో రాయబారాలుజరిపి ప్రయాణీకులకు ఉండే ఇబ్బందులను తొలగించి సౌకర్యాలు కలిగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.' కార్యం ఘనమయిందే. ఫలితాలుగూడా సంతృప్తికరంగానే ఉన్నాయి.

కాని ఈ సంఘంవారు ముఖ్యంగా పూనుకోవలసిన కార్యం మరొకటి ఉందేమోనని తోస్తుంది. ఏ ప్రయాణీకుల తరఫున వీరు చాలా వ్యయప్రయాసలకు లోనై పనిచేస్తున్నారో ఆ ప్రయాణీకులలో ఉండే లోటుబాట్లను సరిచేయడానికి పూనుకోవడం చాలా ముఖ్యమయినసంగతి. అంతకన్న ప్రస్తుతం అవసరంగలపని మరొకటి లేదనికూడా చెప్పవలసివస్తుంది.

మానవుడు సంఘంలో తాను ప్రవర్తించే ప్రవర్తనలో గల లోటుబాట్లను సరిచేయడానికి ఈ సంఘాన్ని పూనుకో మనం. రైల్వే ప్రయాణీకుడు ప్రయాణపు సందర్భములో తను నిర్వర్తించవలసిన విధి సరిగా నిర్వర్తించేట్లు చేయడంమాత్రం ఈ సంఘానికి తప్పక విధి.

రైలులో తాను కూర్చున్నప్పుడు తనప్రక్క ప్రయాణీకుడికి ఏమాత్రం ఇబ్బందిలేకుండా ప్రవర్తించడం ప్రతి ప్రయాణీకుడు నేర్చుకోవాలె. ఎక్కడకూర్చున్నా కిటికీ అంచులోనేఉంటుంది. అయినా రైలుపెట్టెలోనే ఉమ్మివేయడం, చోటుచాలక మొత్తుకుంటున్నా కాళ్ళు దన్ని పడుకొనినిద్రపోవడం, పెట్టెలో ఉండేవాళ్ళంతా —సిగరెట్టు అలవాటుఉన్నవారూ లేనివారూగూడా —ఉక్కిరిబిక్కిరి అయ్యేట్లు చుట్ట, బీడీ, సిగరెట్లు కాల్చడం మొదలయిన అకార్యాలు జరగకుండా ప్రయాణీకులలో ప్రబోధము అవసరం.

చదువుకున్నవారూ, చదువుకోనివారూ అనే భేదములేకుండా ఈ విషయంలో అందరూ సమానంగానే ప్రవర్తిస్తున్నారు. రైలుపెట్టెలోకి రాగానే ప్రతివారికీ ఒకవిధమయిన ఎక్కడాలేని హక్కు వస్తుంది.

విషయం కొద్దిదయినా ప్రజల ఆరోగ్యానికి చాలా భంగకరమయిందీ, అనాగరికతకు లక్షణమయిందీ, రైలుపెట్టెలను సాక్షాత్తు నరకాలను చేయగలిగిందీ అగు ఈ విషయాన్నిగురించి ప్రయాణీకులలో ప్రబోధం కలిగించడానికి సంఘం పూనుకోవాలి. ప్రచారకులను ఏర్పాటుచేసి, రైల్వేవారి సహాయంతో—అనగా వారివల్ల ఫ్రీసీసన్‌టిక్కట్లు సంపాదించి ఈపనికిగాను-ఉపన్యాసాల రూపకంగా కొన్నాళ్ళు ప్రబోధం కలుగజేస్తే చాలావరకు లాభం ఉండవచ్చు. ఈలాటి పనికి పూనుకుంటారా సంఘంవారు ?

## ౩

## శేషం కోపేన పూరయేత్

మన పూర్వీకుల శాస్త్రాలు, ఆచారాలు - కొన్నిగాని చివరకు ఏఒక్కటిగాని - మంచివికావు, ఆచరణయోగ్యాలు కావు అని, ఆ ఆచారాలను గ్రుడ్డిగా అవలంబిస్తున్నవారిని తిరస్కరించినట్లయితే, ఆ తిరస్కరించినవారి శరీరాలలో మన పూర్వీకుల రక్తం ప్రవహించడంలేదనీ, సంకర రక్తమే ప్రవహిస్తున్నదనీ కొందరు సనాతనప్రముఖులు సెలవిస్తున్నారు.

ఈ మాటలవల్ల అప్రముఖుల ఆగ్రహం వ్యక్తమవుతున్నది. కానీ శేషం కోపేనపూరయేత్ అన్నట్లు చేతగాక తిట్లకు దిగినట్లుగా కూడా కనబడుతుంది.

ఈ ఒక్క కారణంచేతనే మనమన శరీరాలలో మన పూర్వుల రక్తం ప్రవహిస్తున్నదీ లేనిదీ తేల్చదల్చుకుంటే ఒక్క నిముషంలో ఎవరి శరీరాలలోనూ పూర్వీకుల రక్తం ప్రవహించడం లేదని ఘంటాపథంగా నిరూపించవచ్చు. అప్పుడు అందరూ సంకరులే అవుతారు. అసలు తనకూ తనపూర్వీకుడికీ ప్రతివిషయంలోనూ ఒకే అభిప్రాయాలున్నాయా? ఉండడానికి సావకాశం ఉన్నదా? అని ఆలోచించుకోకబోవడం చేతనే ఈలా అబడదిబడ మాటలు బయలు వేరుతున్నాయి.

ఒక స్థితిలోకి మానవుడు వచ్చేసరికి ఆలోచన మట్టమవుతుంది. ఈవిధంగా ఆగ్రహపడిన వారిని నిలబెట్టి ఒక ప్రశ్న వేశారు కొందరు. 'ఇతరులు తిరస్కరించారని మీరు ఆగ్రహపడుతున్న శాస్త్రాలను ఆచారాలను తమరు ఎంతవరకూ అనుసరిస్తున్నారు?' అనేది ఆప్రశ్న. దానికి వారేమంటారూ 'ఎవరికి చేతనయినంత వరకూ వారు అనుసరిస్తారు. అందర్నీ ఒకేవిధంగా అనుసరించమంటే చేతవుతుందా? అందర్నీ ఒకేమాదిరి భోజనం చేయమనండీ వీలవుతుందేమో?'

అంటే ఎవరికి ఎంతవరకు అవసరమో, ఎంతవరకు వీలో, ఎంతవరకు సౌఖ్యమో అంతవరకు అవలంబించవచ్చునన్నమాట. అయినప్పటికీ వారి సజాతీయత్వానికేమీ భంగంరాదన్నమాట? అశాస్త్రం, ఆచారం ఏమాత్రమూ అవసరంలేదని వారి సంగతేమిటి! అయితే సనాతనులకు ఏలా నచ్చుతుందంటే నూరోవంతైనా మనం ఆచరణలో ఉంచకపోయినా నూరు వంతులూ ఆచరిస్తున్నట్టు నటిస్తే. అనగా చెప్పేదిఒకటి చేసేది ఒకటీ అయితే నిముషంలో సనాతనధర్మ సంస్థాపకుడు కావచ్చు. వాచా శాస్త్రాలనూ, ఆచారాలనూ ధిక్కరించకుండా ఉంటే వారిశరీరాలలో వారి పూర్వీకుల రక్తమే ప్రవహించుతూ ఉన్నదన్నమాట.

వాచాధిక్కరిస్తే సంకరజాతివాడయినట్లూ, కర్మణా ధిక్కరించినప్పటికీ సజాతీయుడైనట్లూ నిర్వచించే వీరి బుద్ధి ఎంత మట్టమయిందో ఆలోచించారా? అందుకనే చేతగాక తిట్లకు దిగారంటే ఏమాత్రం ఆగ్రహపడవలసిన అవసరంలేదు వారు.

## ౪

## సెబాసు ! కళానిధీ !!

తమకు తోచినమాట, తాము న్యాయమని నమ్మిన మాట నిర్భయంగా, నిర్మొహమాటంగా బయటికి అనాలెనంటే అందరికీ శక్తిచాలదు. చాలా ఇబ్బందీ ఉంది ఉన్నమాట అంటే ఉన్నఊరు అచ్చిరాదు గనుక.

ఎవరు ఏమనుకున్నాసరేనని కళానిధి సంపాదకులు తమకుతోచిన అభిప్రాయాలు నిర్భయంగా వెలిబుచ్చినందుకు వార్ని చాలా అభినందించవలసి ఉంటుంది.

వారు న్యాయమని నమ్ముతున్నవీ, సర్వత్రా అలాగే చెలామణీ కాదగినవీ అయిన వారి అభిప్రాయాలుఇవి.

౧ మా ఆదర్శం భాషాసేవ కాదు.

ఈమాట అందరూ అనలేరు. అంటే తమఘనత కొంచెమౌతుందని అనుకోవడంచేత. నిజానికి ఏ పత్రిక ఆదర్శమూ భాషాసేవకాదు. భాషాసేవకే అయితే రకానికి ఒకటిరెండు పత్రికలకన్న అవసరమేఉండదు. కాని ఈ మాటలతో ఇతరులు తమను సాహాయ్యంచేసేటట్లు చేసుకుంటున్న పత్రికలు.

౨ పత్రిక ఖరీదు గిట్టుబాటయ్యే ఏర్పాటు పత్రికే చూచుకుంటుంది.

ఏ పత్రిక తరఫున ప్రచారంజరిగినా అది ఆ సంపాదకుణ్ణి బట్టో దానిలో పనిచేసే ఇతరులనుబట్టో చందాదారులను చేర్పించడం జరుగుతున్నది. అనగా పత్రికకు ధనసహాయమంటే సంపాదకుడినీ, ముద్రాపకులనీ, పత్రికమీద ఆధారపడే ఇతరులనీ పోషించడం అన్నమాట, ఆమాట ఎవరూ పైకిఅనరుగాని. ఈ విధంగా పోషించబడ్డ పత్రికలు ఎక్కువకాలం నిలవడంలేదు. పోషించిన వారి ధనమంతా వృధాఅవుతున్నది.

నిజానికి పత్రికలకోసం ప్రత్యేకమైన ప్రచారమే అవసరంలేదు. దానిఖరీదు అది గిట్టుబాటుచేసుకునే

ఏర్పాటుచేయడమే చాలా అవసరం దాని వ్యాసాల విలువవల్ల. ఈ మాట అన్నందుకు సంపాదకులమీద చాలామంది ఆగ్రహపడవచ్చు వీరికింత గర్వమేమిటా అని. మాటలో పెళుసేకాని అభిప్రాయం ఉన్నతమయింది. ఈ పద్ధతివల్ల పత్రికకు స్వయంశక్తి ఏర్పడుతుంది. పత్రిక చాలా బాగానూఉంటుంది.

3 తక్కువ ఏ వృత్తిలో ఉన్నవారికైనా గంజినీళ్ళు త్రాగడాని కిన్ని పైసాలు దొరుకుతూఉంటే వ్యాసాలు వ్రాసుకుండేవాళ్ళు ఆ గంజినీళ్ళకైనా దొరకక బాధ పడడం న్యాయంకాదు.

మన ఆంధ్రదేశంలో ఎన్నో పత్రికలున్నాయి. ఒక్క పత్రికా తన వ్యాసకర్తల జీవనోపాధి విషయమయి ఆలోచించినది కనపడదు. ఏదో వృత్తిలో ఉండి వ్యాసాలుగూడా వ్రాసేవారు ఏదోవిధంగా కాలం గడుపుతారుగాని, దుర్భరమయిన ఆర్థికదుస్థితి, నిరుద్యోగసమస్య ఎదుర్కొన్న ఈ రోజులలో వ్యాసాలు వ్రాయడం తప్ప మరో పనిలేనిపండితులు, గ్రాడ్యుయేట్లు జీవనం గడపడం ఎంత దుష్కరమో ఆలోచించినవారే కనపడరు. ఈ విషయంలో సంపాదకులు సఫలీకృతులయినా, కాకపోయినా వదుగురిదృష్టిలోకీ ఈ విషయాన్ని తీసుకురావడమయినా జరుగుతుంది. ఏమో! వారి కృషిమాత్రం ఎందుకు సఫలం కాకూడదూ?

భాషావిషయకంగాకూడా వారి ఆదర్శాలు మెచ్చుకోతగ్గవే. ఇన్ని సంవత్సరాలనుంచి తీవ్ర ప్రచారం జరుగుతున్నప్పటికీ భాషా సంబంధమైన మార్పులకు ప్రబలశత్రువు లుండడం భాషయొక్క దౌర్భాగ్యమూనూ, దేశంయొక్క దురదృష్టమూనూ. తరతరాలగా భాషా సామ్రాజ్యంమీద బానిసవ్యాకరణం నిరంకుశంగా అధికారం చెలాయిస్తున్నది. వ్యాకరణానికి బుద్ధిచెప్పి దానిస్థానాన దాన్నినిలపడం తప్పక చెయ్యవలసినపని. పతంజలంతవాడుకూడా క్రొత్త మాటలు సృష్టించలేనన్నాడుట. ఆయనకు పూర్వము ఉన్న మాటలతోనే అయన వ్యాకరణం వ్రాశాడను కోండి. ఆయనకు పూర్వముఉన్న ఆ మాటలను ఎవరైనా సృష్టించారా లేక వాటంటత అవి ఊడిపడ్డవా అని ఆయన ఆలోచించాడా? గతానుగతికులయిన ఆంధ్రవైయ్యాకరణులుగూడా క్రొత్తమాట పుట్టితే చెవులు మూసుకుంటున్నారు. అంతకన్న ముక్కులు మూసుకోవడం మంచిదని మనవిచేస్తే బాగుంటుంది.

ఈ విధంగా అన్నివిధాలా ఆశయాలు అత్యున్నతాలయివెలసిన ఈ పత్రిక త్వరలో అభివృద్ధికి రావాలెనని హృదయపూర్వకంగా కోరుతున్నాము.

※

## తారతమ్యం

ఈ హిందీప్రచారోద్యమాన్ని ఇతరభాషలు నాశనమయ్యే దురుద్దేశ్యముతో గాంధిగారే ఆరంభించారని ప్రబుద్ధాంధ్ర సంపాదకులు స్పష్టంగా సెలవిచ్చారు. జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు మార్చి ప్రబుద్ధాంధ్రలో 'మాతృభాషలో బీడు పెరుగనిచ్చి, హిందీ భాష లోకమతముజేసి జాతీయత్వాన్ని పండించుకొందని మహాత్ముడు అనలేదు. కాంగ్రెసుధ్యేయాన్ని హృదయంగమం చేసుకున్నవారు ఎవ్వరూ అనలేదు...... ఇటీవల గాంధిగారేమన్నారో గమనించండి. 'దేశభాషలస్థానాన్ని ఆక్రమించుట హిందీభాష ఉద్దేశ్యం కాదు......కావున హిందీప్రచారం దేశభాషల అభివృద్ధికి అడ్డుగట్టుకాకుండ ఉండుటేగాక వానికి చేదోడై ఉండవలెను?'

ఇరువురూ ఒకరి ఉపన్యాసాలలో మాటలనే తమ తమ వాదనల సహాయార్థం తీసుకున్నారు. కాని అభిప్రాయాలుమాత్రం సరిగా వ్యతిరేకంగా ఉన్నవి. గాంధిగారి ఉద్దేశాలను విమర్శించిన ఇరువురిలో ఇంత విపరీతపు తారతమ్యం ఎందుకువచ్చింది? గాంధిగారి మాటలను సదర్భంనుంచి విడదీసి వ్యాఖ్యానంచేస్తూ సంపాదకులు గాంధిగారి మాటలకు విపరీతార్థం కలిపించారు. గాంధిగారిమీద వారికుండే అభిప్రాయమే వారిని ఈ పనికి పురికొల్పిఉంటుంది.

—'కాశ్యపి'



# లవంగ

లవంగమని లవంగమొగ్గయని పిలువబడునది ప్రతివారికి తెలిసిన సుగంధద్రవ్యం. సువాసనకైతేనేమి వైద్యగుణములకైతేనేమి లవంగములు విరివిగ వాడబడుచున్నవి. మన పురాణగాథలలోనే యారణ్యములో చూచినా కానవగు లవంగము నేడు నిజంగా చాలా అరుదుగా పండింపబడుచున్నది. లవంగవృక్షమున్నూ, యూకలిప్టస్ వృక్షమున్నూ 'మిర్ టేసీ' యను వంశమునకు చెందినవే. అందుచేతనే రెండును ఒకేమాదిరి వాతావరణములో వృద్ధియగును. లవంగవృక్షము సరుగుచెట్టువలె కొనదేలి సన్నగ పెరుగును. సామాన్యపు ప్రమాణము 30-40 అడుగులు. కాని పెరుగుట చాల నెమ్మది. లవంగవృక్ష ఆయుఃప్రమాణము 75 యేండ్లు.

లవంగము అనాదిగ 'మొలక్కా' దీవులకు చెందినదని తలంచబడుచున్నది. అచటనుండి అది క్రమేణ ప్రాకిపోయినది. నేడు లవంగమును పండించు దేశములలో జాంజిబార్, పెంబా ద్వీపములు ముఖ్యములు. లోకమంతటను సప్లయి చేయు ప్రదేశములు ముఖ్యముగా నివియే. దక్షిణయిండియాలో తిరునెల్వేలి జిల్లాలోనూ, నీలగిరుల దక్షిణపు పాదములందును లవంగములు పండింపబడుచున్నవి. 2500 అడుగులయెత్తులోపున యీ వృక్షములకు తగిన వాతావరణము లభించుటచే కొండ ప్రదేశములలో నివి మెండు.

## పంట

సరుగుచెట్లకువలెనే లవంగమునకు యిసుకనేల ప్రీతి. సాలునకు 120 దుక్కుల వర్షము పడు ప్రదేశములలోగాని లవంగము అభివృద్ధికాదు. లవంగ గింజలను ముదిరినవెంటనే నాటవలసియుండును. నాటుటకు తరుణము వచ్చినట్లు గుర్తు ఆగింజపైచర్మము ముదురుపై నేరేడుపండు రంగునకు తిరుగును. చుట్టుపట్లలందు అనగా కొన్నిగజముల మేరలో చెట్లులేకుండ తోటలో ఒక ప్రదేశమునుచూచి, అందు 1 అడుగునకు మించునట్లు త్రవ్వటముపెట్టి, అనగా గడ్డతిరుగవేసి, చదును చేసి నారుమడి యేర్పరచవలయును. తోట మన్ను కొద్దిపాటి యిసుక ఆకు యెరువులతో యీ నారుమళ్లు సిద్ధముచేయబడును. మడివెడల్పు 4 అడుగులకు మించియుండరాదు. కానిచో నీరు జల్లుటయందు ముందు ముందు కష్టమనిపించును. మడి పొడవు పాతునట్టి గింజలసంఖ్యను బట్టియుండును. మడిపైన పలుచని పందిరి వేయవలయును. పందిరి పాగులకు నీడనిచ్చుటకైయే. గింజలు నాటినప్పటినుండియు పాదులు చెమ్మగలిగియుండవలయునేగాని, అందు నీరు నిల్వయుండరాదు. మొక్కలు మొలుచుకొని వచ్చులోపల 5-6 వారములు పట్టును. అంతట పైనవేసిన చలువపందిరి కప్పును పలుచనచేసి మొక్కలకు ఎండతగులనీయవలయును. సూర్యరశ్మి చాలినంత లేకపోయినచో మొక్కలు సన్నముగను బలహీనముగను పెరుగును. నారు మొక్కలు 6 అంగుళములు పెరిగినప్పుడు వానిని ప్రత్యేకముగబుట్టలోనికిగాని, లేక మట్టిముద్దలతోగాని అంట్లు తయారు చేసిన విధమున పెట్టి వర్షాగమమునకై యెదురుచూచుచుందురు.

3 అ. పొడవు, 3 అ. వెడల్పు, 3 అ. లోతు గలిగిన, 20 అడుగుల దూరమున కొకటి వంతున గుంటలు త్రవ్వుదురు. ఈనేల సారహీనమైనదని తోచు నెడల సగము గుంట దానిలో తీసినమన్నుతోడను పైసగమును బాగుగా యెరువుకలసియుండి సారవంతమైన మంటితోడను యీగుంటలను పూడ్చి పాదులేర్పరుతురు. జూన్-జూలై నెలలందలి నైఋతి ఋతుపవనమునందు నారుమొక్కలను పాదు కొకటి వంతున పై చెప్పబడిన పాదులలో నాటెదరు. అప్పటి నుండియు మొక్కలకు ఆరకుండ నీరు పోయుచుండవలయును మొక్కలు మూడడుగులైనను పెరుగువఱకు వానికి నీడవసతి బాగుగ కావలసియుండును. పిమ్మట వారమున కొకసారి సరిపోవును.

లవంగయొక్క విశేషమేమన, యిది పండ్లతోటలలో చెట్టుచెట్టునకు మధ్యను పెంచనగును. లవంగ వృక్షము ప్రక్కలకు వ్యాపించదు. అందుచే దానిని యితర వృక్షములతో పెంచుట అరుదుగాదు, కాని మిశ్రమపంటల విషయమున నీటి విషయమై ప్రత్యేకమగు జాగ్రత్త వలయును. ప్రత్యేక లవంగతోటలో వృక్షములమధ్య పచ్చియెరువుగా, జనుము మొదలగు పంటలను పండించవచ్చును. పచ్చియెరువు పంటలవలన నేల చెమ్మ కాపాడుకొనుటకే గాక, వర్షకాలమున నేల కోతబడకుండ కాపాడుకొన వీలగును.

లవంగవృక్షము పంటకువచ్చునప్పటికి 10-15 యేండ్లు పట్టును. అత్యధికమగు పూత చెట్లు యౌవనమునందున్నపుడు లభించును. 75 యేండ్లపాటు జీవించగల లవంగవృక్షమునకు యౌవనము 20-వ యేటనే ప్రాప్తించును. అప్పుడే సుమారు చెట్టునొక్కటికి 10 పౌనుల ఎండిన లవంగమొగ్గ లభించును. తిరునెల్వేలి జిల్లాలో లవంగపంట 1500-2000 పౌనులని అంచనా వేయబడినది. మద్రాసు వ్యవసాయ డైరెక్టరువారు, అంతపంట రాబడి యుండదనియు, యితరదేశపు ఆదాయములను బట్టి చూచినచో అది 800-1000 పౌనులకు మించదనియు అభిప్రాయమిచ్చి యుండిరి.

లవంగపంట తయారుచేయుట యీక్రింది విధమున జరుగును. మనముపయోగించు లవంగము నిజమునకు లవంగ పూమొగ్గలే. పూమొగ్గలు యెఱ్ఱయెఱ్ఱని రంగు తాల్చుచున్నపుడు వానిని చెట్లనుండి గిల్లుదురు. ఈపని సామాన్యముగ వర్షములేక పొడియెండ కాయు సమయమున జేయబడును. ఈ లవంగ మొగ్గలను పిమ్మట చాపలపై పలుచగపోసి యెండబెట్టెదరు. మంచి యెండలో వారము దినములలోనూ, మసుగుగా నున్నచో మరినాలుగైదు దినములలోనూ లవంగములు బాగుగా నెండును. రాత్రులందును మబ్బులుగాని వర్షముగాని పట్టిన సమయములందును, వీనిని పాకలలో గాలితగులుచుండునట్లు చూచి ఆరబోయుదురు. కొన్ని దేశములలో సూర్యరశ్మికి యెండబెట్టుటకు బదులు సెగవలన ఎండించు నూతన పద్ధతి నవలంబింతురు. పుగాకు ఆవిరి కొట్లలో యెండబెట్టబడినట్లే యీ లవంగముల గూడ సెగవలన ఆరబెట్టబడును. ఇట్లు సిద్ధము చేయబడిన లవంగము మంచిరంగు గలిగియుండి కంటికి నచ్చియుండును. పచ్చిలవంగములు ఆరునప్పటికి నూటికి 60 భాగముల బరువు తగ్గిపోవును. ఈ ఎండిన లవంగమొగ్గయే మన బజారు లవంగము.

శ్రేష్ఠమైన లవంగములు పౌను సుమారు రు 1 అమ్ముగలదు. ఎకరము లవంగతోటలో 150 చెట్లును, చెట్టునకు 7-8 పౌనులని లెక్కించే యెడలపై లెక్కప్రకారము రు 1050 నుండి రు 1200 వఱకు గడింపవచ్చును మొదట పది సంవత్సరములకు ఎకరము ఒకటికి ఖర్చు ఒకటిన్నరవేలున్నూ, పిమ్మట ప్రతి సంవత్సరమునకు కూలినాలిక్రింద ఖర్చు వందరూపాయలున్నూ పోగా మిగిలినది తోటయజమాని లాభము.

లవంగ గింజలును మొక్కలును కావలసిన నీలగిరుల జిల్లాలోని బర్లియర్ ఫల పరిశోధనాలయమున లభించును.

—జాగు గోపాలరావు.




# గురువును మించిన శిష్యుఁడు

పూర్వ మొక నృపాలుఁడు దురదృష్టవశమున రాజ్యభ్రష్టుఁడై యశేష వసనములకుఁ గొఱతపడియుండెను. తన యిరువురు పుత్త్రిలు విద్యాభ్యాసము లేకయుండు టాతనికి మఱింత వ్యసనకారణమయ్యెను.



ఒకనాఁ డతఁడు తన కుమారుల నొక పేరెక్కిన విద్వాంసునికడకుఁ గొనిపోయి యాతనికి దన దీనస్థితిని దెలిపెను తాను బీదఱికముచే కుమారులకుఁ జదువు చెప్పింపఁజాలకుండెననియు, తన యిద్దఱు పుత్రులకు విద్యగఱపి యందొకని గురుదక్షిణగాఁ గైకొమ్మని ప్రార్థించెను. విద్వాంసుఁ డందులకు సమ్మతింప నారాజు తనకొమరుల నిరువుర నాతనియొద్ద నుంచి యింటికి మఱలెను.



విద్వాంసుఁ డా రాజపుత్రులకు విద్య నేర్ప మొదలిడిన కొలఁది దినములకే యందుఁ బెద్దవానికంటెఁ జిన్నవాఁడు మిగుల సూక్ష్మగ్రాహియని యతఁడు నిశ్చయించుకొనెను. అప్పటినుండి యతఁడు పెద్దవానిచే దనకుపచారము చేయించుకొనుచు, జిన్నవానికి శ్రద్ధగాఁ జదువు సందెలు నేర్పుచుండెను. జ్యేష్ఠపుత్రునే యారాజు కోరుననియు, దాను రెండవవానినే యుంచుకొనుటయే జరుగుననియు నతఁడు మనస్సున సంతసించుచుండెను.



అంత నొకదివసమున రాజు తనకొమరు లెంతవఱకు విద్యనభ్యసించిరో యరయ విద్వాంసుని వద్ద కేగెను. ఆతని రాక ముందుగనెఱింగి జ్యేష్ఠకుమారునికి మంచి దుస్తుల నలంకరించి పై తరగతి విద్యార్థులతోఁ జేర్చి కూర్చుండఁ బెట్టెను. ద్వితీయ పుత్రునిచేఁ జినిగిన వస్త్రముల ధరింపఁజేసి క్రిందితరగతిలో బాలురలో నుంచెను.

రాజును జూడఁగనే గురువు, 'మీపుత్రు లిద్దఱకును విద్య పూర్తియైనది. కాని మీ పెద్దకుమారుఁడు చాల సూక్ష్మబుద్ధిగలవాఁడు. రెండవవాఁడు మందమతి. మీకులమునకు జ్యేష్ఠపుత్రుఁడు పేరు దేగలవాఁడు; మీ రిందెవరిని దీసికొనిపోవ నెంచెదరో వచింపుఁడ'ని యడిగెను. గురువు దురుద్దేశ్యమును గనిపెట్టి చిన్నవాఁడు తననే యెన్నుకొమ్మని తండ్రికి సంజ్ఞచేసెను. గురువు నుడువులందలి మర్మమును గ్రహించి రాజాతనితో వినయముగ నిటులనెను, 'కర్మకు బాధ్యుఁడగు జ్యేష్ఠునే దీసికొన నాయభిప్రాయమే యైనను జిన్నవానిపైఁ దల్లికి మిక్కుటమగు ప్రేమయగుటచే నామె యింకాతని విడిచి యుండలేక తోడ్కొనిరమ్మని నన్ను పోరుచున్నది. చిన్నవానినే నాకు దయచేయుఁడు. మాయదృష్ట మెట్లున్న దట్లు జరుగును.' గురువందులకు విధిలేక సమ్మతించెను.' తన కాశాభంగము కలిగించిన చిన్నవానిపై గసితీర్చుకొన గురువు తరుణమునకై వేచియుండెను.

రాజు తన చిన్నకుమారునితో స్వగ్రామమున కేగుచు మార్గమున నొక పట్టణము



చేరిరి. 'మేలైన కోడిపుంజు నెంతవెలయైన యిచ్చి కొందుమ'ను చాటింపు వారికచ్చట వినిపించెను. రాజకుమారుఁడంతఁ దండ్రితో, 'నేను చక్కని కోడిపుంజు నయ్యెదను. నన్ను రెండువేల రూప్యములకు విక్రయించుము. కొద్ది దినములకు నేను మనుజరూపమును బొంది యింటికివత్తున'ని చెప్పి కుక్కుట రూపము దాల్చెను రాజు దానిని విక్రయమునకుఁ జూపగా, చాటింపుగావించిన ప్రభువు దాని సౌందర్యమునకు సంతసించి క్రయమునిచ్చి తీసికొనెను. రాజా పైకముగొని గృహంబున కేగిన రెండుదినములకు దన చిన్నకొడుకు తనను చేరికొనెను.

కొంతకాలమున కీధనము వ్యయమయిపోగా, కుమారుఁడు తండ్రితో నిటులనెను, 'నేను పంచకళ్యాణి గుఱ్ఱముగ మాఱెదను. నన్నెవరికైనఁ పదివేల రూప్యముల కమ్ముము. పిమ్మట నాలుగు దినములలో నిన్ను చేరుదును.' తోడనే



యతఁ డశ్వముగ మాఱఁగ తండ్రి యద్దాని నాదేశపాలకునకు దాననుకొనిన ధనమున కమ్మివేసెను. ఆ హయముయొక్క సౌందర్యము, వేగము జనుల కచ్చెరువు గొల్పుచుండ నావృత్తాంతము గురువు



విని యది రాజకుమారుని మాఱువేషమేయని గ్రహించెను. అతఁడు పాలకునివద్దకు వెడలి, 'ఇది సాధుజంతువుగఁ దోచుట లేదు. కొన్నాళ్లు క్రమశిక్షయం దుంచినగాని దాని నెక్కుట ప్రమాదకరము. నా కొప్పగించినచో వారము దినములలో దీనిని సాధువునుజేసి యిచ్చెదన'ని చెప్పెను. పాలకుఁ డందుల కియ్యకొన గురు వా హయము నెక్కి మునుపటి క్రోధము తీర్చుకొనుటకై కడవులు గుట్టలు స్వారిచేసి దాని నానావస్థలు పెట్టెను.

తన్ను స్వారిచేయుచున్న రౌతు గురువేయని రాజకుమారుఁడు కనిపెట్టి, గుఱ్ఱపు కళేబరమును వీడి యచ్చట చచ్చిపడియున్న చిలుక దేహమున దూరి పారిపోసాగెను. వెంటనే గురువు డేగగ మాఱి చిలుకను వెంబడించెను. చిలుక యొక రాజకుమార్తె చేతిపై వ్రాలగా నామె డేగనుఁ బారఁదోలి చిలుకను మిగుల ప్రేమతో బెంచుచుండెను. అంత నొకసమయమున చిలుక రాజకుమారునిగ మాఱి యామెమ్రోల నిలువఁబడెను. ఆతని సౌందర్యమును జూచి యామె యాతని వివాహమాడ నిశ్చయించుకొని తల్లిదండ్రులతో నామె కోర్కె నచించుటకుఁదగిన సమయమునకు వేచియుండెను.







గురువు దొమ్మరసాని రూపమునుఁ దాల్చి రాజకుమార్తె మేడచెంత నామె తండ్రి సమక్షమునఁ దన విద్యజూపి యాతని మెప్పువడెసెను. 'నీవేమి కోరిన నిచ్చెద'నని యతఁడు పలుక, నామె రాజపుత్రిక వద్దనున్న చిలుక కావలెననెను. అతఁడు చిలుక నీయుమని కుమార్తెకు వర్తమానమంప యామె మిగుల విచారించుచుండెను. 'తమకంఠము నులిమి పారవేసిన యెడల తానామె ముత్యాల హారమున జొత్తు'నని యామెకుఁజెప్పి యోదార్చెను. రాకొమరితయు నట్లుచేసి, చనిపోయిన చిలుక నంపెను.



పిమ్మట నాదొమ్మరిసాని రాజపుత్రిక కంఠహారము నీయ వేడెను. కంఠహార మొసఁగుమని కబురురాఁగా, రాజకుమారుని సలహాపై నామె హారమును త్రెంపిపారవేసెను. తోడనే యందలి ముత్తెములు పురుగులుగ మాఱి యటునిటుఁ బ్రాకుచుండెను. తత్క్షణము దొమ్మరసాని కోడిరూపమునుఁ బొంది యాకీటకముల మ్రింగుచుండెను. బ్రదికియున్న పురుగులు మార్జాలకృతినిఁజెంది కుక్కుట కంఠమును బట్టెను. అంత నాకోడి 'ప్రాణములు దక్కించుమ'ని బిడాలమును వేడుకొనెను.



ఇదియంతయుఁ జూచి సభ్యు లాశ్చర్యపడి కుక్కుటమార్జాలములవలన వారి వృత్తాంతమునుఁ దెలిసికొని గురువును నిందించిరి. గురువు సిగ్గుపడి తనవద్దనున్న రాజకుమారునిగూడఁ దండ్రి కప్పగించెను.

ఆదేశాధీశుఁడును దనకుమార్తెకుఁ దగిన వరుఁడు లభించెనని సంతసించి వైభవముగ వారిరువురకుఁ బరిణయము గావించి యల్లునకుఁ దన యర్ధరాజ్యము నొసంగెను.



ఆంధ్రభూమియందు ప్రప్రథమమున స్థాపింపబడిన

# ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ,

## లిమిటెడ్

ప్రధాన కార్యస్థానము :— బెజవాడ. స్థాపితము 1929.

మేనేజింగు డైరెక్టరు :

మ-రా-రా-శ్రీ దిట్టకవి వీరరాఘవయ్యపంతులుగారు.

స్వల్ప ప్రీమియములు. నవీనపద్ధతులు.

ఏజంట్లకు ధారాళమైన కమీషన్ యియ్య బడును.

ప్రత్యేక సౌకర్యములు.

1. స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియం రేట్లు.
2. రు 100 లు మొదలు రు 500 ల వరకు పట్టాలు జారీచేయబడును,
3. వైద్యపరీక్ష లేని భీమాపద్ధతులు,
4. క్లెయిములు గ్యారంటీ చేయబడినవి,
5. పట్టాదారులకు ఋణము లియ్యబడును,
6. జననభీమాలో నెలకు 1 రూ. లేక 2 రూపాయలు ప్రీమియం చెల్లించిన రు 500 లు లేక రు 1000 ల వరకు క్లెయిమును పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిములు యియ్యబడును.
7. ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషలో జరుపవచ్చును.
8. పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరమునగు సేవయే ఆదర్శము.

జననభీమా శిశు పోషణకు గొప్ప సహాయకారి.

పూర్తి వివరములకు :

సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్.

ఆంధ్రప్రావిడెంటుకంపెనీ,

గాంధినగర్, బెజవాడ.

ఆంధ్రభూమి ప్రకటనలు

# ది స్టార్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రియల్ అండ్ జనరల్ అస్యూరెన్సు కంపెనీ, లిమిటెడ్

8, తంబుచెట్టివీధి, మదరాసు.

## అభివృద్ధి

| | | |
|---|---|---|
| చేరిన వ్యాపారము | రూ | 27 లక్షలు. |
| చెల్లించిన క్లెయిములు | ,, | $2\frac{1}{2}$ లక్షలు. |
| సంవత్సరాదాయము | ,, | 3 లక్షలు. |

"కంపెనీ నిర్వహణ చాకచక్యమునకు కంపెనీవారిని ప్రశంసింపక తప్పదు. ప్రస్తుతపు పాలసీదారులు, రాబోవు పాలసీదారులు కంపెనీ పరిస్థితులకు గర్వించ వలసిన అవకాశము కలదు" అని ఆక్చ్యుయరీ కె. బి. మాధవగారు ప్రశంసించి యున్నారు.

ధారాళమైన కమీషను, వేతనముపై పలుకుబడిగల ఏజెంట్లు కావలెను.

యమ్. యస్. ఆర్. ఎ. గుప్త, మేనేజింగు ఏజంటు.

# గోలకొండపత్రిక

దాదాపు అరువదిలక్షల ఆంధ్రులకు నెలవును, అనేకాంధ్రసంస్థానములకు ఉనికిపట్టును అగు నిజామురాష్ట్రమునందు విశేషప్రచారముగల ద్వైవారపత్రిక. ప్రతి సోమగురువారములందు ప్రకటింపబడును. వ్యాపారప్రకటనలకు అనువైనది.

సాలుచందా రు 6. ఆరుమాసములకు రు 3. విడిపత్రిక ఒకఅణా.

# గోలకొండకవులసంచిక

50 చిత్రపటములతో, 354 కవులరచనములతో నిండారిన 450 పుటలుగల ఉత్తమసంచిక. బహుభాషావిదులు, ఆంధ్రభాషాసేవకులు అగు శ్రీసురవరము ప్రతాపరెడ్డిగారి ప్రజ్ఞాపరిశీలనమున వెలువడినది. సర్వాంగసుందరము—ఆనందకందము, గ్రంథాలయములకు అమూల్యాలంకారము.

గోలకొండ చందాదారులకు ఒక్కరూపాయి—ఇతరులకు రెండురూపాయిలు, టపాఖర్చులు పది అణాలు ప్రత్యేకము.

చిరునామా:

గోలకొండపత్రికాకార్యాలయము, తూర్పుబజారు, హైద్రాబాద్, (దక్కన్).

## ౨. పేద బ్రాహ్మణుఁడు

ఒకయూరిలో నొక బ్రాహ్మణుఁడుండెను. అతఁడు చాల బీదవాఁడు. అతఁడు కుటుంబపోషణకు వలయు ధనము నార్జింపలేకుండెను. ఇంటనున్న నగలను, పాత్రలను, ఇతర సామానులను క్రమక్రమముగా అమ్మివేసెను. పరదేశములకుపోయి డబ్బు సంపాదించమని భార్య పోరగా నతఁడొప్పుకొనెను. ఆమె మెడలోని మంగళసూత్రము నమ్మివేసి వచ్చినడబ్బుతో గారెలను వండి భర్త మార్గమున తినుటకు మూటగట్టి యిచ్చెను. బ్రాహ్మణుఁడు ప్రక్కదేశమునకు బయలువెడలెను.

అతఁడొక చిట్టడవిగుండ పోవుచుండఁగ నొకయెలుక కనఁబడెను. 'నాకు ఆకలివేయుచున్నది; ఒకగారె యిచ్చెదవా?' అని అది బ్రాహ్మణుని అడిగెను. అతఁడు దాని కొక గారెనిచ్చెను. దానిని ఎలుక తిని, 'ఎలుకవలె త్రవ్వుచున్నాడు అని అనుకొనుచు వెళ్ళుము. నీకు శుభముకలుగును' అనిచెప్పెను. అతఁడు ఎలుక చెప్పినట్లే యనుకొనుచు పోవుచుండెను.

కొంతదూరము పోవుసరికి వాని కొకకుందేలు కనిపించి యొకగారె నిమ్మనియడిగెను. బ్రాహ్మణుఁడు దాని కీయగా కుందేలుతిని, 'కుందేలువలె కూర్చున్నాడు అనుకొనుచు పొమ్మ'నెను. అంత నతఁడు 'ఎలుకవలె త్రవ్వుచున్నాడు; కుందేలువలె కూర్చున్నాడు' అనుచు వెళ్ళుచుండెను.

అటులనే మార్గమధ్యమున నతనికి తాబేలును లేడియు కనిపించెను. వానికిని అతఁడు గారెల నిచ్చెను. 'తాబేలువలె తారుచున్నాడు' అనుచుపొమ్మని తాబేలు చెప్పెను. 'లేడివలె పరుగెత్తుచున్నాడు' అనుచు వెళ్ళుమని లేడి సలహాయిచ్చెను. అంతటినుండి యతఁడు 'ఎలుకవలె త్రవ్వుచున్నాడు; కుందేలువలె కూర్చున్నాడు; తాబేలువలె తారుచున్నాడు; లేడివలె పరుగెత్తుచున్నాడు' అనుకొనుచు పోవుచుండెను.

చీకటిపడుసరికి బ్రాహ్మణుఁడొక గ్రామము చేరుకొనెను. అచ్చట రాజగృహమును చేరి విశాలమగు అరుగుపై నతఁడు పరుండెను. తాను తెచ్చిన యాహారములో నేమియు మిగులకపోవుటచే అతఁడు ఆకలిచే బాధపడుచుండెను. అతనికంటికి నిద్దురవచ్చుటలేదు. మార్గమధ్యమున తనకు కనిపించిన జంతువుల యుపదేశవాక్యములను పఠించుచు కూరుచుండెను.

అంతట ఒకదొంగ రాజగృహమున కొకప్రక్క కన్నము వేయుచుండెను. దొంగకు బ్రాహ్మణుడు పఠించుచున్న వాక్యములు వినబడి నివ్వెరపడి నల్గడల చూచెను. ఎవ్వరును కనబడకపోవుటచే నతఁడు కొంతసేపు కన్నము త్రవ్వుచుండెను. మరలమరల బ్రాహ్మణుని వాక్యములు వినవచ్చుటచే భీతిజెంది నాటి కింటికి మరలిపోవ నతఁడు నిశ్చయించుకొని త్రవ్వుటమానివేసి కూర్చుండెను. అంతట, 'కుందేలువలె కూర్చున్నాడు' అనుమాటలు వినబడెను. ఇంక అక్కడనుండిన ప్రమాదము కలుగుననియెంచి మెల్లగ తారుచుండెను. 'తాబేలువలె తారుచున్నాడు' అనువాక్య మతనిచెవుల బడెను. ఎవ్వరో తన్ను చూచుచున్నారని నిశ్చయించుకొని భీతిల్లి పరుగిడసాగెను. అంతట, 'లేడివలె పరుగెత్తుచున్నాడు' అనువచనము వినగా దొంగ మఱింతవేగముగ పరుగెత్తసాగెను.

ఈ లోపుగ బ్రాహ్మణుఁడు మరలమరల యనుచుండిన వాక్యములనువిని రాజభటులు లేచి చూచిరి. దొంగ పరుగెత్తిపోవుటచూచి యాతని వెంబడించి పట్టుకొని రాజుకడకు తెచ్చిరి. వారాతనిని బ్రాహ్మణుని వాక్యములవలన పట్టుకొనగల్గితిమని రాజునకు చెప్పిరి.

దొంగచేతులనుండి తన ధనమును కాపాడిన బ్రాహ్మణుని రప్పించి యతనికి రాజొక గ్రామమును బహుమానమొసంగెను. కుటుంబపోషణకు తగిన యాధారము నిచ్చినందులకు బ్రాహ్మణుఁడు రాజునకు కృతజ్ఞత చూపెను. అప్పటినుండి భార్యాపుత్రాదులతో నా బ్రాహ్మణుఁడు సుఖముగ జీవించుచుండెను.

—కొప్పర్తి నారాయణమూర్తి, బి.ఏ; యల్.టి.

# విమానం సరదా

అరణ్యాలమధ్య ఉన్న యీ పల్లెగ్రామానికి దొరలెవరో విమానంమీద వస్తున్నారని తెలియరాగానే, పురజనులలో ఒక విధమైన ఆరాటం, ఆందోళన, ఉత్సాహం బయలుదేరాయి. ఫిబ్రవరి 26 తేదీని పగలు పది పన్నెండుగంటల మధ్య భద్రాచలంలో ఎయిరోప్లేన్ దిగుతుందన్న వార్త ఎక్కడెక్కడి కోయగ్రామాలకు కూడా మంటవలె గుప్పున వ్యాపించింది. ఎవరి నోటంట వినినా విమానం కబుర్లే! ఎవరి మొగం చూసినా, 'విమానం చూడబోతున్నాను,' అనే గర్వానంద సూచనలే! అవును, యీ అనాగరికగ్రామంలో, అమాయకులైన అడవిమనుష్యులకు విమానదర్శన మొక మహాభాగ్యమే. రాముడు వసించే పుణ్యభూమి గనుకనే యీ భద్రాద్రికి ఎయిరోప్లేన్ దర్శనయోగం నేటికైనా పట్టనున్నదని యిక్కడి పూజార్ల జయవాదన! విమానాలు దైవనిర్మితములనీ, వాటిని ఎక్కేవాళ్ళు కేవలం దేవతాసమానులనీ, పామరులలో అనేకుల నమ్మకం. పదేళ్ళక్రిందట (1925-వ సం॥ లో) సర్ ఏలన్ కాబ్ హామ్ అనే ఆంగ్లేయవైమానికుడు ఆఫ్రికా మీదుగా ఎగురుతూఉన్నప్పుడు, కొన్నికొన్ని పల్లెలలో అక్కడి జనులు కత్తులు, బల్లెములు పట్టుకొని మూగేవారట విమానం వ్రాలేచోట—మేఘాలలో నుండి భూమిమీదికి ఊడిపడే ఆ తెల్లమనుషులు తమకు హానిచేయ్యడానికి వచ్చిన దెయ్యాలో, జంతువులో, యింద్రజాలికులో, రాక్షసులో, ఎవరో అని! అమాయకులగు యిక్కడి కోయలు ఆఫ్రికానీగ్రోలవలె వైమానికులను రాక్షసులనీ, భూతాలనీ ఎదిరించక, మూఢభక్తితో దేవతలుగా భావించి పూజించడం కొంత వరకు నయమే!

'ఈ ఊరు పావనం అవుతుంది, ఆదొరల ధర్మమా అని,' అన్నాడు చదువుకున్న నామిత్రుడొకడు, నిజమే అనిపించింది నాకున్నూ, కొంత యోచనపైని. ఈ కోయలు, ఏజెన్సీవాసులు మరొక విధంగా విమానాన్ని చూసేదెట్లా? మళ్ళీ యిట్టి అవకాశం ఎప్పుడు లభిస్తుంది వాళ్ళకు? నాగరికతనుండి దూరంగా విసిరివేయబడియున్న యీ మన్యస్థలవాసులకు కొందరికి రెయిలుబండీ అంటేనే తెలియదు! ఇక్కడి హైస్కూల్లో చదువుకునే కొందరు పెద్దక్లాసు విద్యార్థులు సహితం రెయిలుబండీ అన్నా, సముద్రం అన్నా, తెల్లమొగాలు వేసిచూస్తారు. అట్టి దండకారణ్య వాసులకు ఎయిరోప్లేన్ దర్శనమంటే నిజంగా సామాన్య విషయంకాదు. మతిని చలింపజేసే అద్భుతానుభవమన్నమాట! జీవితమును ధన్యమొనర్పగల మహాయోగము వంటిది!............

పోలీసులు, ఫారెస్టు వాళ్ళు కూడి, ఊరుకు తూర్పున ఉన్న యిప్పసారా డిస్టిలరీకి సమీపంలో నేల సదునుచేయించారు, విమానంవచ్చి వ్రాలడానికి. ఆ రాబోయేదొరలు అడవులకు సంబంధించిన పెద్ద ఉద్యోగస్తులట! హడావిడిపడి కూలీలచేత తుప్పలు, పుట్టలు కొట్టించి, రాళ్ళురప్పలు పెరికించి, దిబ్బలు త్రవ్వించి, గోతులు పూడ్పించి, ఎత్తుపల్లాలు లేకుండా యించుమించు 500 గజాలమేర ఆవరణ తయారుచేయించారు రేంజర్లు. దానికి తూర్పువైపున ఒకటి, పడమరవైపున ఒకటి, రెండు గుడారాలు వేయించారు. ఆవరణయొక్క సరిహద్దులు యింకా వివరంగా తెలపడానికి చుట్టూ తెల్లవి, ఎర్రవి, గుడ్డజెండాలు పాతించారు. మొత్తానికి వావిలి డొంకలతోను, ముళ్ళతుప్పలతోను పాడుపడియున్న స్థలాన్ని అందమైన మైదానంగా మార్చి, కలకలలాడునట్లు చేయగలిగినారు.

నాడు మంగళవారం. స్కూలుకు సెలవుదినం కాదు. మర్నాడు మాస్టర్లు శిక్షించినా సరేనని, బడి పిల్లలు కొందరు స్కూలు ఎగవేసి, విమానం చూద్దామన్న సరదాతో మైదానం వద్ద కాచుకొని కూచున్నారు సుమారు 10 గంటలనుండి. క్రమంగా ఊళ్ళోవాళ్ళు, చుట్టుపట్ల గ్రామాలనుండి వచ్చిన గొల్లలు, కోయలు, పిన్న, పెద్ద, అందరూ విమానం దిగే స్థలానికి సమీపంలో ఉన్న చెట్లక్రింద, తుప్పల నీడను, గట్ల

పాటున, గుంపులు గుంపులుగా చేరుకున్నారు. విమానం నుండి దిగేవారిని ఆహ్వానించడానికి ఊళ్ళో ఉన్న పెద్దలు, ఉన్నతోద్యోగస్థులు బళ్ళమీద, మోటార్ల మీద పదిన్నర గంటల సరికల్లా హాజరయినారు. మైదానం జనంతో నిండింది. ఎండవేడిమికి నెత్తి, కాళ్ళు, కాలుతూ అవస్థపడుతున్నారు అందరును. చుట్టుప్రక్కల ఎక్కడా మంచినీళ్ళయినా దొరికే అస్కారం లేదు. కాని విమానం చూదామన్న కుతూహలంలో జనులు యీ యిబ్బందులను వేటినీ లెక్క చెయ్యలేదు.

11 గంటలకు యింకా పదిహేనైదు నిమిషాలు ఉన్నదనగా ఊరుకు దక్షిణంవైపున జువ్వున చప్పుడు వినవచ్చింది. 'అదిగో, అదిగో!' అని గొల్లుమన్నారు జనులు. అంతరిక్షాన విమానం క్రమంగా దగ్గిరికి వచ్చి గడబిడధ్వనితో బుర్రున డిస్ట్రిక్టు వైపు ఒరుగుతూ లేస్తూ వడిగా సాగింది. తయారు చేయబడిన సదును స్థలంమీదుగా తాటిచెట్టు యెత్తున గ్రద్దవలె గాలిలో ఒకసారి ప్రదక్షిణంచేసి, ఊగుతూ రాబందువలె నెమ్మదిగా భూమిపైవ్రాలి, ముందుచక్రాలమీద శరవేగంతో కొంతదూరం పరుగెత్తి, నిల్చింది ప్లేను, జనులుమూగిన వైపున్న డేరాకు మిక్కిలి దగ్గిరగా. చూడడానికి వచ్చిన జనులు సంతోషంతో కిలకిలలాడుతూ విమానం చెంతకు జరిగారు.

విమానసారధి ఎవరెట్ అనే అజానుబాహువైన తెల్లదొర, విల్సన్ దొరగారు, వారి సతీమణి, బెనర్జీ గారు—వీరు ముగ్గురే విమానంనుండి దిగిన ప్రయాణీకులు.

కొన్ని నిమిషాలవరకు మైదానమొక పెండ్లి పందిరివలె కోలాహలంతో ప్రతిధ్వనించింది—మాటలు, కేకలు, విమానం ముచ్చట్లు, నవ్వులు, పలకరింపులు, కుశలప్రశ్నలు, మొదలైనవాటితో. చుట్టూ మూగిన జనం ప్లేనును సమీపంనుండి చూడడంతో తృప్తిపడక, దాన్ని తాకి, నాలుగువైపులా పరీక్షించి, అన్నీ శోధించి, దానిని గురించి వ్యాఖ్యానాలు ప్రారంభించారు. 'మీద పడి బండిని తాకవద్దు. ఎడంగా జరగండి!' అని పోలీసుల మందలింపులు జనుల కోలాహలాన్ని మించి, అప్పుడప్పుడు వినవచ్చేవి.

విమానాన్ని గూర్చి ఎవరికి తోచిన విషయాలు వాళ్ళు యేకరుబెట్టేవారు. నిజంగా దానిసంగతి తెలిసినవాళ్ళు కొందరు, పుస్తకాలలో చదువుకున్న ముక్కలవలన అంతో యింతో గ్రహించుకున్నవాళ్ళు కొందరు, కేవలం తమ ఊహాశక్తి మీదనే ఆధారపడి అన్నీ తెలిసినట్లు గోతాలు కోసేవాళ్ళు కొందరు,—అన్నిరకాలవాళ్లు ఉన్నారు ఆమూకలో.

పొట్టకూటికి యీ అడవిఊళ్ళో చిక్కుకొని, రెయిలుకూత వినడానికైనా నోచుకోక, మనో తనువులను ఏజెన్సీ గాలిలో హారతికర్పూరంవలె హరింపజేసుకుంటూ, జీవితోత్సాహాల నణచుకుంటూ, నాగరికతకు నూతనానుభవాలకు దూరమై, ద్వీపాంతరవాసఖైదీవలె నిరుత్సాహ జీవనం గడుపుతూ ఉన్న నాకు మాత్రం ఎయిరోప్లేన్ చూడడమంటే సరదాకాదూ! బొమ్మలలోను, సినిమాలలోను తప్ప నేనిదివరలో విమానం చూసిఉండలేదు! విమానాలగూర్చి నాకు అడవిమనుష్యులవలె విపరీతాభిప్రాయాలు, మూఢనమ్మకాలు లేకపోయినా, మానవుడు పిట్టవలె గాలిలో తేలుతూ ఎగరడమనే అద్భుతవిషయం ప్రత్యక్షంగా చూసి ఆనందించవలెనన్న కుతూహలం మాత్రం మెండుగానే ఉండేను.

స్కూలు బాలుని సరదాతో విమానంవద్దకు వచ్చి, ఒళ్ళంతా కళ్ళుచేసుకొని చూశాను దాన్ని. విమానాల భోగట్టా కొంత తెలిసిన ఒకమిత్రుడు దాని కిటుకులన్నీ నాకు చూపించి, దాని తోక పడవ చుక్కాని వంటిదనీ, తెల్లగా వెండివలె మెరుస్తున్నదాని రెక్కలు పట్టు గుడ్డతో చేయుబడినవనీ, దాని పెట్రోల్‌టాంక్ పాతిక గాలన్లు పట్టుననీ, పైలట్‌కూ ప్రయాణీకులకూ మధ్య ఒక టెలిఫూన్ కలదనీ, ఏమేమో బోధించాడు.

ఇంతలో బెనర్జీగారు ఎవరితోనో సంభాషిస్తూ ఉంటే, మరికొన్ని వివరాలు నాచెవిని పడ్డాయి.

'ఇప్పుడెక్కడినుండి రాక?'

'గన్నవరంనుండి.'

'ఈ ఊరునుండి మళ్ళీ తిరుగుప్రయాణ మెప్పుడు?'

'ఎల్లుండి గురువారంనాడు.'

'అంతవరకూ యీప్లేను యిక్కడపడి ఉండవలసినదేనా?'

'లేదు. ఇప్పుడు వెంకటాపురం పోయి నూగూరు ఫారెస్టు యావత్తూ చూసి, వెంటనే తిరిగివస్తాం. రేపు లక్కవరం అడవుల తణికీకి వెళ్ళిరావలసిఉంది.'

టాంక్‌లో సారథి పెట్రోల్ పొయ్యడం, యింజన్ కప్పు తెరచి కండిరినూనె వెలపడం, మొదలైన దృశ్యాలలో నిమగ్నుడనై, తక్కిన సంభాషణను నేను విని పించుకో లేదు.

ప్లేనుకు దగ్గరగా నిల్చున్నాను. చుట్టూ పోలీసు అధికార్లు, ఫారెస్టు ఉద్యోగస్తులు మూగిఉన్నారు. చెంతను విల్సన్ దంపతులు తమ నెదుర్కొనవచ్చిన ప్రీస్ట్లీ సతితోను, ఆమె కవలబిడ్డలతోను నవ్వుతూ సంభాషిస్తున్నారు. ముద్దులు మూటగట్టే ఆ పసి బాలికల వేపు చూస్తూ విమానం సంగతే మరచిపోయి, పరధ్యానంగా నిల్చున్నాను నేను. చుట్టూ ఉన్న జనుల సంభాషణ వాక్యాలెవరివీ నాకు వినరాలేదు.

కొంతసేపటికి, '...అయితే మాకు సరదా ఎగుర్లు యివ్వడమెప్పుడు?' అని విల్సన్‌గారితో అంటూ ఉన్న ప్రీస్ట్లీ సతి మాటలు అప్రయత్నంగా నాచెవుల పడ్డాయి.

'మేం మూడుగంటల సరికల్లా తిరిగి వచ్చేస్తా మనుకుంట'. సరదా అయితే అప్పుడు ఎగరవచ్చు......'

అంటూ విల్సన్‌గారు నావేపు తిరిగి, 'మీరిదివరలో ఎప్పుడైనా విమానం ఎక్కిఉంటిరా?' అని ప్రశ్నించారు.

'లేదు.' అన్నాను నేను నవ్వుతూ.

'ఎగురుదామని కుతూహలంగా ఉన్నదా?'

'చాలా!'

'అయితే సాయంత్రం మూడుగంటల తరవాతనే.....'

మరికొంతసేపటికి ప్రీస్ట్లీసతి అమ్మాయిలను తోడ్కొని కారులో వెళ్ళిపోయింది. విల్సన్ దంపతులు, బెనర్జీగారు, పైలట్ దొర, చెంతనున్న గుడారంలో ప్రవేశించారు, అల్పాహారం తీసికొనే నిమిత్తమై.

మిత్రులతో ప్రసంగిస్తూ విమానం నీడనే నిల్చున్నాను నేను. ఎట్లాగైనా యీ విమానంపైని ఎక్కి ఎగరాలన్న కోరిక అప్పుడు క్రమంగా బలపడింది నాలో. నా ఉబలాటం చూసి, నామిత్రుడు పోలీసు డెప్యూటీ తనలో నవ్వుకున్నాడు.

'ఇంతకూ పైలట్ ఏమంటాడో కనుక్కోవద్దూ?' అంటూ ఆయన గుడారంనుండి మావేపు వస్తూఉన్న బెనర్జీగారితో యీ విషయమై ప్రస్తావించారు.

'ఈవాళ కాదు; రేపు ఉదయం! అంటున్నాడు ఎవరెట్ దొర. మైదానం సదునుగా క్షేమంగా లేదట! ఒకటి రెండు చోట్ల మెరకలు కొంచెం తవ్వించవలసిఉంది.' అన్నారు బెనర్జీగారు.

ఇంతలో పోలీసులు జనాన్ని దూరంగా తొలగమని నిర్బంధించారు. ఒక ఫర్లాంగు దూరంలో మేసుకుంటూ ఉన్న రెండు ఎడ్లను సహితం ప్రక్కకు తరిమివేశారు. మైదానం పొడుగున కనుచూపుమేర పిట్ట మనిషికాని, జంతువుకాని, మరియే యితర ఆటంకం కాని లేదు.

ప్లేనుకు ముందువైపున చాచిన చేతులవలె అమర్చబడియున్న స్టార్టర్ తెడ్డును గిర్రున త్రిప్పినాడు పైలట్ కంటికి ఆనని వేగంతో చక్రంవలె అది తిరుగుట మొదలిడగానే, యింజను మ్రోత వినవచ్చింది. చెవులు బ్రద్దలుచేసే చప్పుడది. విల్సన్ దంపతులు, బెనర్జీగారు ప్లేనులో సుఖాసీనులైనారు. తలుపుమూసి, గడియ బిగించినాడు పైలట్. ఇంజన్ మ్రోత వింటూ క్షణమాగి, పిమ్మట పైనుండి యెక్కి తనస్థానమున కూచున్నాడతడు.

ధూళిరేపుతూ ప్లేను కదిలి, చక్రాలమీద ముందుకు పరుగెత్తింది మహావేగంతో. సుమారొక ఫర్లాంగు మేర ఆవిధంగా భూమిమీద పరుగెత్తి, క్రమంగా గాలిలో పైకి తేలిపోయింది. మరుక్షణంలో తలలు పైకెత్తి, ఆకాశంవేపు చూస్తూ నిల్చున్నారు జనం. అంతకంతకూ యింకా యెత్తుగాలేచి, ఊరుమీద ఒకసారి తిరిగి, ఉత్తరముఖంగా సాగి, క్షణంలో అదృశ్యమైంది ప్లేను!

మధ్యాహ్నం 3 గంటలకుకాని తిరిగి రాదనుకున్న ప్లేను రెండున్నరకే వచ్చేసింది. మైదానం మీద అప్పుడు జనం అట్టేలేరు. కాని ఎండ చల్లబడిన తరవాత మళ్ళీ ఊళ్ళోవాళ్ళు తీర్థప్రజవలె బయలుదేరారు విమానం వద్దకు, స్త్రీలను పిల్లలను వెంటబెట్టుకొని. చుట్టు

(పక్కల ఊళ్ళకు రోజూ ప్రయాణించేసే మోటారు బస్సులు నాడు సర్వీసు మానుకొని, ఆమైదానంవద్దకు పదేపదే తిరిగేవి జనాన్ని ఎక్కించుకొని. ప్రొద్దు గ్రుంకేదాకా కాలినడకను, బండ్లమీద, మోటార్లమీద సైకిళ్ళమీద జనులు గుంపులు గుంపులుగా వచ్చి చూశారు విమానాన్ని. నేలపాతిన కొయ్యలకు సన్నని మోకులతో బంధింపబడిన ప్లేనువద్ద కొందరు పోలీసు జవాన్లు కాపలా ఉన్నారు. సర్కస్‌వాళ్ళు పులులను, సింహాలను చూపించినట్లు ప్లేనుచుట్టూ ఒక తెరకట్టి, లోనికివచ్చి చూడడానికి మనిషికి అర్ధణా టిక్కెట్టు అని ఉంటే, నాడు నిజంగా ఎంతడబ్బు వచ్చి యుండునో!...

సరదా ఎగుర్లమాట రూఢిగా కనుక్కుందామని మర్నాడు ఉదయం పోలీసుడెప్యూటీగారి బంగాళాకు బయలుదేరాను—బెనర్జీగారు, పైలట్‌దొర ఎవరెట్‌గారు అక్కడే బస అని తెలుసుకొని.

'...విన్నారా యీసంగతి? నిన్న నూగూరు అడవులలో గడబిడచేసిందట ప్లేను!' అన్నారు నాయుడుగారు నాతో.

'నన్ను నిరుత్సాహపరచి, విమానం ఎక్కనియ్యకుండా బెదిరించాలనా యీ పోలీసు యెత్తు?' అన్నాను నవ్వుతూ.

'చా, కాదు. ఆ అడవులలో చుట్టూ పేళ్ళు కాలుతూ ఉండేనట. ఆ వేడిగాలికి ప్లేను కొంచెం తబ్బిబ్బు అయిందట! ఏదో విపరీతం జరుగుతుందనే అనుకున్నారట బెనర్జీగారు. కాని అదృష్టవశాత్తూ...'

ఇంతలో ఎవరెట్‌గారు మేడదిగివచ్చారు.

'...మా సరదా ఎగుర్లమాట యేం చేశారు?' అన్నారు నాయుడుగారు పైలట్‌తో.

కొంచెం సంశయిస్తూ, 'ఆమైదానం అట్టే బాగు లేదు. ప్రమాదకరమైన ఎత్తుపల్లాలు ఉన్నాయి. కొన్ని కొన్నిచోట్ల యింకా బాగా సదునుచేయిస్తేకాని,...' అన్నారాయన.

'ఇప్పుడక్కడ కూలీలు పనిచేస్తునే ఉన్నారు. సాధ్యమైనంతవరకు సదునుచేయిస్తాం యీపూట.' అన్నాడు చెంతనేఉన్న రేంజరు.

'ఇప్పుడు గాలికూడా అనుకూలంగా లేదని తోస్తుంది.' అన్నాడు ఒక మిత్రుడు, మహా తెలిసినవాడివలె.

'గాలిమాటకేం, అది అంతయిబ్బంది విషయంకాదు. కాని నేలసంగతి ముఖ్యం.' అన్నారు ఎవరెట్‌గారు ఏదో యోచిస్తున్నట్లుగా సిగరెట్టు అదిమిపీలుస్తూ.

'సాధారణంగా ఎంతపొడుగు ఉంటే సరిపోతుంది, సదునుస్థలం?'

'500 గజాలు.'

'వెడల్పో?'

'న్యాయం పట్టిపొడవు, వెడల్పు సమానంగా ఉన్న చదరపు స్థలమైతే సదుపాయంగా ఉంటుంది. అప్పుడు ఏవైపునుంచి దిగడానికైనా వీలుగాఉంటుంది.'

'ఎక్కేటప్పుడు ఎన్నిగజాల పరుగులో పైకి లేస్తుంది ప్లేను?'

'పరిస్థితులను పట్టి ఉంటుంది ఆవిషయం.' అన్నారు ఎవరెట్‌గారు. 'గాలి అనుకూలంగా ఉంటే, నిండు బరువుతోనైనా రెండుమూడువందల గజాలలో తేలిపోతుంది. స్థలంబాగుండి, ప్లేన్‌లో అట్టే బరువు లేనప్పుడు యింకా తక్కువదూరంలోనే లేచిపోతుంది. ప్రయాణీకులు లేని ఖాళీప్లేన్ అయితే 50 గజాలలోనే తేల్తుంది!'

మొత్తానికి పైలట్‌తో అప్పటి మా సంభాషణవలన తేలిన సారాంశం ఏమిటంటే, సరదా ఎగుర్లమాట సందేహాస్పదమని!

'అయినా సాయంత్రం చూదాం' అన్నాడాయన కాస్త ఆశనిస్తూ.

నాడు యించుమించు 11 గంటలప్పుడు అక్కవరం అడవులకు బయలుదేరింది ప్లేను. మధ్యాహ్నం ఒంటిగంటన్నర కల్లా తిరిగి వచ్చింది.

ఆ సాయంత్రమైనా సరదా ఎగుర్లు లభిస్తాయేమో అని ఆశపడ్డాను నేను. ఎంత చార్జీ అయినా యిచ్చి, ఒకసారి ఎగురుదామని నా మిత్రులనేకులు కుతూహలపడ్డారు. కాని చావుకబురు చల్లగా చెప్పినట్లు, సూపరింటు నాయుడుగారు ఉన్నసంగతి తేల్చివేశారు.

'సదును స్థలం సురక్షితంగా లేదంటున్నాడు పైలట్!'

'అయితే మా ఆశలన్నీ గాలిలో మేడలే అయినవన్నమాట ?' అన్నాను నేను, ఏడవలేక నవ్వుతూ.

'పోనీ, అంతసరదా అయితే రేపీ ప్లేనుమీద ఏకంగా చెన్నపట్నమే వెళ్ళరాదూ?' అన్నారు నాయుడుగారు.

'నాకు అర్థంకాలేదు మీరనేమాట.' అన్నాను కలవరపాటులో.

'రేపు ఖాళీప్లేను చెన్నపట్నం పోతుంది. విల్సన్ దంపతులు, బెనర్జీగారు యిక్కడే ఆగిపోతారు. తిరుగు ప్రయాణంమీద ఖాళీగా ప్లేను ఎట్లాగా చెన్నపట్నం పోవలసిఉంది గనుక, కొంత తగ్గింపుచార్జీకి మిమ్మల్ని ఎక్కించుకుందుకు ఒప్పుకోవచ్చును పైలట్ !'

'మరి ఆసంగతి రూఢీగా కనుక్కొని నాకు తెలియజేస్తారా ?'

'పైలట్ సరేఅంటే, మీరు ప్రయాణానికి సిద్ధమేనా?' అన్నారు నాయుడుగారు నవ్వుతూ.

'ఓ, సిద్ధమే!' అన్నాను, తొణుకూ బెణుకూ లేకుండా.

'అయితే, ఏదో ఒకవిధంగా మీ ప్రయాణంకుదిర్చి తీరాలి!' అన్నారాయన చిరునవ్వులో.

ఇంటికివచ్చి నేను పిల్లలతో నా ప్రయాణంగూర్చి చెప్పేసరికి, నాభార్య నన్ను వేళాకోళం చెయ్యడం ప్రారంభించింది.

చివరికి ఆమె, 'సరదా ఎగుర్లపారున్న చాలకనా ?' అన్నాది నవ్వుతూ.

'అదిగో, అప్పుడే చల్లచుక్క వేలుస్తున్నావూ?'

'లేకుంటే, పోలీసుస్నేహితుల మాట నమ్మకోవడమేమిటి మీరు? ఆయన హాస్యానికి ఏదో అని ఉంటారు.'

'సరే, ఏసంగతీ త్వరలోనే తెలుస్తుందిగా? రాత్రి 8 గంటలకి కాయో, పండో తెమిలిపోతుంది. వివరంగా అన్ని సంగతులూ కనుక్కొని అప్పుడు కబురు చేస్తానన్నారు ఆయన.' అన్నాను నేను.

చిరునవ్వుతో, నామాటలయందు నమ్మకం లేనట్లుగా నావేపు అట్టేచూసి, బదులు పలకకుండా ఊరుకుంది లక్ష్మి.

...రాత్రి 9 గంటలయింది. పిల్లలంతా హాయిగా పడుకున్నారు. నాయుడుగారి వద్దనుండి ఏవర్తమానం రాలేదు ఏదోపుస్తకం పట్టుకొని చదువుతూ కూచున్నాను. కాని ధ్యానమంతా విమానప్రయాణం మీదనే ఉండెను. మధ్యమధ్య లక్ష్మి తన యెగతాళి ప్రశ్నలతో నన్ను విసిగించి, అల్లరిచేసేది. గడియారం 10 గంటలు కొట్టిన పిమ్మట యిక ప్రయాణం సంగతి పూర్తిగా నిరాశచేసుకొని, వీధితలుపులు మూసివచ్చి పడుకున్నాను.

'మీకు పిచ్చియెత్తుతున్నట్లుంది! ఎందుకీ లేనిపోని ఆరాటం? విమానం సరదా యిక జీవితమధ్యమందు తీర్చుకోలేక పోతారా? ఈసారి సెలవులలో దిగువుకు వెళ్ళినప్పుడు అన్ని సరదాలు తీర్చుకోవచ్చును... ఇంతకూ యిప్పుడు చెన్నపట్నందాకా ప్రయాణమెందుకు? డబ్బు దండుగకు తప్పు!' అని క్షణం ఊరుకొని, 'బేరంవస్తే ఏనుగుపిల్లను కొనేతత్వం మీది!...నా మాట విని మరి యీప్రయాణం ఊసు తలపెట్టకండి. ఎవరైనా వింటే నవ్విపోతారు.' అంటూ చిన్నపిల్లలకు బోధించేటట్లుగా ఉపన్యాసం ప్రారంభించింది లక్ష్మి.

'కుదరకు నీ కోరికే చెల్లిందిగా ? ఎలాగాలేని ప్రయాణానికి ఎందుకీ సాధింపు?' అన్నాను లేని నవ్వుతెచ్చుకొని.

'నిజంగా గాలిప్రయాణమంటే ఎందుకో మీకీ సంబరం నాకు తెలియకుండా ఉంది.'

'ఏం? ఏదైనా ప్రమాదం వస్తుందేమో అనా నీ భయం? నీకు అంత అయిష్టం, బితుకు, అని తెలిసి ఉంటే—'

'అబ్బే, అట్టిదిగులు నాకెన్నడూ లేదు. రావలసిన యోగం ఉంటే, ప్రమాదాలు విమానం యెక్కితేనే రావాలా యేమిటి? ఆమాటకొస్తే, బస్సు ప్రయాణాలకంటె, పడవ ప్రయాణాలకంటె, గాలిప్రయాణంలోనే ప్రమాదాలు తక్కువ !'

'ఆమాత్రం ధైర్యం, యోచనా శక్తి గలదానవైతే మరి నా ప్రయాణానికి ఎందుకభ్యంతరం పెడుతున్నావు?' అని అడిగాను.

'నేనేమీ అభ్యంతరం పెట్టలేదు. కాని జరగని తలపులు, తీరనికోర్కెలు పెట్టుకోరాదని మనవిచేస్తున్నాను. అంతే.'

నాడు మా ఉభయులకూ నిద్రపట్టేసరికి సుమారు 11 గంటల రాత్రి అయిఉంటుంది.

ఎవరో నన్ను పిలుస్తున్నట్లు అర్ధరాత్రివేళప్పుడు వినవచ్చిందినాకు. లేచి తలుపుతీసేసరికి లాంతరు పట్టుకొని గుమ్మంవద్ద నిల్చున్నాడొకడు.

'ఎవరునువ్వు?'

'సూపరెంటు దొరవారు మీకీ ఉత్తరంయిచ్చి, జవాబు తెమ్మన్నారండి.' అంటూ వాడు నాచేతికొక చీటీ యిచ్చినాడు.

అందు తొందరతో వ్రాసినట్లున్న నాయుడుగారి పంక్తులివి :—

'చెన్నపట్నప్రయాణం కుదిర్చినాను. ఉదయం 9-10 గంటలకు బయలుదేరుటకు సిద్ధముగా ఉండవలెను...'

రాత్రంతా యిక ఒళ్ళుమరచిన నిద్రపట్టలేదు నాకు. అడుగడుగుకీ మెలకువవచ్చేది. ఏవేవో తలపులతో, పిచ్చిపిచ్చి కలలతో, పాన్పుమీద యిటూఅటూ దొర్లుతునే ఉంటిని. వేకువజామునమాత్రం కొద్దిగా కునుకు పట్టినట్లుంది.

కారువచ్చి గుమ్మంలో ఆగిన చప్పుడు విని త్రుళ్ళిపడి లేచాను. అప్పటికప్పుడే సూర్యోదయసమయం కావచ్చింది.

'ఏం? ప్రయాణసన్నాహంలో ఉన్నట్లేనా?' అని పలకరించారు నాయుడుగారు, చిరునవ్వుతో.

'సన్నాహానికేమున్నది గనుక? ఎప్పుడంటే అప్పుడే సిద్ధంనేను.'

'ఎలాగైతేనేమి, మీ సంకల్పం సిద్ధించింది తుదకు. ఇట్టి అవకాశం మళ్లీ యిక ఎవరికీ దొరకదు. నాకుకూడా చెన్నపట్నం రావాలని ఎంతోకోరికగాఉంది.'

'అయితే యికనేం? రండి.'

పెదవి విరిచి ఆయన, 'సెలవుదొరకదు.' అన్నారు నిట్టూర్పుతో.

సామాను అట్టే పట్టుకోవద్దనీ, మంచినీళ్ళ తిత్తి ఒకటి మరచిపోవద్దనీ, తనవద్దనున్న దూరదర్శనియంత్రం తీసుకొపొమ్మనీ, యింకా యేవేవో సలహాలుయిచ్చారు ఆయన.

'సరీగా ఎన్నిగంటలకు బయలుదేరడం?'

'10 గంటలకు అని అంటున్నాడు పైలట్. కాని, ......సరే, ఎప్పుడైతేనేం? మీరు భోంచేసి సిద్ధంగా ఉండండి. ఆవేళకు నేను నా కారు పంపుతాను.'

ఉదయమే అని అనుకున్న ప్రయాణం మధ్యాహ్నానికి డేకిరింది. 'ఒంటిగంటకు' అని కబురువచ్చింది నాకు. నా ప్రయాణంవార్త ఊరంతా ఆ బాలగోపాలమూ తెలిసింది. ఎండను లక్ష్యపెట్టక అనేకులు మైదానంవద్ద చేరినారు.

బంధుమిత్ర సకుటుంబసపరివార సమేతుడనై ఒంటిగంటన్నరకల్లా ప్లేనువద్దకు వచ్చాను నేను. అక్కడ చూడడానికి వచ్చిన జనమేకాక, ఒక సోడాషాపు, ఒక కిల్లీదుకాణంకూడా ప్రత్యక్షమైనాయి. మిత్రులతో సంభాషిస్తూ కొంతసేపు గుడారంలో విశ్రాంతిగా కూచున్నాను. పిల్లలు సమీపంలో తన స్నేహితురాండ్రతో ముచ్చటిస్తూఉన్న లక్ష్మివద్దనుండి నావద్దకు, నా వద్దనుండి ఆమెవద్దకు కిలకిల పరుగులెత్తుతూ ఆడుకుంటున్నారు.

ఆమెతో, 'మీరు, పిల్లలుకూడా ఎగిరితే బాగుండేది.' అని ఎవరో ఒకఆమె ఉత్సాహంతో అంటున్న మాటలు వినిపించాయి నాకు.

'ఈ ఆటంకమే లేకపోతే, తప్పకుండా ఎగిరి ఉందును. నిండునెలలు కదా అని భయం!' అన్నాది లక్ష్మి ముసిముసి నవ్వుతో.

ఇంతలో విల్సన్ దంపతులు, బెనర్జీగారు, పైలట్ దొర వచ్చినారు. అప్పటికి పావుతక్కువ 2 గంటలు అయిఉండెను.

అందరం ప్లేనువద్దచేరినాము. మిత్రులందరివద్దా సెలవుపుచ్చుకొని, మహా ఉత్సాహంతో యిక ప్లేనులో ప్రవేశించనున్నాను. బెనర్జీగారు, విల్సన్ గారు నాతో హెచ్చరిక మాటలేవో చెబుతూ, కాబిన్ తలుపులు ఎట్లుమూసి ఊడిపోకుండా గడియవేసుకొనవలెనో, మైకాకిటికీలు ఎట్లు తెరుచుకొనవచ్చునో, ప్లేను ఎగురుతూ ఒకవైపుకు ఒరిగినప్పుడు నా స్థానమందు నేను ఏవిధంగా సర్దుకొనికూచుంటే సదుపాయమో, అన్నీ చూపించి బోధించారు.

'ఇదే తొలిసారి యెగరడంకదూ? ఏమీ ఫరవా

లేదు......మంచి ఖులాసాగా ఉంటుంది.' అన్నారు విల్సన్‌గారు ప్రోత్సాహస్వరంతో.

నవ్వులాటకు చాటుగా నాతో, '......వీలురాసి ఉంచినారా?' అన్నారు బెనర్జీగారు పకపకనవ్వుతూ.

'అట్టి అగత్యం రాకూడదు మరి,......'అన్నాను, నాకూ నవ్వువచ్చి.

'అన్నట్లు, ఆ కాబిన్‌లో కొన్ని కాగితంసంచీలు భద్రపరచబడిఉన్నాయి, చూశారా?...వాటి ఉపయోగం తెలుసునుకదూ?'

'తెలుసు. కాని వాటి అవసరం పడదనీ—పడకూడదనీ—నా నమ్మకం! అయినా, వాటిసంగతి నాకు జ్ఞాపకం చేసినందుకుగాను మీకు నా మనఃపూర్వక వందనాలు.' అన్నాను.

ఇంజను స్టార్ట్‌అయింది. ప్లేనంతా సన్ననిరుదుపుతో తోకవరకూ గజగజలాడుతూ ఉంది. చుట్టూఉన్న జనులు దూరంగా తొలగిపోతున్నారు.

'ఊఁ...త్వరగా తెమిలి ఎక్కండిమరి.' అన్నారు నాయుడుగారు నా భుజంమీద చనువుగా తట్టుతూ.

'తొందరలేదు. ఇప్పుడప్పుడే కదలిపోము యింకా.' అన్నాడు పైలట్.

మిత్రులొక్కొక్కరివద్ద నే సెలవుదీసుకున్నాను.

'అమ్మా, పోయివస్తాను, సెలవు!' అన్నాను నాయుడుగారి సతీమణితో.

'మంచిది. క్షేమంగా తిరిగిరండి.' అని ఆశీర్వదించింది ఆమె.

చెయ్యిచ్చి, దయతో నాకు సెలవొసగుతూ, 'మీ భార్యావద్ద సెలవుదీసుకున్నారా?' అని అడిగింది, మందహాసంతో విల్సన్‌సతి.

ఆంగ్లేయపద్ధతి ననుసరించి, యిందరిలోను నేను నా లక్ష్మిని కౌగలించుకొని, ముద్దులతో సెలవుదీసుకొనవలెనని కాబోలు ఆమె ఊహ! మనసు వాస్తవంగా ఎంతకొట్లాడినా, అట్లా చేయడానికిమాత్రం ధైర్యంచాలలేదు నాకు.

'లక్ష్మీ, పోయిరానా మరి?...' అన్నాను నా కామెయెడల గల ప్రేమానురాగాన్ని కళ్ళతోమాత్రం ప్రకటించుకొని.

మనసులో ఆ ఆఖరునిమిషమందు హఠాత్తుగా పొంగుకొచ్చిన దిగులును, అధైర్యాన్ని కొంత కష్టం మీద అణచుకుంటూ చిరునగవుతో నాకు సెలవొసగి, 'అక్కడ చేరినవెంటనే నాకు టెలిగ్రాం యివ్వండి.' అన్నాది లక్ష్మి అస్పష్టస్వరంతో.

తల్లికి మిక్కిలి దగ్గరగా మూగినిల్చున్న పిల్లల వైపు మరొకసారిచూసి, నవ్వుతూ చేయి ఊపి, విమానమెక్కి కూచున్నాను.

ఎడంగానిల్చుని ఛాయాయంత్రాన్ని సరిచూస్తూ విల్సన్‌గారు నాతో, 'ఆ కిటికీ మరికొంచెం తెరచి, యిటుచూడండి. ఫోటో తీస్తున్నాను.' అన్నారు.

మరుసటి క్షణమందు 'సెలవు' అంటూ అందరివైపూ చెయ్యి ఊపుతూ 'త్రాటిల్' తెరచినాడు పైలట్. ప్లేనుకదలి త్వరితగమనంతో ముందుకు సాగింది చక్రాలమీద. మైదానం మిక్కిలి సదునుగా లేదన్న విషయం అప్పుడు అర్థమైంది నాకు. ఎత్తుపల్లాల మీదుగా కెరటములపైవలె ముందుకు దూకుడుగా చక్రాలపై జారునట్లు దొర్లుతూ కొంతదూరం పరుగెత్తి, క్రమంగా త్వరలోనే పైకి తేలిపోయింది ప్లేను. భూమితోసంబంధం త్రెంచుకొని, సజీవంగా స్వర్గంవైపుగాలిలో ఎగిరిపోతూఉన్న నాకా నిమిషంలో చెప్పనలవికాని ఆనందం, విస్మయం, తన్మయత్వం కలిగాయి! గ్రుడ్డునుండి పొదుగబడిన పిమ్మట, అదే తొలిసారి తన రెక్కలప్రభావాన్ని తెలిసికొగలిగిన పక్షికి ఎట్లుండునో, నాకును ఆ వింత యనుభవమట్లేయుండును. అందు హాయి, బెదరుపాటు, నూతనత్వము, ఉత్సాహము, ఉద్రేకము—అన్నియు మిశ్రమమై యుండెను!

ప్లేను క్రమంగా యింకా యింకా ఎత్తుగా గాలిలోలేచి, ఊగుతూ, ఒరుగుతూ, ఒయ్యారంగా మయిదానం చుట్టూ గిర్రున తిరిగి, దిగువను తలలు పైకెత్తి దానిని అట్టే చూస్తున్న మిత్రబృందము వైపు ఒకసారి మిక్కిలి చేరువగా, ప్రక్కగా, ప్రమాదకరంగా, మీద పడునట్లు ఒరిగి, మరల చప్పున సురక్షితంగా పైకి తేలిపోయింది.

—సశేషము.

—తాత కృష్ణమూర్తి, బి.ఏ; యల్.టి

## మీ ప్రియమైన పుత్రుడు:

మీ పూర్వజన్మతపఃఫలరూపుడగు మీ చిన్నిబిడ్డని, మీ రెంతయో జాగ్రత్తతో పోషించుచున్నారు. వాని చిన్నతనమునుండియు మీ మీ శక్తుల ననుసరించి అతని కే కొఱంతయు లేకుండునట్లు చూచుచున్నారు. సర్వవిధ సౌఖ్యములయందును నోలలాడించు చున్నారు. అతని సౌఖ్యముల కెంతయో ధనము వెచ్చించుచు న్నారు. చాల ధనము పెట్టుబడిపెట్టి విద్యాబుద్ధుల గఱపుచున్నారు. కాని యుక్తవయస్కుడై, విద్యావంతుడై, పట్టభద్రుడై జీవిత రంగమున, కాలుబెట్టినవెంటనే అనేకవిధములగు సమస్యలు అతని నెదుర్కొనుచున్నవి. ఉద్యోగములా, లేవు. వ్యాపారము నకా, పుష్కలమగు ధనము పెట్టుబడి యవసరము. గనుక అందు లకు మీ రేమి సదుపాయము చేసితిరి? మీరు చేయుసదుపాయ ములు భద్రమైనట్టివియు నిశ్చయమైనట్టివియు యుండవలయును కాని ఒడుదుడుకులు ఉండునట్టివిగా నుండకూడదు. అట్టి సదుపా యమెద్ది? ఇందులగురించి వివరములు కావలసినచో యీ క్రింది అడ్రస్సుకు 10-వ నెంబరు పట్టీనిమిత్తము వ్రాసినచో బడయవచ్చును.

**జయ్‌విజయ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్.**

**16, లింగిచెట్టివీధి, మదరాసు.**



## వైద్యయోగరత్నావళి

(అచ్చగుచున్నది) వెల రు 1—8—0.

సంపాదకుడు :—ములుగు రామలింగయ్యగారు.

ఇందు గవర్నమెంటు G.O. 2411 of 1929 నెంబరుగల పుస్తకమందు సర్వప్రకరణములను చేయుపద్ధతి వివరముగ వ్రాయబడినది. మరియు సాంప్ర దాయయోగములును, అవసరమైన పరిభాషయు నిందు చేర్పబడినవి. ఇది ఆయు ర్వేద మెడికల్ ఆఫీసర్లకును, ఔషధములను తయ్యారుచేయు ఫార్మసీలవారికిని, ఇతరవైద్యులకును మిక్కిలి యుపయోగకరము. చాలా పరిశ్రమచేసి మూల గ్రంథములను సంపాదించి ప్రకరణములను వివరించివ్రాసి వానికి ఆంధ్రతాత్ప ర్యము వివరముగ వ్రాయబడినది.

**వలయువారీక్రింది చిరునామాలకు వ్రాయవలెను :—**

ములుగు రామలింగయ్యగారు,

ది ఇండియన్ మెడికల్ స్టోర్సు, [రిజిష్టర్డు] తెనాలి (గుంటూరుజిల్లా)

మదరాసు ఏజన్సీ—ఆంధ్రభూమి కార్యాలయం, వేపేరి, మద్రాసు.

# ఇన్స్యూరెన్సు విషయములు

## భీమాకంపెనీలు — ఏజంట్లు — ప్రజలు

[ఆంధ్ర ఇన్స్యూరెన్సుకంపెనీ యేజంట్ల సంఘపు 2-వ వార్షికసభలో చదివినవ్యాసము]

### జీవితభీమా ప్రతినిధి వృత్తి

జీవితభీమాకంపెనీలకు ఏజంట్లుగా (ప్రతినిధులు) పనిచేయడమనేది కూడా ఇతరవృత్తులవంటిదే యై యున్నది. అనగా వైద్యుడు, ప్లీడరు, ఉపాధ్యాయుడు, వడ్డీవర్తకం మున్నగు వృత్తుల కెంతమాత్రము తీసిపోవదు—ఇతరవృత్తు లన్నిటికన్న యీ వృత్తిలో వర్తకవ్యాపారము, సరకు అమ్మకము, గణితము, మనస్సు, సంఘము, తర్కము, న్యాయశాస్త్రము మున్నగు శాస్త్రములకు సంబంధించిన విజ్ఞానముతో కూడియున్న వృత్తిగాని సామాన్యమైన వృత్తిగా పరిగణింప వీలులేదు—వాణిజ్య, గణిత, తర్క, న్యాయ శాస్త్రములు మున్నగువాటిని చదివినంతటితో తృప్తి జెంద వీలుతగినదియులేదు. చదివినదానిని ఆచరణలోనికి తెచ్చి పాటుబడునపుడే జీవితభీమా ప్రతినిధి అను యీ వృత్తియొక్క పదము సార్థకములోనికి వచ్చును.

జీవితభీమాయొక్క ప్రాముఖ్యతను యిపుడిపుడే మానవజీవితమునకు తిండి, బట్ట, నీడ ఎంత అగత్యమో అంత అగత్యమైయున్నదన్న సంగతిని గుర్తింపుచున్నారు. దీనియొక్క ప్రాముఖ్యత పాశ్చాత్య దేశీయులు గుర్తించినందుననే ఒక్క అమెరికాదేశమున యీ దిగువరీతిగ యీ వృత్తిలో పనిచేయువారి సంఖ్యయు అందుకు సంబంధించిన పాఠశాలలు అందలి విద్యార్థుల సంఖ్యయునుండెను. అమెరికాదేశములోని భీమాకంపెనీల సంఖ్య 1100. అందు పనిచేయు ప్రతినిధులసంఖ్య 6 లక్షల 75వేలు. కంపెనీ కార్యాలయములలో ఉద్యోగీయులుగ పనిచేయువారి సంఖ్య 2 లక్షలు. వెరశి రమారమి 9 లక్షలు. ఈ 9 లక్షలమంది కుటుంబానికి 5 చొ॥ 45 లక్షలమంది ప్రజలను యీ వృత్తివల్లను పోషించుకొనుచున్నారు. అమెరికాదేశపు జనాభా 12 కోట్ల 26 లక్షల 98 వేలుండెను. ఈ జనాభాలో ప్రతి 1000 మంది జనాభాలో 4 గురు యీ వృత్తివల్ల పోషింపబడుచున్నారు

అమెరికాలోనున్న 300 పాఠశాలలలో 2 లక్షల మంది విద్యార్థులు యీ వృత్తివిద్యలో తరిబీదు అగుచున్నారు.

ఈ పై అంకెలకున్ను మన భారత దేశములోని అంకెలకున్ను సరిపోల్చిజూచుకున్న మన దేశమెంత వెనుకబడియున్నదో ఆశ్చర్యకరముగనుండును. 1932 సాలు ఆఖరునకు ఇండియాలో 169 స్వదేశీ భీమాకంపెనీలున్ను 150 విదేశీ భీమాకంపెనీల చీఫ్ ఏజన్సీ లేక బ్రాంచి ఆఫీసులున్ను పనిచేయుచుండెను.

ఈ 169 భీమాకంపెనీలలో రమారమి 40 వేలమంది ప్రతినిధులున్ను 10 వేలమంది కంపెనీకార్యాలయములలో పనిచేయువారుండవచ్చును. 150 విదేశీకంపెనీల లోనివారిని కలపిన మరో 10 వేలుండవచ్చును. వెరశి 60 వేలకన్న హెచ్చుమంది యుండరనియు వీరివల్ల భారతీయజనాభా సుమారు 35 కోట్ల మందిలో 3 లక్షలమంది మాత్రమే యీ వృత్తివల్ల పోషింపబడుచున్నారని చెప్పవచ్చును.

భీమావ్యాపార విద్యకు ప్రత్యేకపాఠశాలలు లేవనియే చెప్పవలెను. ఈ మధ్యనే కలకత్తాలో ఇన్స్యూరెన్సుకాలేజీ అను పేరిట నొకదానిని అచ్చోట విద్యావంతులు అభిమానులు నెలకొల్పిరి. కలకత్తా యూనివరుసిటీ బి-కాము పరీక్షలో నొకభాగముగ యీ విద్య

కూడా నుండుటకు ఆ యూనివరుసిటీవారు అంగీకరించిరి. మన ఆంధ్ర దేశమున రాజమహేంద్రవరమున ఆంధ్రా కాలేజి అఫ్ కామర్సును కొందరు విద్యాసంతులు అభిమానులు కలసి నెలకొల్పిన దానిలోకూడ యీ విద్య నేర్పబడుచుండెను. దీనినిబట్టి యీ వృత్తిలోకూడ . ఎంత వెనుకబడియుంటిమో గ్రహింపుడు.

## భీమాఏజంట్ల సంఘములు

ప్రస్తుతకాలమున ఏ వృత్తిలోనున్నవారు ఆ వృత్తియొక్క వ్యాపార దక్షతకుగాను సంఘముల నేర్పాటు చేసుకొనుటగలదు. అదేమాదిరిగా భారతదేశములోని స్వదేశీ భీమాఏజంటులు సంఘమును నెలకొల్పి యీ సభను 13-12-1931 సం॥మున కలకత్తాలో ఇండియన్ ఇన్స్యూరెన్సు ఇన్‌స్టిట్యూటువారి యాజమాన్యమునను ఐ.బి.సేన్ (చీఫ్ ఏజంటు బాంబేలైఫ్ ఎస్యూరెన్సు కంపెనీ) గారి అధ్యక్షత క్రిందను జరిగెను. రెండవది 22-4-33 సం॥రమున కలకత్తాలో శ్రీ జె.సి. ఘోష్ దస్తిదార్ (చీఫ్ ఏజంటు మ్యూచియల్ లైఫ్ ఏస్యూరెన్సు కంపెనీ) గారి అధ్యక్షతక్రిందను జరిగెను.

మన ఆంధ్రదేశమున ఏప్రిలు 1932 సం॥రమున ఆంధ్రదేశమున పనిచేయు భీమాఏజెంటుల సభను బెజవాడలో శ్రీ సూరంపూడి కనకరాజుగారి కృషివల్లనున్ను శ్రీ కే.బి. మాధవన్ గారి అధ్యక్షతక్రిందనున్ను (మైసూరు యూనివరుసిటీలో ప్రొఫెసరుగానున్నారు) జరిగెను.

ఏ కంపెనీకి ఆకంపెనీలో పనిచేయు ఏజంటులంతా సంఘముగాకూడి పనిచేయుటకూడ అత్యవసరమని ఎంచియో ఆంధ్రా ఇన్స్యూరెన్సుకంపెనీ ఏజంటులంతా 1934 మార్చిలో బందరులో సమావేశమై శ్రీ చెరుకువాడ వేంకటనరసింహంగారి అధ్యక్షతక్రిందను సభను జరిపి కొన్ని నిబంధనలతోకూడిన సంపుటమును ఏర్పాటుచేసుకొని పనిచేయుచుండిరి.

## భీమాఏజంట్లు—భీమాకంపెనీలు

భీమాఏజంట్లకు కంపెనీలకుపున్న సంబంధమును కంపెనీలవారు సరిగా గుర్తించినట్లగపడదు. కంపెనీకి పెట్టుబడిపెట్టిన వాటాదార్లు, కంపెనీలో పనిచేయు ఉద్యోగియులుకన్న కంపెనీని ప్రజలలో బాగా వ్యాపకం చేయుటకున్ను కంపెనీని అభివృద్ధిలోనికి తెచ్చుటకున్ను ఏజంట్లే ముఖ్యులని గ్రహించినచో ఏజంట్లసంఘమును కంపెనీలవారే స్థాపించి అట్టి సంఘముయొక్క అభివృద్ధికి వారే పాటుబడుట మంచిదన్న సంగతిని గ్రహించిన కంపెనీలు లేవనియే చెప్పవచ్చును. ఏ కంపెనీ ఏజంట్లయినా సంఘంగాకూడి పనిచేస్తూవుంటే అట్టి సంఘము కంపెనీయొక్క సి ఐ.డి. (రహస్యపోలీసుశాఖ)గా ఏర్పడినదేమోయను అనుమానములుగూడ కంపెనీలకున్నటుల తోచుచున్నది. కంపెనీలవారు ఏజంట్ల సంఘములతోకూడి ఒకరి యభివృద్ధికి నొకరు మార్గములను ప్రణాళికలను ఏర్పాటుచేసుకొని పనిచేసినచో త్వరలో యీ దేశమునకూడ యీ భీమావ్యాపారము అభివృద్ధిలోనికి వచ్చుటయేగాక వ్యాపార నిపుణతలోగూడ ఘనతను సంపాదించి స్వాతంత్ర్యముగల యితర దేశములతో యీ భీమావ్యాపారమందుకూడ వారికన్న వెనుకబడియుండలేదన్న సంగతిని ఋజువుచేసుకొనవీలగును.

ఏజంట్ల సంఘముతరపున కొందరిని తప్పక కంపెనీ డైరెక్టర్లలో చేర్చుకొను ఏర్పాట్లుండవలెను. ఈ ఏర్పాట్లు చేసినచో కంపెనీలవారికి ఏమి ముప్పువాటిల్లునోయను భయముకుంది. యిట్టి భయమునుబట్టియే కంపెనీకి ఏజంటులకునుండే సంబంధము తాత్కాలికముగనున్నదనియే చెప్ప సాహసించుటలో తప్పుండదని నా అభిప్రాయము. ఏజంటుల సంఘములోకూడ కంపెనీ డైరెక్టర్లలో కొందరిని సంఘసభ్యులుగా చేర్చుకొనవలెను. ఇది సులువుగానే ఏజంటులసంఘంవారు వప్పుకొందురని చెప్పుటలో ఆశ్చర్యముండదు.

## భీమాకంపెనీలయొక్క వ్యాపారదక్షత—ఏజంట్ల బాధ్యత

భీమాకంపెనీల యొక్క భావిభాగ్యోదయమంతయు ఏజంటుల మీదనే ఆధారపడియున్నది. కంపెనీ లెక్కల తనిఖీకి ఆడిటరు, ఆక్చ్యుయరీ ఎంతముఖ్యులో ఏజంటులు కూడా అంతకన్న ముఖ్యులన్న సంగతిని కంపెనీలవారు, ఏజంటులింకా గ్రహించినట్లగపడదు. ఏజంటులుచేసే మంచి వ్యాపారముమీదనే కంపెనీ అభివృద్ధి ఆధార

పడియున్నది గాన భీమాశాస్త్రము సంతటిలో ప్రవేశము లేని ఏజంటులవలన కంపెనీకి లాభంలేదు. అందరు ఏజంటులు భీమాశాస్త్రంలో యీ రోజున ప్రవీణులగుదురా యను ప్రశ్న వేయవచ్చును. ఇందులకుగానుకంపెనీలవారు నొక గ్రంథాలయమును స్థాపించి ఆ గ్రంథాలయమందు ఏజంట్లను సభ్యులనుగాచేర్చుకొని అట్టివారికి అందుండే గ్రంథములను, పత్రికలను సప్లయిచేసుకొను చుండుట వలన కొంతవరకు వారికి విద్యనుగఱపు మార్గ మేర్పడును. ఏడాదిలో కొన్నిసారులు ఈ శాస్త్రమునకు సంబంధించిన ఉపన్యాసములను ఏజంటులను రప్పించి వారికి యిప్పించే ఏర్పాటులు చేయవచ్చును. ఇదిగాక ఏడాదికొకసారి ప్రశ్నావళిరూపమున ఏజంటులకు పంపి జవాబులను తెప్పించి ఆరీత్యా ఆ ఏడాదిలో చదివినదానిపై పరిశీలనను గావింపవచ్చును. ఈ మాదిరీ ఏర్పాటులను పాతఏజంటులకు చేయవచ్చును. లేదా పాతఏజంటులలో యువకులను భీమాశాస్త్ర పరీక్షలకు హాజరగుటకు తగు ఉత్సాహమును సౌకర్యములను గఱపవచ్చును. క్రొత్తగా నియమించబోవు ఏజంటులలో యీ భీమాశాస్త్రవిద్య నభ్యసించిన వారికి కొన్ని అధికసౌకర్యములతో ఏజంటులుగా నియమింపబడునను షరతు లేర్పాటులుచేసుకోవచ్చును. ఇట్టి ఏర్పాటులలేకుండా యింకను మూకవుమ్మడిగా ఏదో ఏజంటులను నియమించి పనిచేసుకుపోవడమనే పద్ధతిలోనే వుండడం రానురాను ఎంత మాత్రం శ్రేయస్కరము కానేరదని ఏజంటులు కంపెనీలవారు గ్రహింతురుగాక!

భీమాకంపెనీలకు ఏజంటులుగా ప్రవేశించుటకు ముందుగా తన కమీషను షరతులనేగాక కంపెనీయొక్క వ్యాపారపరిస్థితులను బాగా తెలిసికొనియే ప్రవేశించవలెను ఇందులకుగాను (1) కంపెనీ పుట్టినప్పటినుండి ఏటేటాజరిగే వ్యాపారంలో అభివృద్ధి వుందో లేదో తెలిసికొనుట (2) కంపెనీయొక్క నిబంధనలు పట్టాదార్లకు, ఏజంట్లకు అనుకూలముగనుండెనో లేదో తెలుసుకొనుట (3) కంపెనీ డైరెక్టర్లలో పట్టాదార్లకున్ను ఏజంట్లకున్ను ప్రాతినిధ్యమున్నదో లేదో జూచుకొనుట (4) కంపెనీ లాభములలో పట్టాదారుల కెంత భాగము, వాటాదారులకెంత భాగమున్నదో తెలిసికొనుట (5) పట్టాషరతులు కంపెనీ డైరెక్టర్ల లాభము ననుసరించియుండెనో పట్టాదార్లలాభమున కుపకరించురీతిని నుండెనో తెలిసికొనుటకు ముఖ్యంగా పట్టాషరతులను తెలిసికొనుట (6) డైరెక్టర్లలో బ్యాంకింగు, ఆర్థికము, న్యాయశాస్త్రము, వైద్యము, ఇన్స్యూరెన్సుశాస్త్రము వ్యాపారానుభవము లేక ప్రవీణతగలిగిన వారున్నారా లేక యీ డైరెక్టర్లంతా ఏ ఒకరిద్దరిచెప్పుచేతలలో నున్నారా అనునది తెలిసికొనుట (7) పనిచేయుచున్న ఏజంటులకు కంపెనీకి ఎట్టి సంబంధముంటున్నదో తెలిసికొనుట (8) పెట్టుబడిసొమ్ము తగిన కట్టుదిట్టములతో నున్నదో లేదో తెలిసికొనుటకు ఆడిటురిపోర్టున్ను (9) పట్టాదారులకిచ్చే లాభములు సరియైనభద్రతతో యిచ్చినది లేనిది తెలిసికొనుటకు వాల్యుయేషను రిపోర్టున్ను బాగా పరిశీలించి తెలిసికొనుట (10) మరణములసంఖ్య, రద్దయిన పట్టాలసంఖ్య కంపెనీఖర్చులు దామాయిషాను ఏటేటా వ్యాపారమునుబట్టి వుండవలసిన సంఖ్యకన్న హెచ్చున్నదో లేదో తెలిసికొనుటలో హెచ్చు శ్రద్ధ వహించిన పిమ్మటనే ఏజంటుగా ప్రవేశించవలెను. యేజన్సీషరతులు ఒక్కకంపెనీకే అనుకూలంగా నున్నవో లేక వుభయులపట్ల అనుకూలంగా నున్నవో లేవో జూచుకొని నిర్ణయించుకొనిన పిమ్మటనే యేజంటుగా ప్రవేశించుట మంచిదై యుండును. సాధారణంగా యేజంటులు కొన్నివత్సరాలు పనిచేసేసరికి కొంత రెన్యూయల్సువల్ల సాలీనావచ్చుచుండును. ఈలాయిచ్చే రెన్యూయల్సు వృధాగా యిస్తున్నవేమోయని కంపెనీవారు రానురాను అనుకొనుట సహజము. అట్టిస్థితులలో యేజంటులకు, కంపెనీకివున్న సంబంధం హెచ్చవడానికి బదులు విడాకులు తీసుకొనుటకే వుపకరించుచుండటం అమలులోనున్నదని చెప్పుటలో తప్పుకాదని నా విశ్వాసము. రానురాను యేజంటులకు కంపెనీకి వుండే అవినాభావసంబంధం హెచ్చినగాని కంపెనీ అభివృద్ధిలోనికి రాజాలదని కంపెనీలవారున్ను తరచు ఒక కంపెనీనుండి మరోకంపెనీకి మారడంవలన లాభంలేదని యేజంటులున్ను గ్రహింతురుగాక! —(సశేషము.)

—శనివారపు సుబ్బారావు.

## వ్యాయామక్రీడలయందు

### తగులు అపాయకరమైన గాయములకు




# అమృతాంజనము

### అద్భుత నివారణి

కోట్లకొలది విక్రయము. అన్నిచోట్ల దొరుకును.

ఈ ట్రేడుమార్కును గమనించుడు.

[టెలిగ్రాము : లివర్ క్యూరు] [టెలిఫోను నెం. 8139.

# డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి ప్రసిద్ధిచెందిన లివర్ అండ్ స్ప్లీన్ స్పెసిఫిక్.



అద్వితీయము !



అసమానము !

"చికిత్సావిధానమున ఒక క్రొత్తమందు."

"మృత్యుముఖమునుండి వేలకొలది శిశువులను రక్షించినది."

"రోగనిరోధమునకు కూడ సాటిలేని మందు."

If your Children suffer from LIVER & SPLEEN COMPLAINTS start giving them to-day

JAMMI VENKATARAMANAYYA'S FAMOUS LIVER & SPLEEN SPECIFICS

8, SALAI STREET, MYLAPORE, MADRAS.

## పిల్లలకు

కడుపులో బల్ల, గడ్డ మొదలగు లీవర్ అందు ప్లీను వ్యాధులకు లోకప్రఖ్యాతి చెందిన డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి దివ్యౌషధమును ఉపయోగింపుడు. శిశువులకు ఆకలి, జీర్ణశక్తులను వృద్ధిపరచి మలబద్ధము లేకుండా కాలవిరేచనము సరిగా అవుటకును, రక్తమును శుభ్రపరచుటకును వాడతగిన ఔషధరాజము.

## హూకో

శిశువులను కోరింత దగ్గు వ్యాధినుండి రక్షించు దివ్యౌషధము.

హెడ్ ఆఫీసు : 8, సాలై వీధి, మైలాపూర్, మదరాసు.

బ్రాంచి ఆఫీసు : 125, హారిసన్ రోడ్డు, కలకత్తా.